ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి


# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

మంగళవారం 08 సెప్టెంబర్ 2026 | Tuesday 08 Septembar 2026 | హైదరాబాద్ Hyderabad
సంపుటి: 28 సంచిక: 147 | Vol.No 28 Issue No .147
⇨ పేజీలు: 12+12 ⇨ వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం | రాత్రి వారికి మంచి అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ : 9440897445, 8074636674

త్రివిధ దళాల సామర్థ్యం
## మరింత బలోపేతం

- 1.10 లక్షల కోట్లతో ఆయుధాలు కొనుగోళ్లు
- అత్యాధునిక ఆరుద్ర రాడార్లుకు ప్రాముఖ్యత
- కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర



న్యూఢిల్లీ,సెప్టెంబర్7 : దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు మిగతా 2లో..

భగ్గుమన్న
## చమురు ధరలు!!

- హర్మూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్తత
- భారీగా తగ్గిన నౌకల రాకపోకలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్7 : పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య నౌకలపై పరస్పర దాడులు జరగడంతో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలతో సరఫరాకు దీర్ఘకాలిక అంతరాయం కలుగుతుందన్న భయాలు మార్కెట్లను కుదిపేస్తున్నాయి. ఇరాన్ మిగతా 2లో..

## కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు గల్లంతు
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర
- దీనిపై లౌకిక శక్తులు ఏకం కావాలి
- సర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




హైదరాబాద్,సెప్టెంబర్7 : తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు మిగతా 2లో..

ప్రారంభమైన తెలంగాణ
## అసెంబ్లీ సమావేశాలు

- నిషేధిత భూములు 22ఏ జాబితాపై సభలో రగడ
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో బీజేపీ నినాదాలు
- 22ఏ అంశంపై చర్చకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం
- సభ సజావుగా సాగేందుకు సహకరించాలి
- 22ఏ జాబితాపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ
- వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,సెప్టెంబర్7 : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే నిషేధిత భూములు 22ఏ జాబితా వ్యవహారంపై సభలో రగడ మొదలైంది. 22ఏ నిషేధిత భూముల నిబంధన కింద ప్రైవేట్ భూముల నమోదుపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో నినాదాలు చేశారు. ఈ వివాదంపై తక్షణమే విచారణ కమిటీని వేయాలని బీజేపీ సభ్యులు ప్రభుత్వాన్ని పట్టుబట్టారు. ఈ ఆందోళనపై శాసనసభ మిగతా 2లో..

# అసెంబ్లీ వద్ద రచ్చ..

- సమావేశాల ప్రారంభానికి ముందు ఉద్రిక్తత
- హామీల అమలుపై బీఆర్ఎస్ నేతల నిరసన
- నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి నేతలు
- నినాదాలు, ప్లకార్డులతో మూకుమ్మడి నిరసన
- పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం, తోపులాట
- అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్
- మరింతగా నెలకొన్న ఉద్రిక్త వాతావరణం
- పోలీసులతో వాగ్వాదంలో కేటీఆర్ కు గాయాలు
- ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డ బీఆర్ఎస్
- పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో కేటీఆర్ ఆగ్రహం
- తోపులాటలో గాయపడ్డ మహిళా ఎమ్మెల్యేలు
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు



హైదరాబాద్,సెప్టెంబర్7 : తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు అసెంబ్లీ ముందు ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన, హామీల అమలుపై నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి రావడం అసలు ఘర్షణకు కారణం అయింది. నినాదాలు, ప్లకార్డులతో వచ్చిన బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీలోకి నల్ల టీషర్టులతో వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా హరీశ్‌రావు బ్లాక్ టీషర్ట్ విప్పి బనియన్‌తో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఇదే విధంగా టీషర్టులు విప్పి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్ చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే నల్ల టీషర్ట్ ధరించి అసెంబ్లీకి రావడంపై పోలీసులు అభ్యంతరం చెప్పడాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ టీషర్ట్ ధరించి పార్లమెంట్‌కు వెళ్తే తప్పు లేనప్పుడు.. తాము నల్ల టీషర్టులు వేసుకుని నిరసన తెలపడం ఎందుకు తప్పని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తమ నిరసనను అడ్డుకుంటోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఇక.. బీఆర్ఎస్ మిగతా 2లో..

స్పీకర్‌పై తాతా మధు
## అనుచిత వ్యాఖ్యలు..!

- వ్యాఖ్యలతో అసెంబ్లీలో రాజకీయ దుమారం
- కంటతడి పెట్టుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్
- మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాల్సిందే
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో రాజకీయ దుమారం నెలకొంది.

## 22ఏ పేరుతో సాగుతున్న భూదందా

- భూదందా వెనుక పొంగులేటి ఉన్నారు, • వేల కోట్లు కొల్లగొడుతున్న పొంగులేటి, • సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి, • బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, • గన్‌పార్క్ వద్ద బీజేపీ తీవ్ర నిరసన



హైదరాబాద్,సెప్టెంబర్7 : రాష్ట్రంలో సెక్షన్ 22ఏ నిషిద్ధ భూముల పేరుతో సాగుతున్న భారీ భూదందా వెనుక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హస్తముందని, ఈ అక్రమాల ద్వారా ఆయన వేల కోట్ల రూపాయలు వెనకేస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. శాసనసభ సమావేశాల ప్రారంభం సందర్భంగా గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పించిన అనంతరం, బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి కాంగ్రెస్ మిగతా 2లో..

## ఇది శాసనసభ కాదు.. కౌరవసభ..

- సీఎం రేవంత్ సారీ చెప్పాలి
- రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్
- టీషర్టులతో మీరు పార్లమెంట్?కు వెళ్తారు
- మేము టీషర్టులతో అసెంబ్లీకి రాకూడదా?
- పోలీసుల అభ్యంతరంపై హరీశ్‌రావు
- ఇది ముమ్మాటికీ దుశ్శాసన సభ..
- మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?
- శాంతియుతంగా నిరసనపై ఉక్కుపాదమా!
- ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,సెప్టెంబర్7 : తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన హరీశ్‌రావు, ప్రస్తుత శాసనసభ ప్రజాస్వామ్యబద్ధంగా నడవడం మిగతా 2లో..

హక్కుల కోసం ప్రశ్నిస్తే
## తప్పుడు కేసులా?

- మహిళా ఎమ్మెల్యేలు అని చూడకుండా దారుణం
- జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారు: సబిత



హైదరాబాద్,సెప్టెంబర్1 : అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై అభ్యంతరకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది కేవలం తమకు జరిగిన పరాభవం కాదని, మొత్తం తెలంగాణ మహిళా సమాజానికి జరిగిన తీవ్ర అవమానమని నిప్పులు మిగతా 2లో..

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు


- తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పోలీసులకు ఆదేశం
- ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు
- రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ



హైదరాబాద్,సెప్టెంబర్1 : తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర మిగతా 2లో..

కార్యకర్త బలంగా ఉంటేనే
# పార్టీకి బలం

- స్వర్ణాంధ్ర విజన్-2047తో ముందుకు
- విజన్ ను క్షేత్రస్థాయిలో అమలు చేద్దాం
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం
- టీడీపీ కార్యకర్త హుషారుగా ఉండాలి
- ప్రతి నియోజకవర్గానికి కోటి కేటాయింపు
- టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలోనే
- వైసీపీది ఉగ్రవాదుల తరహా పాలిటిక్స్
- ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో నేతలకు దిశానిర్దేశం



అమరావతి,సెప్టెంబర్7 : తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే మిగతా 2లో..

## తెలంగాణలో 'సర్' గడువు మరోసారి పొడిగింపు

- అక్టోబర్ 7 వరకు పొడిగిస్తూ ఈసి నిర్ణయం, • నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

మిగతా 2లో..

## స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

- 25 ఏళ్లుగా సేవలు అందించడం గొప్ప విషయం
- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడి
- వెంకటాచలంలో రజతోత్సవ వేడుకలకు రాక




అమరావతి,సెప్టెంబర్7 : స్వర్ణభారత్ ట్రస్ట్ పేదపిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తోందని ఉత్తర్?ప్రదేశ్? ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. వారి కోసం అన్ని రకాల వసతులూ కల్పిస్తోందని చెప్పారు. పేదపిల్లలకు చదువు చెప్పడం అనేది గొప్ప సమాజ సేవన్నారు. యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారని వివరించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రసంగంలో భాగంగా అందరికీ వందనం అంటూ యోగి తెలుగులో మాట్లాడి సభికుల్లో ఉత్సాహం నింపారు. 'కరోనా మహమ్మారి మిగతా 2లో..

## తెలంగాణలో 'సర్' గడువు మరోసారి పొడిగింపు

న్యూఢిల్లీ,సెప్టెంబర్7 : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

## హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులా?

చెరిగారు. కాంగ్రెస్ 1,000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి తరలివచ్చిన తమను పోలీసులు అమానుషంగా అడ్డుకున్నారని, మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళుతూ, చీరలు లాగుతూ విచక్షణారహితంగా ప్రవర్తించారని ఆరోపించారు. "సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని పోలీసులు లాగుతుంటే, కేటీఆర్ సమయానికి వచ్చి అడ్డుకోకపోయి ఉంటే మమ్మల్ని అక్కడే పడేసి తొక్కేసేవారు.. కేటీఆర్ రావడంతోనే మేము ప్రాణాలతో బయటపడ్డాం" అని సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే గొంతు నొక్కడం, బట్టలు లాగడం, దాడికి దిగడం ఏ రకమైన ప్రజాపాలన అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం... నేడు ప్రజాప్రతినిధులైన మహిళలకే రక్షణ లేకుండా చేస్తోందని దుయ్యబట్టారు. హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తూ, అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

వల్ల అనేకమంది తల్లిదండ్రులు చనిపోయారు. అనాథ పిల్లలకు యూపీలో అటల్ ఆవాస్ విద్యాలయ్‌లో ఉచిత విద్య. మా గురుకుల పాఠశాలల్లో వసతుల కల్పనకు వెంకయ్యానాయుడే స్ఫూర్తి. సాంకేతికత పరిజ్ఞానాన్ని సమర్థంగా వాడుకునే దేశమే ముందుకెళ్తోంది. ఎంత చదువుకుని, ఉన్నతస్థానానికి వెళ్లినా దేశం పట్ల భక్తి ఉండాలి, ఎక్కడికి వెళ్లినా నేషన్ ఫస్ట్ అనే భావన అందరిలో ఉండాలని' యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, మంత్రులు నారాయణ, సత్యకుమార్?తోపాటు తదితరులు హాజరయ్యారు. స్వర్ణభారత్ ట్రస్ట్ 25 ఏళ్లుగా సేవలు అందించడం అభినందనీయం. సమాజసేవకు వెంకయ్యానాయుడు తీసుకున్న సంకల్పం గొప్పది. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో విద్య తోపాటు నైపుణ్య శిక్షణనూ అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల యువత, మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఉత్తరాదికి, దక్షిణాదికి వారధిగా వెంకయ్యానాయుడు పని చేశారు. మన పల్లెలు జ్ఞానానికి, ఆర్థికాభివృద్ధికి మూలకేంద్రాలు. ఒకప్పుడు మన గ్రామాలన్నీ స్వయంపోషకాలుగా ఉండేవి. అందుకే గ్రామాలకు తరలండి అంటూ గాంధీజీ పిలుపునిచ్చారు. పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడం జాతి నిర్మాణానికి సాయం చేయడమే. ఎక్కడికి వెళ్లినా భారతీయులం అంటూ గర్వంగా చెప్పుకోవాలి. గ్రామీణ ఉత్పత్తులకు ప్రపంచస్థాయి మార్కెటింగ్ సదుపాయాలు ఉన్నాయి. స్వర్ణభారత్ ట్రస్ట్ తనకు మానస పుత్రికని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు చెప్పారు. తన పేరుపై ఉన్న ఆస్తులు ట్రస్ట్‌కే చెందుతాయని ప్రకటించారు. ప్రతిఒక్కరూ జీవితంలో కొంతభాగం సేవకు కేటాయించాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు ఉత్తర్‌ప్రదేశ్ దేశంలో చాలా వెనుకబడిన ప్రదేశంగా ఉండేదని గుర్తుచేశారు. యోగి ఆదిత్యనాథ్ పాలనలో ఉత్తర్‌ప్రదేశ్ ఉత్తమప్రదేశ్‌గా మారిందని ఆయన ప్రశంసించారు. గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ, ఉచిత విద్య, వైద్యం అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోందని మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తెలిపారు.అంతకుముందు అక్షర విద్యాలయ ప్రాంగణంలోని హెలిప్యాడ్ వద్ద యోగి ఆదిత్యనాథ్‌కు ట్రస్ట్ నిర్వాహకులు, నేతలు స్వాగతం పలికారు. అనంతరం సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ఆదిత్యనాథ్ సందర్శించి అక్కడ శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో యువతకు ఇస్తున్న సాంకేతిక శిక్షణ, నైపుణ్యాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల స్కేటింగ్ ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. అక్షర విద్యాలయ నిర్వహణను యోగి ప్రశంసించారు.

## 22ఏ పేరుతో సాగుతున్న భూదందా

ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఫ్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మహేశ్వర్ రెడ్డి... రాష్ట్రంలో అసలు రూల్ ఆఫ్ లా అనేది అమలు కావడం లేదని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషిద్ధ భూముల జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల న్యాయమైన భూములను నిలిపివేసి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ఆ భూములకు రక్షణ కల్పించి రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని కోరారు. 22ఏ భూకుంభకోణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయడంతో పాటు ఆయన రాజీనామాను ఆమోదించాలని పట్టుబట్టారు. రాబోయే శాసనసభ సమావేశాలను కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు, పోలీస్ నోటిఫికేషన్లు, ధరణి, భూభారతి అక్రమాలపై అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

## కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు. తెలంగాణలో సర్? ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత సర్?కు వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు. 2029లో జరగబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఓటమికి ఈ ఓట్లతోనే పునాది పడుతుంది. ఈ ఓట్లు తొలగిస్తే మోదీకి వెయ్యేనుగుల బలం చేకూరుతుంది. ఎన్నికలు ఎప్పుడో ఉన్నాయి అప్పుడు చూద్దామనుకోవద్దు. గెలుపోటములను నిర్ణయించేంది ఎస్?ఐఆర్ అని అన్నారు. వ్యవసాయం గురించి సాధికారంగా మాట్లాడగలిగిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భూమిలోని సారం నుంచి మొదలుపెట్టి నీరు, విత్తనం, పెట్టుబడి, పంట, గిట్టుబాటు ధర.. అన్ని అంశాలు కూలంకషంగా చెప్పేవారని గుర్తుచేశారు. వ్యవసాయం గురించి అవగాహన కోసం సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకాలు చదివానని తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డిని తక్కువసార్లే కలిసినప్పటికీ, ఆయన అంటే అపారమైన గౌరవం ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడ్డాయని చెప్పారు.దున్నేవాడిదే భూమి అంటూ ఎన్నో రైతు సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడారని రేవంత్ రెడ్డి కొనియాడారు. కమ్యూనిస్టులు అంటే తనకు పరోక్షంగా చాలా అభిమానమని వివరించారు. అసైన్డ్?, పోడు పట్టాలు దక్కాయంటే పోరాటం కమ్యూనిస్టులది, పరిష్కారం కాంగ్రెస్?దని వివరించారు. వారి ఉద్యమాల ఫలితంగానే కాంగ్రెస్ అనేక చట్టాలు తెచ్చిందని గుర్తుచేశారు.

## అసెంబ్లీ వద్ద రచ్చ..

ఎమ్మెల్యే కేటీఆర్.. పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోలీసులు డ్యూటీ చేయండి, కానీ అతి చేయకండి అంటూ వ్యాఖ్యలు చేశారు. 2 ఏళ్లలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని.. వార్నింగ్ ఇచ్చారు. పోలీసులతో వాగ్వాదంలో తనకు అయిన గాయాలను.. మీడియాకు కేటీఆర్ చూపించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. మరోవైపు.. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తమతో అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. తన చీర పట్టుకుని లాగేశారని.. బూటు కాళ్లతో తొక్కారని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు తీరును మార్చుకోవాలని ఆమె మండిపడ్డారు. మరోవైపు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద అస్వస్థతకు గురై కిందపడిపోయారు. కొద్దిసేపు ఆయన స్పృహ కోల్పోయినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. దీంతో అక్కడ ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. ఆయన తన కాలికి అయిన గాయాన్ని కూడా మీడియాకు చూపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఇచ్చిన హామీల అమలు తీరును ప్రశ్నించేందుకు నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చినట్లు బీఆర్ఎస్ సభ్యులు తెలిపారు. ఇటీవల రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైన 22ఏ భూముల అంశాన్ని కూడా సభలో ప్రధానంగా ప్రస్తావించేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. మరోవైపు అసెంబ్లీ వద్దకు వచ్చిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారని హరీష్ రావు ఆరోపించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి దారుణంగా ప్రవర్తించారని అన్నారు. మంత్రిగా సేవలు అందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సైతం జుట్టు పట్టి లాగడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందని ఎద్దేవా చేశారు. అక్కాచెల్లెమ్మలతో ఇంత దుర్మార్గంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు హరీష్ రావు తెలిపారు. మేం సభలో లేని సమయంలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా వివాదాస్పద 22 ఏ నిషేధిత భూముల అంశంపై చర్చ జరపడం సరికాదన్నారు. తాము చేసేది తప్పు కాదంటే, ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని భావిస్తే బీఆర్ఎస్ సభ్యులు సభకు వచ్చినప్పుడు చర్చ జరగపాలని హరీష్ రావు ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తామన్న భయంతో మేం లేని సమయం చూసి సభలో చర్చిస్తున్నారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే కనుక మేం సభకు వచ్చినప్పుడు కీలకమైన నిషేధిత భూముల అంశంపై చర్చ జరగాలని ప్రభుత్వానికి హరీష్ రావు సూచించారు. పోలీసుల తోపులాటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతికి, నుదిటికి గాయాలైనట్లు తెలుస్తోంది. మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి కిందపడిపోయారు. తమను పోలీసులు అడ్డుకోవడంతో అసెంబ్లీ గేటు వద్ద హరీష్ రావు తన చొక్కా విప్పేశారు. నల్ల టీషర్టుతో లోపలికి అనుమతించకపోవడంతో హరీష్ రావు బనియన్‌తో నిరసన తెలుపగా, ఆయనతో పాటు వేముల ప్రశాంత్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు తరలించారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు తమపై అమానుషంగా ప్రవర్తించారని పార్టీ నేతలు ఆరోపించారు. మరోవైపు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు అత్యంత దుర్మార్గంగా ప్రవర్తించారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగడంతో ఆమె కన్నీళ్లు పెట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అలాగే మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబిత ఇంద్రా రెడ్డిని జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న గౌరవం ఇదేనా అని పోలీసుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా అసెంబ్లీ గేటు వద్ద పోలీసుల అక్రమ అరెస్టులు, దాడుల ఘటనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించింది.

## స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు..!

మరోవైపు మంత్రి సీతక్క భావోద్వేగానికి గురికాగా, స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభాపతిపై అనుచిత భాషలో వ్యాఖ్యలు చేయడాన్ని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. స్పీకర్ పదవిని అవమానించడం ఒక్క వ్యక్తిని కించపరచడం కాదని అది మొత్తం శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు జరిగిన అవమానమన్నారు. ఇది తెలంగాణ చరిత్రలోనే చీకటి రోజుగా సీఎం అభివర్ణించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడితో తక్షణమే రాజీనామా చేయించాలని, అవసరమైతే అతని పార్టీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాల్సిందిగా కోరారు. శాసనసభలో జరిగిన ఈ ఘటనపై సీఎం తీవ్ర భావోద్వేగంతో మాట్లాడారు. "స్పీకర్ స్థానం రాజ్యాంగబద్ధమైన అత్యున్నత స్థానం.. సీఎం నుంచి సాధారణ సభ్యుడి వరకు ప్రతి ఒక్కరూ ఆ పదవిని గౌరవించాల్సిందే.. స్పీకర్ మనసు గాయపడేలా, ఆయన కుటుంబాన్ని కించపరిచేలా మాట్లాడటం క్షమించరాని నేరం" అని వ్యాఖ్యానించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన సభాపతిని అవమానించిన అంశాన్ని తాను దళిత ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నానన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడితే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి మాట తప్పారని, మూడెకరాల భూమి హామీని అమలు చేయలేదని రేవంత్ విమర్శించారు. తొలి ప్రభుత్వంలోనే దళిత ఉపముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారని, నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులు జరిగాయని ప్రస్తావించారు.

ఇలాంటి ఘటనలు రాజకీయాలకు అతీతంగా ఖండించాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం సంయమనం పాటిస్తే బలహీనతగా భావించవద్దన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను బెదిరింపులతో ప్రభావితం చేయాలనుకుంటే సహించబోమని స్పష్టం చేశారు. సభలో చర్చ అనంతరమే నిర్ణయాలు తీసుకుంటామన్నారు.ఘటనపై కఠిన సభా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దుర్మార్గపు పోకడలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఇలాంటివి కట్టడి చేయకపోతే సమాజం మనలను క్షమించదని, ఇలాంటి దుర్మార్గమైన తక్షణమే చర్యలు కట్టడి చేయాలన్నారు. ప్రతిపక్ష నేత ఫామ్ హౌస్‌లో ఉండి ప్రోత్సహిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇద్దరు మండలి సభ్యులు బూతులు మాట్లాడారన్నారు. తాతా మధు, నవీన్ మీద చర్యలు తీసుకోవాలని.. వీధుల్లో కొట్లాడినట్లు.. అసెంబ్లీ ముందు ప్రవర్తించారంటూ మండిపడ్డారు. అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని.. కేసీఆర్ డైరెక్షన్‌లోనే ఈ వ్యవహారం జరిగిందని సీతక్క పేర్కొన్నారు. సభలో ప్రసంగిస్తూ మంత్రి సీతక్క భావోద్వేగానికి గురయ్యారు.. స్పీకర్ స్థానాన్ని అవమానించడం సరికాదన్నారు..

## ఇది శాసనసభ కాదు.. కౌరవసభ..

లేదని, అది కౌరవ సభను తలపిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ చరిత్రలోనే ఈరోజు అత్యంత నల్లని రోజుగా మిగిలిపోతుందని, ప్రజా సమస్యలను లేవనెత్తుతున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను దుర్మార్గంగా ప్రయోగిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నినాదాలతో కూడిన టీషర్టులతో రావొద్దని బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల అభ్యంతరంతో మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టీ షర్టులు విప్పేశారు. బలియన్లపై ఉన్న హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద కేటీఆర్, హరీశ్‌రావును పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. పోలీసుల తీరుపై సునీతా లక్ష్మారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. పోలీసులు తన పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారని ఆమె కంటతడి పెట్టుకున్నారు. పోలీసుల వైఖరిని కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు తప్పుపట్టారు. ఈ సందర్భంగా హరీశ్?రావు మాట్లాడారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ టీషర్టులు వేసుకుని పార్లమెంట్‌కు వెళ్లారని, తాము అలా అసెంబ్లీకి రాకూడదా అని ప్రశ్నించారు. నల్ల టీషర్టుపై హామీలు అమలు చేయాలని మాత్రమే ఉందని తెలిపారు. నిరసన తెలిపే హక్కు తమకు ఉందన్న ఆయన, తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి రాకూడదనే ఇలాంటివి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి వస్తే ప్రశ్నిస్తారనే అడ్డుకుంటున్నారని, ప్రధాన ప్రతిపక్షం లేకుండానే చర్చ జరపాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా, బీఆర్?ఎస్? నేతల ఆరోపణలపై ఖైరతాబాద్? డీసీపీ శిల్పవల్లి స్పందించారు. నల్ల టీషర్టులతో అసెంబ్లీకి రావడం నేరం కాదని పేర్కొన్నారు. నల్ల టీషర్టులపై అభ్యంతరకర పదాలున్నాయని తెలిపారు. టీషర్ట్‌లపై ఉన్న పదాల కారణంగానే అసెంబ్లీ లోపలికి అనుమతించలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించలేదన్న డీసీపీ, పోలీసుల తీరుపై బీఆర్ఎస్ ఆరోపణలను పరిశీలిస్తామన్నారు. స్పీకర్ సూచనల మేరకే పోలీసులు వ్యవహరించారన్న శిల్పవల్లి, అసెంబ్లీ గేటు దగ్గర జరిగిన ఘటన వీడియోలను పరిశీలిస్తామన్నారు. ఆందోళన సందర్భంగా పోలీసులు ప్రవర్తించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హరీశ్‌రావు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అత్యంత హేయంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీర లాగడం, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కడం వంటి ఘటనలు అత్యంత అమానుషమని ధ్వజమెత్తారు. మహిళా సభ్యుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించిన అధికారులను సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టేది లేదని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. తోపులాటలో జగదీష్ రెడ్డిని కింద పడేసి తొక్కేందుకు యత్నించారని, కేటీఆర్, సంజయ్, యాదవరెడ్డి, రాజశేఖర రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు.ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు వైఫల్యాలు, పింఛన్లు, మూడేళ్లుగా నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్మెంట్, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల నుంచి తప్పించుకోవడానికే ఈ దాడులకు తెగబడ్డారని విమర్శించారు. ప్రభుత్వం వెయ్యి రోజుల విఫల పాలన వాస్తవాలు సభలో బట్టబయలవుతాయనే భయంతోనే తమపై పథకం ప్రకారం కుట్ర పన్ని సస్పెండ్ చేశారని ఆరోపించారు. సభలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ లేకుండా చేసి, బీజేపీ -- కాంగ్రెస్ కలిసి నామమాత్రపు చర్చలతో మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయం చేస్తున్నాయని హరీశ్‌రావు ఎండగట్టారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. 22ఏ అంశంపై సభలో స్వల్పకాలిక చర్చ చేపట్టేందుకు తమ ప్రభుత్వం సంపూర్ణ సిద్ధంగా ఉందన్నారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఈ అంశానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని, నిబంధనలకు అనుగుణంగా చర్చపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం సభను అడ్డుకోవడం సరికాదని, సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు సర్దిచెప్పినప్పటికీ బీజేపీ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గకుండా పోడియం వద్ద కాసేపు నినాదాలు చేశారు. విచారణకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటన చేసేవరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో తెలంగాణ అసెంబ్లీ 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఆ తరువాత సభ ప్రారంభం కాగా, బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని బయట వాళ్లు, లోపల వీళ్లు ఆందోళనకు దిగుతున్నారంటూ కాంగ్రెస్ సభ్యులు వ్యాఖ్యానించారు. సభలో ప్రజా సమస్యల పరిష్కారానికి, అర్థవంతమైన చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై సభా సమయాన్ని వృథా చేస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎస్సీల అభివృద్ధితో పాటు ఫీజు రీయింబర్స్మెంట్, క్రీడల అభివృద్ధి వంటి కీలక అంశాలపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నా... వాటిని వదిలేసి బురదజల్లే రాజకీయం చేయడం ప్రతిపక్షాలకు తగదని సూచించారు.రాష్ట్రంలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్ష కోట్ల కుంభకోణంపై విచారణ కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ఏడాది క్రితమే కేంద్రానికి లేఖ రాసినా... ఆ ఎంక్వయిరీని ఎందుకు తొక్కిపెడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యేల్ని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో విచారణను ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఎందుకు ఆపుతున్నారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ 22ఏపై స్వల్ప కాలిక చర్చ పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని, 22 ఏ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీజేపీ సభ్యులు కూర్చోవాలన్న స్పీకర్?, సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆ పార్టీ సభ్యులను కోరారు. బీఏసీలో నిర్ణయం తీసుకుని 22ఏపై చర్చిద్దామని తెలిపారు.బీఏసీ సమావేశంలో 22 ఏ అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 22 ఏపై స్వల్ప కాలిక చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమని హామీ ఇచ్చారు. నియమ నిబంధనలకు అనుగణంగా బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యేలకు చెప్పారు. ప్రతిపక్షాలు చర్చకు సహకరించాలని కోరారు. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ సర్దిచెప్పినా బీజేపీ ఎమ్మెల్యేలు వినకుండా 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. రాజకీయాల కోసం సభను అడ్డుకోవడం సరైంది కాదని శ్రీధర్ బాబు విమర్శించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలను కోరారు. అయితే శ్రీధర్ బాబు విజ్ఞప్తిని బీజేపీ సభ్యులు పట్టించుకోలేదు. పదేపదే ఆయన కోరినా 22ఏ పై తక్షణమే చర్చ జరగాలని పట్టుపట్టారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. ఓ దశలో స్పీకర్ సభను వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తరువాత కూడా బీజేపీ సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. వచ్చే బోనాల పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేస్తామని శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు నియోజకవర్గాన్ని యూనిట్?గా తీసుకున్నట్లుగా వివరించారు.

## త్రివిధ దళాల సామర్థ్యం మరింత బలోపేతం

రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది.సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణ శాఖ త్రివిధ దళాల బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షిం చడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జ్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.భారత నావికాదళం కోసం 'అరుద్ర' రాడార్లతో పాటు మెరైన్ గ్యాస్ టర్బైన్ల రూపకల్పన, అభివృద్ధి, కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. వివిధ నావల్ ఎయిర్ స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లను ప్రవేశపెట్టనున్నారు. యుద్ధనౌకలకు ఇంధన సిస్టమ్‌గా పనిచేసే మెరైన్ గ్యాస్ టర్బైన్ల కొనుగోలుతో ఇంజిన్ల విషయంలో విదేశీ సంస్థలపైన ఆధారపడటం తగ్గుతుందని రక్షణ శాఖ స్పష్టం చేసింది.భారత వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్లు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంచే పలు ప్రతిపాదనలకు సైతం డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రుదేశాల నిఘా రాడార్లను సమర్థంగా అడ్డుకునే గ్రౌండ్-బేస్డ్ మల్టీ-పర్పస్ జామర్ల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణ వ్యవస్థల భద్రతను డిజిటలైజ్ చేస్తూ 'డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్' వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు డీఏసీ అంగీకారం తెలిపింది. దీని ద్వారా దళాల్లో ఇప్పటివరకు ఉన్న పాత పేపర్ గుర్తింపు కార్డులు, పాస్‌లు, పర్మిట్ల స్థానంలో పరస్పరం పనిచేసే అత్యాధునిక స్మార్ట్ కార్డులను అమలు చేయనున్నారు. ఈ కొనుగోలులో 98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరించనున్నట్లు రక్షణ శాఖ స్పష్టం చేసింది. తద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత ఊతమిస్తుందని వెల్లడించింది.

## భగ్గుమన్న చమురు ధరలు!!

ఆయిల్ ట్యాంకర్లపై దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. దీనికి ప్రతిగా, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నేవీ కూడా అమెరికా నౌకలతో పాటు, అనధికారిక మార్గాల్లో ప్రయాణిస్తున్న ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. ఈ పరిణామాలను విశ్లేషకులు 'ప్రధాన ఘర్షణ'గా అభివర్ణిస్తున్నారు. ఈ ఘర్షణల ప్రభావం హర్మూజ్ జలసంధిపై తీవ్రంగా పడింది. సాధారణంగా ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం ఈ మార్గం గుండానే జరుగుతుంది. ప్రస్తుతం ఇక్కడ నౌకల రాకపోకలు భారీగా పడిపోయాయి. గతంలో రోజుకు 100కు పైగా నౌకలు ప్రయాణించగా, ఇప్పుడు ఆ సంఖ్య కేవలం 10కి పరిమితమైంది. త్వరలో ఈ ప్రాంతంలో కొత్తగా 'రిస్ట్రిక్టెడ్ జోన్' ప్రకటించేందుకు ఇరాన్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో, అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 0.54 శాతం పెరిగి 96.80 డాలర్లకు చేరుకుంది. అమెరికా బెంచ్‌మార్క్ డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 0.72 శాతం పెరిగి 92.14 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. గత వారంలోనే ఈ ధరలు 8-10 శాతం వరకు పెరిగాయి. మరోవైపు, సెప్టెంబర్ 6న సమావేశమైన ఒపెక్ ప్లస్ దేశాలు అక్టోబర్ ఉత్పత్తి విధానంలో ఎలాంటి మార్పులు చేయకూడదని నిర్ణయించాయి. హర్మూజ్ జలసంధిలో సరఫరా అంతరాయాలు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2026 చివరి వరకు ఎగుమతులు పరిమితంగానే ఉంటాయని, పూర్తిస్థాయి పునరుద్ధరణ 2027లోనే సాధ్యమవుతుందని కొన్ని సంస్థలు అంచనా వేశాయి. ఈ ఉద్రిక్తతలు ప్రపంచ ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. తదుపరి దాడులు, దౌత్యపరమైన చర్చలపైనే మార్కెట్ గమనం ఆధారపడి ఉంటుంది.

## కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీకి బలం

సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు. స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు. కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు. మరోవైపు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు కేవలం గౌరవం ఇవ్వడమే కాకుండా, వారికి రాజకీయ, ఆర్థిక సాధికారత కల్పించడమే అధినేత చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళగిరిలో జరిగిన టీడీపీ లీడర్‌షిప్ శిక్షణా సదస్సులో 'రాజకీయ, ఆర్థిక సాధికారత' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. 2040 నాటికి దేశంలో సాధారణ తలసరి ఆదాయం రూ.50 లక్షలకు చేరితే, టీడీపీ కార్యకర్తల కుటుంబాల ఆదాయం నీతివంతమైన మార్గాల్లో రూ.75 లక్షలు దాటాలనేది చంద్రబాబు ఆకాంక్ష అని ఏలూరి వెల్లడించారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా నిరంతరం ప్రజల్లో ఉండే కోటి మందికి పైగా సభ్యులున్న ఏకైక పార్టీ టీడీపీ అని ఆయన కొనియాడారు. కార్యకర్త ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. నారా లోకేశ్ ఆలోచనతో కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని, తల్లిదండ్రులను కోల్పోయిన కార్యకర్తల పిల్లలకు ఎన్టీఆర్ మోడల్ స్కూళ్ల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. టీడీపీ సభ్యత్వ కార్డు కేవలం గుర్తింపు మాత్రమే కాదని, అది ఆ కుటుంబానికి పార్టీ ఇస్తున్న బీమా, విద్య, వైద్య, ఉపాధి భరోసా అని వర్ణించారు. సాధారణ విద్యార్థి నాయకుడిగా ఉన్న తనకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకపోయినా, కేవలం ప్రతిభ ఆధారంగా మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన ఘనత చంద్రబాబుదేనని ఏలూరి గుర్తుచేసుకున్నారు. పార్టీలో సిఫార్సులకు తావులేదని, ప్రతిభకే పట్టం కడతారని స్పష్టం చేశారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# జటిలమైన రాజకీయ భవిష్యత్తు!

ఏదీ తెగేదాకా లాగొద్దనేది పెద్దల వాదన. సమస్యను చిన్నదిగా ఉన్నప్పుడే సామరస్యంగా పరిష్కరించుకుంటే అన్ని సర్దుకుంటాయి. కానీ తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం పెద్ద చర్చగా మారింది. మంత్రి పదవిలో ఉన్న సురేఖను సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ నుంచి తప్పించారు. గవర్నర్ కూడా దీనికి ఆమోదం తెలిపారు. ఆ తర్వాత కొండా సురేఖ శాఖలు సీఎం దగ్గరకు చేరాయి. విమర్శలు, వివరణలు, రిపోర్టుల తర్జనభర్జన తర్వాత.. కొండా సురేఖ ఎపిసోడ్‌కు ఎండ్ కార్డ్ పడింది.. దీంతో ఒక్కసారిగా కొండా కుటుంబం రాజకీయ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. ఈ గొడవ ఒక్కరోజులో మొదలైంది కాదు. కొండా సురేఖ కూతురు సుష్మిత పటేల్ సీఎం రేవంత్‌రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేయడంతో అసలు గొడవ మొదలైంది. ముఖ్యంగా పరకాల సీటు విషయంలోనే కొండా కుటుంబానికి, రేవంత్‌రెడ్డి వర్గానికి మధ్య దూరం పెరిగిందనే చర్చ ఉంది. పరకాల సీటు విషయంలో సుష్మితకు ఆసక్తి ఉందనే వార్తలు వచ్చాయి. కానీ అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని రేవంత్‌రెడ్డి చెప్పడంతో సమస్య మరింత పెరిగింది. సురేఖ మాత్రం కూతురు చేసిన మాటలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని చెబుతున్నారు. కూతురు పెద్దదైందని, ఆమె మాటలకు తాను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆమె వాదిస్తున్నారు. కానీ కాంగ్రెస్ పెద్దలు మాత్రం పార్టీ విషయంలో క్రమశిక్షణ తప్పక పాటించాల్సిందే అన్న చందంగా వ్యవహరించారు. పరకాల పేరు ఈ గొడవలో పదేపదే వినిపించడం వెనుక రాజకీయ లెక్క ఉంది. కొండా కుటుంబానికి వరంగల్ ప్రాంతంలో చాలా ఏళ్లుగా రాజకీయ పరిచయాలు ఉన్నాయి. అదే సమయంలో రేవంత్‌రెడ్డి అక్కడ తనకు నమ్మకమైన నాయకులను ముందుకు తీసుకెళ్లాలని చూస్తున్నారు. ఇద్దరి దారులు వేర్వేరుగా కనిపించడంతో దూరం పెరిగిందనే మాట వినిపిస్తోంది. సురేఖ కూడా తనను ప్రభుత్వం పక్కన పెడుతోందని గతంలో కొన్ని సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారనే వార్తలు వచ్చాయి. అందుకే కూతురు చేసిన వ్యాఖ్యలు ఒక్కటే కారణం కాదని, ముందే కొంత దూరం పెరిగి ఉండొచ్చని రాజకీయంగా చర్చ జరుగుతోంది. అయితే ఇది రాజకీయ అంచనా మాత్రమే. కొండా సురేఖ కూడా మౌనంగా ఉండలేదు. తనను కావాలనే పక్కన పెట్టారని, తనపై కుట్ర జరిగిందని ఆమె ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులపై కూడా ఆమె ఆరోపణలు చేశారు. అయితే ఇవన్నీ సురేఖ చేసిన ఆరోపణలే. వాటిని నిజమని నిర్ధారించే ఆధారాలు బయటకు రాలేదు. కాంగ్రెస్ మాత్రం పార్టీ నిర్ణయానికి కట్టుబడి ముందుకు వెళ్లింది. దీంతో మంత్రి పదవి పోయింది. ఇక్కడే అసలు రాజకీయం కనిపిస్తోంది. ఇది కేవలం ఒక మంత్రి పదవి పోయిన వ్యవహారం మాత్రమే కాదు. పార్టీలో ఎవరికి ఎంత బలం ఉంది, ఎవరితో ఎవరు కలిసి నడుస్తున్నారు, వచ్చే ఎన్నికల నాటికి ఎవరి మాట ఎంత వరకు చెల్లుతుంది అన్న లెక్కలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన ఆరోపణలు కూడా కలకలం రేపాయి. డబ్బుల పంపకానికి సంబంధించిన గొడవ వల్లే సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించారని ఆయన ఆరోపించారు. అవినీతి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని కూడా ఆయన అన్నారు. అయితే రాజాసింగ్ చెప్పింది ఆరోపణ మాత్రమే. దానికి ఇప్పటివరకు బలమైన ఆధారం బయటకు రాలేదు. సురేఖ కూడా తనపై అలాంటి ఆరోపణలు లేవని చెబుతున్నారు. కాబట్టి ఈ మాటలను రాజకీయ ఆరోపణలుగానే చూడాలి. సురేఖను తప్పించిన తర్వాత ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన పదవుల్లో బీసీ మహిళలకు చోటు కల్పించింది. గద్వాల్ విజయలక్ష్మి, నేరెళ్ల శారద, జీ. సుధారాణిలకు కీలక బాధ్యతలు ఇచ్చారు. ఈ మార్పులను కొందరు రాజకీయంగా చూస్తున్నారు. బీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఏర్పడే ప్రభావాన్ని సర్దుబాటు చేసే ప్రయత్నంగా కొందరు భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఇదే కారణంతో ఈ నియామకాలు చేసిందని అధికారికంగా చెప్పలేదు.తెలంగాణలో మంత్రి పదవిలో ఉండగానే బయటకు వెళ్లాల్సి వచ్చిన సందర్భాలు గతంలోను ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో 2015లో తాటికొండ రాజయ్యను మంత్రి పదవి నుంచి తప్పించారు. ఆ తర్వాత 2021లో ఈటల రాజేందర్‌ను కూడా కేబినెట్ నుంచి తొలగించారు. ఈటలపై భూముల విషయంలో ఆరోపణలు రావడంతో ఆయన శాఖను తీసుకుని, ఆ తర్వాత కేబినెట్ నుంచి బయటకు పంపారు. ఈ ఆరోపణలను ఈటల ఖండించారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కూడా ఆయన అప్పట్లో చెప్పారు. ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం కూడా అదే వరుసలో మరో రాజకీయ ఘటనగా మారింది. అయితే మూడు ఘటనలకు మూడు వేర్వేరు కారణాలు ఉన్నాయి. అందుకే వాటిని ఒకే గాటన కట్టడం సరికాదు.మంత్రి పదవి పోయిందంటే కొండా కుటుంబం రాజకీయంగా అయిపోయిందని చెప్పలేం. వరంగల్ ప్రాంతంలో కొండా కుటుంబానికి ఇంకా పరిచయాలు, అనుచరులు ఉన్నారు. సురేఖకు కూడా తనకంటూ రాజకీయ బలం ఉంది. అందుకే ఇప్పుడు అందరి చూపు కొండా కుటుంబం తర్వాత ఏం చేస్తుందనే దానిపైనే ఉంది. కాంగ్రెస్‌లోనే ఉండి ముందుకు వెళ్తారా, కొంతకాలం మౌనంగా ఉంటారా, లేక మరో దారి చూసుకుంటారా అన్నది కాలమే చెప్పాలి. మొత్తానికి కూతురు చేసిన వ్యాఖ్యలతో మొదలైన గొడవ, పరకాల సీటు దగ్గర పెరిగిన దూరం, పార్టీలో పెరిగిన గ్యాప్, చివరకు మంత్రి పదవి పోయే వరకు వెళ్లింది. కానీ ఇంతటితో కొండా సురేఖ రాజకీయ కథ ముగియలేదు. కుర్చీ పోయింది. ఇక కొండా కుటుంబం వేసే తర్వాతి అడుగే తెలంగాణ రాజకీయాల్లో అసలు ఆసక్తికరమైన అంశంగా మారనుంది. కానీ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నరు.

## ఎస్ఐఆర్ నోటీసుల ప్రక్రియను వేగవంతం చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశం



నిర్మల్ జిల్లా, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఈఓ.. జిల్లాల వారీగా నోటీసుల జారీ, పెండింగ్ నోటీసులు, హియరింగ్ నిర్వహణపై సమీక్షించారు. పెండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.. జిల్లాలో ఎస్ఐఆర్ నోటీసులు, హియరింగ్ ప్రక్రియ పురోగతిని వివరించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. వివిధ రకాల ఫారముల ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.?

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు

### - అధికారులకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశం

నిర్మల్ జిల్లా, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా అధికారులు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. గుర్తించిన లబ్ధిదారుల వివరాలను ఎంపీడీవోల లాగిన్‌ల నుంచి పైస్థాయికి ఎప్పటికప్పుడు పంపించాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల్లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణ పనులు నిర్దేశిత సమయంలో పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బసాపురం నుండి తుమ్మలచెరువు స్టేజి వరకు బీటీ రోడ్డు

### - ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి



గట్టు సెప్టెంబర్ 7( విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల గట్టు మండల పరిధిలో బసాపురం గ్రామంలో ప్రధాన రహదారి (తుమ్మల చెరువు స్టేజి వరకు) రోడ్డు బీటీ రోడ్డు 1 కోటి 50 లక్షలు నిర్మాణానికి గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించినారు.ఎమ్మెల్యే కి గ్రామ సర్పంచ్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కొరకు ప్రత్యేకంగా శ్రద్ధగా పెట్టి గ్రామాల అభివృద్ధి చెందాలని గ్రామంలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తూ గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా గ్రామాల నుండి ప్రధాన రహదారులకు వెళ్లడానికి రోడ్డు నిర్మాణంలో కూడా చేయడం జరుగుతుందని అన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ తొందరగా రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమంతు, మాజీ ఎంపీపీ విజయ్, సర్పంచ్ శ్రీరాములు గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ఉపసర్పంచ్ అంజి నాయకులు ఆనంద్ గౌడ్, ఊరుకుందు, నారాయణ రెడ్డి, ఉమర్, ప్రకాష్ రెడ్డి డీలర్ రాజప్ప లపాడు రంగప్ప వీరేష్ గౌడ్ వెంకటేష్ గౌడ్ , నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పెండింగ్ ఫీజులపై పోరాటం చేస్తే అరెస్టులా ?

### - బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రారెడ్డి ముందస్తు అరెస్ట్




అయిజ సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర) : బీజేపీ రాష్ట్రఅధ్యక్షులు రామచంద్రరావు పిలుపు మేరకు,పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ సూచన మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం వెళుతున్న సమాచారం తెలుసుకొని బీజేపీ నాయకుల ఇంటికి వెళ్లి అరెస్ట్ చేసి అయిజ పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. అనంతరం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకి చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్ సిప్ లు రాష్టంలో 40 లక్షల మంది విద్యార్థులకు రూ.15000/- కోట్లు తక్షణమే విడుదల చేయాలని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమానికి వెళ్లకుండా ముందస్తు అక్రమ అరెస్టులు చేయించారని కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు. ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్ కారణంగా తెలంగాణ విద్యార్థులు తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, విద్యార్థులు చదువు ఆపొద్దు వారి బ్రతుకు ప్రశ్నార్థకం చేయొద్దు అని అన్నారు. వెంటేనే బాకాయులు విడుదల చేయకుంటే బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం ఉదృతం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమం లో అయిజ పట్టణ బీజేపీ అధ్యక్షులు తెలుగు నరసింహ, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్య వర్గ సభ్యులు మేడికొండ భీంసేన్ రావు ప్రదీప్ స్వామి,భగత్ రెడ్డి,తూముకుంట అంజి,లక్ష్మణ్ గౌడ్, వెంకటేష్ యాదవ్,రాజాషేకర్,భీమన్న, కుషీ,శ్రీకాంత్ ,సి. నర్సింహ, వీరేష్ తదితరులు పాలుగొన్నారు.

# ప్రజల సొమ్ము.. ప్రజల హక్కు.. ప్రభుత్వ రికార్డులు ప్రజల ముందుకు రావాలి

### *ప్రభుత్వ భూముల నుంచి మైనింగ్ వరకు.. రోడ్ల నుంచి అండర్ డ్రైనేజ్ వరకు... మరియు సంక్షేమ పథకాల వరకు పలు అంశాలపై RTIల సమర్పణ*



నాగర్‌కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) సెప్టెంబర్ 07 సోమవారం : నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు సంబంధించిన అత్యంత కీలకమైన ప్రజా ప్రయోజన అంశాలపై అధికారిక ప్రభుత్వ రికార్డుల ద్వారా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో, బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో నేడు పలు ప్రభుత్వ శాఖలకు సమాచార హక్కు చట్టం2005, సెక్షన్ 6(1) కింద విస్తృతంగా RTI దరఖాస్తులు సమర్పించినట్లు శ్రీవిద్య గౌడ్ సీతారాల, జిల్లా జనరల్ సెక్రటరీ మరియు మహిళా విభాగం అధ్యక్షురాలు, బీసీ పొలిటికల్ జేఏసీ, నాగర్‌కర్నూల్ జిల్లా తెలిపారు. ప్రజా నిధులు, ప్రభుత్వ భూములు, సహజ వనరులు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, వ్యవసాయ రంగం, మరియు ప్రభుత్వ గృహ నిర్మాణం, సంబంధించిన వాస్తవాలు ప్రభుత్వ రికార్డుల ద్వారా ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.

**ప్రభుత్వ భూములు ఆక్రమణలపై పూర్తి వివరాలు కావాలి**

రెవెన్యూ శాఖను ఉద్దేశించి 2014 నుంచి 2026 వరకు నాగర్‌కర్నూల్ నియోజకవర్గం మరియు జిల్లాలోని ప్రభుత్వ భూముల సర్వే నెంబర్స్, విస్తీర్ణం, భూమి వర్గీకరణ, అసైన్డ్ భూములు, Alienation, Assignment, Regularisation, NALA Conversion, భూముల బదలాయింపులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు తదితర వివరాలను కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లు అధికారిక రికార్డుల్లో నమోదైన కేసులు, ఆక్రమిత విస్తీర్ణం, జారీ చేసిన నోటీసులు, స్వాధీనం చర్యలు, పోలీస్ కేసులు, జరిమానాలు, రికవరీలు మరియు తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్న భూముల వివరాలను కూడా కోరుతున్నట్లు తెలిపారు. కొల్లాపూర్ ఎక్స్ రోడ్, తాడూరు రోడ్డు, ఉయ్యాలవాడ Government Medical College పరిసరాలు, ఉయ్యాలవాడఎర్రగుట్ట, తుడుకుర్తిఎర్రగుట్ట, ఇంద్రకల్‌కొమ్ముగుట్ట వంటి ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములు, గుట్టలు మరియు భూముల వినియోగానికి సంబంధించిన అధికారిక రికార్డులను కూడా కోరుతున్నట్లు వెల్లడించారు.

**నల్లమట్టి.. ఎర్రమట్టి.. గుట్టల తవ్వకాలపై లెక్కలు చెప్పాలి**

మైన్స్ & జియాలజీ శాఖ నుంచి లిఇసుక, నల్లమట్టి, ఎర్రమట్టి, మోరం మరియు ఇతర మైనర్ మినరల్స్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు, క్వారీలు, లీజులు, తవ్వకాల పరిమాణం, రాయల్టీ, సీనరేజ్, ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం, తనిఖీలు, అక్రమ తవ్వకాలపై నమోదైన కేసులు మరియు తీసుకున్న చర్యలలి వివరాలను కోరుతున్నట్లు తెలిపారు. ప్రకృతి వనరులు ప్రజల ఆస్తి కాబట్టి వాటి వినియోగంలో పారదర్శకత ఉండాలని, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పూర్తిగా వచ్చిందా లేదా అనే విషయాన్ని అధికారిక రికార్డుల ద్వారా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**రోడ్లు.. డ్రైనేజీలు.. బ్రిడ్జిలు.. కాంట్రాక్టులపై పూర్తి పారదర్శకత కావాలి**

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, R&B శాఖలకు సంబంధించిన RTIల్లో లిరోడ్లు, జజ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, డ్రైనేజీలు, కాలువలు, కల్వర్టులు, బ్రిడ్జిలు, ప్రభుత్వ భవనాలు మరియు ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లు, కాంట్రాక్టర్లు, అంచనా వ్యయాలు, మంజూరైన నిధులు, విడుదలైన నిధులు, చెల్లింపులు, Agreement\T, Work Orders, Measurement Books, Running Bills, Final Bills, Quality Tests తదితర వివరాలను కోరినట్లు తెలిపారు. పనులు పూర్తయ్యాయా? మధ్యలో ఆగిపోయాయా? నిధులు ఖర్చయ్యాయా? నాసిరకం పనులపై చర్యలు తీసుకున్నారా? కాంట్రాక్టర్లపై Penalty, Recovery, Blacklisting లేదా Agreement Cancellation జరిగిందా? అనే అంశాలపై కూడా సమాచారం కోరినట్లు తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్లు నుంచి సంక్షేమ పథకాల వరకు**

జిల్లా గృహ నిర్మాణ శాఖ మరియు సంబంధిత సంక్షేమ శాఖల నుంచి ఇందిరమ్మ ఇళ్లు, గృహ నిర్మాణ పథకాలు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఇతర రాష్ట్ర మరియు కేంద్ర సంక్షేమ పథకాలకు సంబంధించిన నిధుల కేటాయింపు, విడుదల, ఖర్చు, లబ్ధిదారుల సంఖ్య, తిరస్కరించిన దరఖాస్తులు మరియు పథకాల అమలు స్థితి వంటి అధికారిక వివరాలను కోరినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించే పథకాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా అర్హులైన ప్రజలకు ఎంతమేరకు చేరుతున్నాయో అధికారిక గణాంకాల ద్వారా తెలుసుకోవాలని అన్నారు.

**రైతుల కోసం కేటాయించిన నిధులు అమలు వివరాలు కావాలి**

వ్యవసాయ శాఖ నుంచి లిరైతు బంధు, రైతు భరోసా, వ్యవసాయ సబ్సిడీలు, విత్తనాలు, ఎరువులు, రైతులకు అందించిన ఇతర ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు, లబ్ధిదారుల సంఖ్య, నిధుల కేటాయింపువిడుదలవినియోగం వంటి వివరాలను కోరినట్లు తెలిపారు.

**"ఆరోపణలను నమ్మం.. రికార్డులనే నమ్ముతాం"**

ఈ RTIల ఉద్దేశం ఏ ఒక్క వ్యక్తిని, అధికారి లేదా సంస్థను ముందుగానే తప్పుబట్టడం కాదని శ్రీవిద్య గౌడ్ సీతారాల స్పష్టం చేశారు.

"ప్రజా వేదికల్లో, వార్తా మాధ్యమాల్లో, సోషల్ మీడియాలో ప్రభుత్వ భూములు, మైనింగ్, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, నియామకాలు తదితర అంశాలపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటిని నిజమని గానీ, అబద్ధమని గానీ ముందుగానే చెప్పడం మా ఉద్దేశం కాదు. అధికారిక ప్రభుత్వ రికార్డులు ఏమి చెబుతున్నాయో తెలుసుకోవడమే మా లక్ష్యం." అని ఆమె అన్నారు. "ప్రజల సొమ్ముతో జరిగే ప్రతి పని ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి. సహజ వనరులు ప్రజల సంపద. ప్రభుత్వ నిధులు ప్రజల పన్నుల సొమ్ము. సంక్షేమ పథకాలు ప్రజల హక్కు. కాబట్టి వాటి వినియోగంపై ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో తప్పు కాదు." అని ఆమె పేర్కొన్నారు.

**"RTI సమాచారం వచ్చిన తర్వాత వాస్తవాల ఆధారంగానే తదుపరి కార్యాచరణ"**

RTI ద్వారా అందే అధికారిక సమాచారం ఆధారంగా లిఎక్కడైనా నిబంధనల ఉల్లంఘనలు, నిధుల దుర్వినియోగం, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో లోపాలు లేదా ఇతర అవకతవకలు అధికారికంగా బయటపడితేలి, సంబంధిత చట్టపరమైన మరియు ప్రజాస్వామ్య మార్గాల్లో తదుపరి చర్యలు తీసుకుంటామని శ్రీవిద్య గౌడ్ సీతారాల తెలిపారు. మా పోరాటం వ్యక్తులపై కాదు, వ్యవస్థలో పారదర్శకత కోసం రాజకీయ ఆరోపణలపై కాదు, అధికారిక రికార్డుల కోసం, ప్రజల తరఫున ప్రశ్నిస్తాం, రికార్డుల ఆధారంగా మాట్లాడతాం అని ఆమె స్పష్టం చేశారు.

# చదువుకున్న ప్రతి ఒక్కరూ.. మరో ఇద్దరికి చదువు నేర్పాలి

### - జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం
### - యుల్లాస్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి: అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్




దుండిగల్, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో భారీ అవగాహన ర్యాలీలు, అక్షర యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. అక్షరాస్యత ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించి, కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యుల్లాస్‌నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అదనపు కలెక్టర్ అన్నారు. అక్షరాస్యత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

***ప్రతి ఒక్కరూ అక్షర యజ్ఞంలో భాగస్వాములు కావాలి***

సమాజంలో చదువుకున్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అక్షర యజ్ఞంలో భాగస్వాములు కావాలని ఫైజాన్ అహ్మద్ పిలుపునిచ్చారు. ప్రతి అక్షరాస్యుడు కనీసం ఒకరు లేదా ఇద్దరికి చదువు నేర్పించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దితే జిల్లాను సంపూర్ణ అక్షరాస్య జిల్లాగా మార్చడం సాధ్యమవుతుందని తెలిపారు.

***మహిళల సాధికారతకు యుల్లాస్ దోహదం***

స్వయం సహాయక సంఘాల మహిళలు యుల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాస్యతతో పాటు డిజిటల్, ఆర్థిక, జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ నైపుణ్యాలు మహిళల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవాన్ని పెంపొందించడంతో పాటు కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు దోహదపడతాయని అన్నారు. మండల విద్యాధికారులు, సీఆర్‌పీలు, వాలంటీర్ ఉపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు, అభ్యసనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన ర్యాలీలు, అక్షర యజ్ఞ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ కోరారు.

# చిల్డ్రన్స్ పార్క్‌కు మహర్దశ

### - అభివృద్ధికి రూ.23.96 లక్షల సీఎంసీ నిధులు మంజూరు
### - మహాదేవపురం దేవేందర్‌నగర్‌లో పనులకు శ్రీకారం
### - చిన్నారులు, స్థానికులకు మెరుగైన వసతులు కల్పించేలా అభివృద్ధి
### - ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన



గాజులరామారం, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): మహాదేవపురం డివిజన్‌లోని దేవేందర్‌నగర్ లేఅవుట్ ల్యాండ్స్ పరిధిలో ఉన్న చిల్డ్రన్స్ పార్క్ ప్రాంతానికి మహర్దశ పట్టనుంది. పార్క్ అభివృద్ధి కోసం రూ.23.96 లక్షల సీఎంసీ నిధులు మంజూరయ్యాయి. దీంతో పార్క్ ప్రాంతంలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి చిన్నారులు, స్థానిక ప్రజలకు మెరుగైన వసతులు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్క్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. పార్క్ అభివృద్ధి పనులతో స్థానికంగా నివసించే చిన్నారులకు ఆటలు, వినోదం, ఆహ్లాదానికి అనువైన వాతావరణం ఏర్పడటంతో పాటు ప్రజలకు విశ్రాంతి తీసుకునేందుకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. నిధులు మంజూరు కావడంతో త్వరలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని కొలన్ హన్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సహకారంతో కుత్బుల్లాపూర్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, డీసీసీ కార్యదర్శి ఎండీ లయక్, గణేష్, జగన్నాథ్, దేవేందర్‌నాథ్, శ్రీనివాస్ ప్రసాద్, ప్రభాకర్, సంగమేశ్, యాదగిరి, విజయ్, నాగరాజు, సత్యనారాయణ, రాజేష్, షాహెద్, సాజిద్, బ్రహ్మచారి, వార్డు సభ్యుడు శ్రీనివాస్, జహంగీర్, మైనారిటీ నాయకులు అఫ్జల్ భాయ్, అంజలి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా 11 ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్.



నాగర్ కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) సెప్టెంబర్ 07 సోమవారం : ఈ రోజు నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన 11 అర్జీలలో భూమికి సంబంధించిన అర్జీలు 05, తగు న్యాయం సంబంధించిన అర్జీలు 05 ,భార్య భర్తల గొడవలు 01 ,స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ కి పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ,వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.

## అన్నారం షరీఫ్ గ్రామంలో వెండి, బంగారు ఆభరణాలు చోరీ 3 లక్షల నష్టం

వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో గ్రామపంచాయతీ పక్కన ఉన్న సముద్రాల మైసయ్య ఇంట్లో ఎవరు లేని సమయంలో ఊరికి వెళ్ళిన సమయం చూసి గుర్తు తెలియని వ్యక్తులు తలుపు, కిటికీ, వడ్లు దంచే రోకలితో తాళం పగుల గొట్టి పూజ గదిలో35 తులాల వెండి , తులం బంగారం , ఆభరణాలు అమ్మవారి ముక్కుపుడక నగదు పదివేల రూపాయలు చోరీకి పాల్పడ్డారని సముద్రాల మైసయ్య పేర్కొన్నాడు. ఈ విషయంపై పోలీసులు ఏఎస్ఐ పీటర్, కానిస్టేబుల్ సుందర్లాల్ దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# నిరుద్యోగ యువతకు పోలీస్ శాఖ అండ

**- 60 రోజుల ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్**

**- 200 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ**




నిజామాబాద్ సెప్టెంబర్07:( విజన్ ఆంధ్ర) : పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా చేసుకుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రీ-రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని గిరిరాజు ప్రభుత్వ కాలేజీ ఆడిటోరియం యందు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్.ప్రారంభించారు. తెలంగాణ పోలీస్ శాఖలో కానిస్టేబుల్ , సబ్-ఇన్‌స్పెక్టర్ తదితర ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో ఉన్న నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ , సరైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా వారిని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

***60 రోజుల పాటు ఉచిత శిక్షణ***

ఈ ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమం 60 రోజుల పాటు కొనసాగుతుంది. హైదరాబాద్‌కు చెందిన భాగ్య కిరణ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు , నిపుణులచే అభ్యర్థులకు శిక్షణ అందించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించబడతాయి. ఈ శిక్షణ కార్యక్రమం నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాల ఆడిటోరియంలో కొనసాగుతుంది.

***పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ***


శిక్షణలో భాగంగా పోలీస్ రిక్రూట్‌మెంట్ పోటీ పరీక్షలకు అవసరమైన వివిధ అంశాలపై అభ్యర్థులకు సమగ్ర అవగాహన కల్పించనున్నారు. పరీక్షల్లో ప్రశ్నలను వేగంగా , కచ్చితంగా పరిష్కరించే విధానం , సమయపాలన , పరీక్షా విధానం , ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టడం వంటి అంశాల్లో నిపుణులచే మార్గదర్శకత్వం అందించనున్నారు. అలాగే అభ్యర్థుల్లో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి , ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా శిక్షణ అందించడంతో పాటు , నిరంతర సాధన ద్వారా పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రోత్సహించనున్నారు.

***యువత లక్ష్యాన్ని సాధించాలి***

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్.మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. పోలీస్ ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో ఉన్న యువతకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ 60 రోజుల శిక్షణను ఎంతో విలువైన అవకాశంగా భావించి, ప్రతిరోజూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరై, అధ్యాపకులు సూచించే విధంగా కష్టపడి చదివి, నిరంతరం సాధన చేయాలని కమిషనర్ సూచించారు. కేవలం శిక్షణకు హాజరవడం మాత్రమే కాకుండా, ప్రతిరోజూ నేర్చుకున్న అంశాలను పునశ్చరణ చేసుకుంటూ, తమ బలహీనతలను గుర్తించి వాటిని అధిగమించేలా కృషి చేయాలని అన్నారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగితే విజయం తప్పకుండా సాధించవచ్చని అభ్యర్థులకు పోలీస్ కమిషనర్ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా గిరిరాజ్ కాలేజీ ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి , భాగ్య కిరణ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీ భాగ్య కిరణ్ , నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ , సి.టి.సి ఎ. సి. పి లు శ్రీ ప్రకాష్ యాదవ్ , వెంకటేశ్వర్ రెడ్డి , శ్రీ శ్రీనివాస్ , రాజశేఖర్ , జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , నిజామాబాద్ టౌన్ సిఐ శ్రీ శ్రీనివాస్ రాజ్ , నిజామాబాద్ రూరల్ సిఐలు శ్రీ సతీష్ కుమార్ , శ్రీ శ్రీనివాస్ , మహిళా పోలీస్ స్టేషన్ సిఐ శ్రీమతి శ్రీలత , సిసిఆర్బి ఎస్ఐ శ్రీ వరప్రసాద్ రెడ్డి , టౌన్ 3ఎస్ఐ శ్రీ హరిబాబు , టౌన్ 6 ఎస్సై శ్రీ సందీప్ , టౌన్ 5ఎస్ఐ శ్రీ సునీల్ , సిసిఆర్బి ఎస్ఐ శ్రీ వెంకట్రావు మరియు ఫాకల్టీ , విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వద్దు

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 07,(విజన్ ఆంధ్ర); ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఒక సమస్య పరిష్కారానికి ఒకటి కంటే ఎక్కువ శాఖల ప్రమేయం ఉన్నప్పుడు ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు అందాయి. ప్రతి అర్జీని పరిశీలించి, అర్హత, నిబంధనల మేరకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ అధికారుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డి.ఆర్.ఓ. రాథోడ్ రమేష్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## BRS ఎమ్మెల్సీ తాత మధు వ్యాఖ్యల పై ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఫైర్

**- స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నాం**

**- సభ్యత్వం రద్దు చేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్**



నిజామాబాద్ సెప్టెంబర్07:( విజన్ ఆంధ్ర) : స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ తాత మధుసూదన్(తాత మధు) గౌరవ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా పరిగణిస్తున్నామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా నీచమైన రాజకీయంగా తాత మధు వ్యాఖ్యలను అభివర్ణించారు. గౌరవప్రదమైన ఓ దళిత స్పీకర్ ను అవమానించే విధంగా సభ వెలుపల వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఈ చర్య పై BRS అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని, అదేవిధంగా తాత మధు సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.(భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని పునరుద్ఘాటించారు. అటు BRS నాయకులు సభ వెలుపల చేస్తున్న చేష్టలను తప్పుబట్టారు. తమ కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్య హక్కుగా ప్రతి సభ్యుడికి మాట్లాడే అవకాశం కల్పించడం జరుగుతుందని గుర్తు చేస్తూ ఇప్పటి వరకు ప్రతిపక్ష నాయకుడిగా కెసిఆర్ సభకు రాకపోవడం సిగ్గుచేటన్నారు.

# గురుకుల సీట్ల పేరుతో నగదు వసూలు?

**- సీటు ఇప్పిస్తానని రూ. 40,000 తీసుకుని మోసం చేశారని బాధితుడి ఫిర్యాదు**

**- డబ్బులు అడిగితే దూషించారంటూ పెన్ పహాడ్ ప్రజావాణిలో అర్జీ**

**- బాధిత యువకుడు ధీరావత్ నాగు నాయక్ ఉదంతం**




పెన్ పహాడ్, సెప్టెంబర్ 7 ( విజన్ ఆంధ్ర ): ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలలో సీటు ఇప్పిస్తానని చెప్పి ఒక వ్యక్తి తన వద్ద నుండి వేలాది రూపాయలు వసూలు చేసి మోసగించాడని, తిరిగి డబ్బులు అడిగితే దురుసుగా ప్రవర్తిస్తున్నాడంటూ పెన్ పహాడ్ మండలానికి చెందిన ఒక యువకుడు అధికారులను ఆశ్రయించాడు.బాధితుడి ఫిర్యాదు ప్రకారం పెన్ పహాడ్ మండలం, గూడెపుకుంట తండా గ్రామానికి చెందిన గిరిజన సామాజిక వర్గానికి చెందిన ధీరావత్ నాగు నాయక్ కు పిల్లల సీట్ల విషయమై భక్తలాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో పరిచయం ఏర్పడింది. గురుకుల పాఠశాలల్లో సీటు ఇప్పిస్తానని నమ్మబలకడంతో, నాగు నాయక్ తన ఫోన్ పే ద్వారా రూ. 40,000/- (నలభై వేల రూపాయలు) సదరు వ్యక్తి ఖాతాకు బదిలీ చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.డబ్బులు తీసుకున్నప్పటికీ సీటు ఇప్పించకపోవడంతో, నాగు నాయక్ తన సొమ్మును తిరిగి ఇవ్వాల్సిందిగా కోరాడు. అయితే, డబ్బులు తిరిగి ఇవ్వకపోగా సదరు వ్యక్తి తనపై తీవ్ర దురుసుగా ప్రవర్తిస్తూ, బెదిరింపులకు గురిచేస్తున్నాడని బాధితుడు ఆరోపించాడు. తనలాగే మరికొంతమంది కూడా సదరు వ్యక్తి చేతిలో మోసపోయినట్లు సమాచారం ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు.ఈ విషయమై బాధితుడు ధీరావత్ నాగు నాయక్ సోమవారం పెన్ పహాడ్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు డిజిటల్ లావాదేవీల రశీదులతో సహా లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. ప్రభుత్వ విద్యాసంస్థల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ, దౌర్జన్యానికి దిగుతున్న సదరు వ్యక్తిపై చట్టపరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే తన డబ్బును తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

## ఎస్ఐఆర్ నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

***జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి***




నిజామాబాద్ సెప్టెంబర్ 07 :(విజన్ ఆంధ్ర )ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, పక్కాగా మార్గదర్శకాలను పాటిస్తూ పారదర్శకంగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, వాటి పంపిణీ, విచారణ ప్రక్రియపై జిల్లాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణకు తగిన సమయం కల్పించి, వారి వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మల్ కలెక్టరేట్ నుండి వీ.సీలో పాల్గొన్న జిల్లా పాలనాధికారి భవేష్ మిశ్రా మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిలో ఉందని, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరిస్తూ ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి దృష్టికి తెచ్చారు. నిర్ణీత గడువులోగా విచారణను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నిజామాబాద్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**




నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 07,(విజన్ ఆంధ్ర); రానున్న వినాయక ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రానున్న వినాయక ఉత్సవాల నిర్వహణపై పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని మతాల పండుగలు సహోదర భావంతో, కలిసి మెలసి జరుపుకోవాలన్నారు. వినాయక ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గణేష్ ఉత్సవాలు మొత్తం ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వైర్లను సరి చేస్తామని చెప్పారు. ఉత్సవ నిర్వాహకులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తమ వంతుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. అలాగే వినాయక నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేసి శోభాయాత్రకు అనుకూలంగా మారుస్తామని వివరించారు. వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా పూర్తయ్యేందుకు నిర్వాహకులు సహకరించాలని కోరారు.

***వినాయక ఉత్సవాలు శాంతియుతంగా పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటాం: జిల్లా ఎస్పీ జానకి షర్మిల.***

ఈ సమావేశంలో భాగంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో గణేష్ ఉత్సవాలు మొత్తం ప్రశాంతంగా పూర్తయ్యేలా పోలీసు శాఖ తరుపున తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వేడుకలకు తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సంబంధిత అధికార యంత్రాంగంతో పోలీసు శాఖ సమన్వయంతో పని చేసి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వినాయక ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించేలా చూస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, శాంతి కమిటీ సభ్యులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి కి ఇరువైపులా పార్కింగ్ తో ఇబ్బందులు పడుతున్న ప్రజలు.



భూపాలపల్లి సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర )జిల్లా కేంద్రంలో జాతీయ రహదారి కి ఇరువైపులా రిలయన్స్ పెట్రోల్ పంపు నుండి ఫారెస్ట్ పార్కు వరకు రోడ్డుకు ఇరువైపులా లారీ లు పార్కింగ్ చేయడం వలన వాహనదారులకు, పాదాచారులకు ఇబ్బందిగా మారింది. నిత్యం వందలాది లారీలు, బస్ లు కార్లు బైక్ లతో నిత్యం రద్దీగా ఉండడం తో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పై పార్కింగ్ చేయకుండా పోలీస్ లు పట్టించుకోవాలని వాహనదారులు కోరుచున్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలా..? తాతా మధుకు ఇదేనా ప్రజాస్వామ్య మర్యాద!

**- గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలి**

**- తాతా మధుపై తక్షణమే చర్యలు తీసుకోవాలి**

**- ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కూన శ్రీశైలం గౌడ్ డిమాండ్**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొన్న అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా అభ్యంతరకరమని కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభాపతిపై ఒక ఎమ్మెల్సీ ఈ తరహా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

***రాజ్యాంగ పదవులకు గౌరవం ఉండాలి***

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభాపతి పదవికి ప్రత్యేక గౌరవం, హుందాతనం ఉంటుందని శ్రీశైలం గౌడ్ అన్నారు. రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వ్యక్తుల గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని స్పష్టం చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన శాసనసభాపతిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మరింత బాధ్యతారాహిత్యంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

***బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే***

తాతా మధు చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య సంప్రదాయాలకు, శాసనసభా వ్యవస్థ హుందాతనానికి భంగం కలిగించేలా ఉన్నాయని శ్రీశైలం గౌడ్ విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై తాతా మధు వెంటనే స్పందించి శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

***ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలి***

రాజ్యాంగ వ్యవస్థల ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించే వారిపై సంబంధిత శాసనసభ, శాసనమండలి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని శ్రీశైలం గౌడ్ కోరారు. తాతా మధుపై తక్షణమే చర్యలు తీసుకుని, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థల గౌరవం, రాజ్యాంగ పదవుల ప్రతిష్ఠను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు.

## నిమజ్జన ఏర్పాట్లు వేగవంతం చేయాలి

**- మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**



మల్కాజ్‌గిరి జిల్లా,సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ సోమవారం సరూర్‌నగర్ చెరువు వద్ద క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి నిమజ్జన ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాకపోకలు, విగ్రహాల నిమజ్జనం, పారిశుద్ధ్యం, భద్రత తదితర ఏర్పాట్లను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతంలో అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. భక్తుల భద్రత, పారిశుద్ధ్యం, ప్రజల సౌకర్యానికి ప్రాధాన్యమిస్తూ నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

**- ట్రాన్స్‌జెండర్ వర్గీయులకు జీడిమెట్ల పోలీసుల కౌన్సెలింగ్**

**- వేడుకలు, దుకాణాల ప్రారంభాల్లో ఇబ్బందులు సృష్టిస్తే ఉపేక్షించబోమని హెచ్చరిక**



జీడిమెట్ల, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): దుకాణాల ప్రారంభోత్సవాలు, గృహప్రవేశాలు, వివాహ వేడుకలు, పండుగలు తదితర కార్యక్రమాలను ఆసరాగా చేసుకుని బలవంతపు వసూళ్లు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జీడిమెట్ల పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులతో సోమవారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గాజులరామారం బాలాజీలేఅవుట్‌లోని ఓ సెలూన్ ప్రారంభోత్సవానికి ఇద్దరు ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు వెళ్లి యజమానిని డబ్బులు డిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. డబ్బులు ఇచ్చేందుకు యజమాని నిరాకరించడంతో తమ కమ్యూనిటీ సభ్యులను తీసుకువచ్చి ఇబ్బందులు సృష్టిస్తామని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో వసూళ్ల కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో కమ్యూనిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. గ్రూప్‌గా ప్రవేశించే కార్యక్రమాలు, దుకాణాల ప్రారంభోత్సవాలు, గృహప్రవేశాలు, పండుగలు, ఇతర బహిరంగ లేదా వ్యక్తిగత కార్యక్రమాల్లో బలవంతపు వసూళ్లు, బెదిరింపులు, ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలకు పాల్పడవద్దని స్పష్టం చేశారు.

***పునరావృతమైతే చర్యలు తప్పవు***

చట్టాన్ని గౌరవిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మర్యాదగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతమైనా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జీడిమెట్ల ఎస్‌హెచ్‌ఓ కె. రవికుమార్ స్పష్టం చేశారు.

## మంగనూర్ జెడ్పీహెచ్‌ఎస్ లో ఇద్దరు డిప్యుటేషన్ టీచర్లపై చర్యలు తీసుకోండి

**- ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు**


లిబిజినపల్లి, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం మంగనూర్ (గారం) గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనవసరంగా డిప్యుటేషన్ పై ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులను వారి అసలు స్కూళ్లకు పంపించాలని కోరుతూ గ్రామానికి చెందిన అప్పల పంపశెట్టి యాదవ్ జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. తమ పాఠశాలలో 16 మంది టీచింగ్, 4 మంది నాన్ టీచింగ్ మొత్తం 20 మంది సిబ్బంది ఉండాల్సి ఉందని, ఇందులో వి. పవన్ శ్రీ, విజయలక్ష్మి విరాడ్కర్ ఇద్దరూ అనవసరంగా డిప్యుటేషన్ పై కొనసాగుతున్నారని తెలిపారు. వి. పవన్ శ్రీ అసలు పోస్టింగ్ లక్ష్మిపల్లి జెడ్పీహెచ్ఎస్ లో, విజయలక్ష్మి పోస్టింగ్ కొల్లాపూర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉందన్నారు. గతంలో 17-08-2026న ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా కలెక్టర్ డీ ఈ ఓ కి ఫార్వర్డ్ చేశారని, డీ ఈ ఓ వారం రోజుల్లో వారిని పంపిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విచారణ జరిపి వారిని వారి పోస్టింగ్ స్కూళ్లకు పంపించాలని కోరారు.

# అయోమయంగా (సర్) ఉంది




మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07,(విజన్ ఆంధ్ర ) : ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (సర్) ఫారం ఆగస్టు నెల 3 వరకు అందజేయాలనీ ఎన్నికల సంఘం గడువు పొడగించింది.తర్వాత ఏదైన తప్పులున్నాట్లయితే వాటికోసం చాల మందికి నోటీసులు అందజేస్తున్నారు. కాని చాలామందికి ఈ సర్ అయోమయంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ లలో నోటీసులు రాని డివిజన్ అంటూ లేదు. తిరిగి మళ్ళీ ఏదైన గుర్తింపు పత్రాలు అందజేయాలనీ పేర్కొంటున్నప్పటికి ఇంకా కొందరికి మ్యాపింగ్ కావడం లేదని వాపోతున్నారు. సోమవారం 22 వ డివిజన్ లో ఓటు ఎక్కడ గాళ్ళంతయిదో అని వారికి సంబందించిన గుర్తింపు పత్రాలు బి ఎల్ వో లకు అందజేయడానికి బారులు తీరారు. కేంద్ర ఎన్నికల సంఘం మరోమారు పునరాలోచించి ఇదివరకు (2002) లో ఓటు హక్కు కలిగిన వారికి అప్పటి ఓటరు జాబితాలో పేరు ఉన్నవారికి సర్ లో సడలించే విదంగా అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

## నటరాజ్ శాక్య రచించిన "మన వేమన తండ్రి" గ్రంథావిష్కరణ








హైదరాబాద్ సెప్టెంబర్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ రచయిత, మాజీ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జాయింట్ రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ల పరిపాలనా అధికారి డి. నటరాజ్ శాక్య, మహాకవి వేమన గురించి 10 సంవత్సరాలుగా పరిశోధన చేసిన రచించిన అపురూప పరిశోధనా గ్రంథం 'బుద్ధ – నాగార్జునుల ఒరవడిలో మహాకవి మహా విప్లవకారుడు "మన వేమన తండ్రి" ఆయన పద్యం – విశ్వజనుల ధమ్మపదం', గ్రంధావిష్కరణ సభ సాహితీ మూర్తులు, ప్రేక్షకుల, బంధుమిత్రుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య వైభవంగా జరిగింది. రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, మొదటి అంతస్తు, సైఫాబాద్, హైదరాబాద్ లో ఆదివారం సాయంత్రం రచయిత్రి, సాంఘిక కార్యకర్త, గోగు శ్యామల అధ్యక్షతన జరిగిన ఈ ఆవిష్కరణ మహోత్సవం కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా డాక్టర్. చేతన ఐపిఎస్, శవ నారాయణ ఐఏఎస్, చరిత్ర మహోపన్యాసకులుగా డాక్టర్. ఈమని శివనాగిరెడ్డి, ఉపన్యాసకులు:గా జైభీమ్ మచ్చ దేవేందర్, రచయిత్రి జూపాక సుభద్ర, అనిమిరెడ్డి పాల్గొని మహాకవి వేమన మనవాడు, మన గౌరవం, మన ఆత్మగౌరవం, మహా విప్లవకారుడు అని తెలిపారు. వేమన గురించి ఎంతో విస్తృతంగా పరిశోధన చేసిన గ్రంథ రచయిత నటరాజ్ శాక్య అందరికీ అర్థమయ్యేలా ఎంతో గొప్పగా ఈ పుస్తకాన్ని రాశారని అభినందించి, ప్రశంసించారు. చివరిగా గ్రంథ రచయిత డి. నటరాజ్ శాక్య ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## "మాతృదేవోభవ సత్సంగ్ " ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు, పురస్కారాల ప్రధానం




హైదరాబాద్ సెప్టెంబర్ 2026 విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రఖ్యాత సావిత్రి బాయి మహిళా సంక్షేమ సంఘం సారద్యంలో మాజీ మంత్రి మాజీ సిడబ్ల్యుసి సభ్యురాలు దివంగత లక్ష్మీ దేవి అలాగే, భారత మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సర్వేపాలి రాధా కృష్ణన్ స్ఫూర్తితో, తల్లి ప్రేమతో తమ సేవలను చేయడానికి ప్రజలను ప్రేరేపించడమే లక్షంతో ఏర్పాటు చేసిన ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ "మాతృదేవోభవ సత్సంగ్ " ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాతృదేవోభవ సత్సంగ్ అధ్యక్షురాలు డాక్టర్. ఉదయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ అంజనీదేవి గోగిరెడ్డి, కార్యక్రమం నిర్వాహకుడు శ్రీధర్ నేతృత్వంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో సేవమూర్తులను, ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించే కార్యక్రమం ఆనందోత్సవాల మధ్య వైభవంగా జరిగింది. శనివారంనాడు మధ్యాహ్నం మొదటి అంతస్తు, సమావేశ మందిరం, రవీంద్ర భారతి, లక్డికాపూల్, హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన ఈ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ప్రముఖ సేవా మూర్తులు, సంఘ సేవకులను, ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రత్యేక అతిథి దైవజ్ఞ శర్మ ఇతర ప్రముఖుల చేతుల మీదుగా శ్రీనివాస్ రెడ్డి, వీర బొమ్మ రమేష్, ప్రేమ రెడ్డి, కె.బి. శ్రీధర్, బెల్లం. మాధవి, రామ్ కృష్ణ, వందనం రాజు, రాజేంద్ర యాదవ్, ఆర్ఎస్ఎస్ నందూరి రమేష్, కె. కోటేశ్వర్ రావున్, మోహన్ గాంధీ, గూడూరు శ్రీధర్ రెడ్డి లు పురస్కారాలు అందుకున్నారు. ముందుగా జెపిఎల్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి, అలరించాయి.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా సెక్రెటరీగా ప్రవీణ్ జాన్సన్ నియామకం




మల్కాజిగిరి , సెప్టెంబర్ 7, విజన్ ఆంధ్ర : కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ సెక్రెటరీగా పీ. ప్రవీణ్ జాన్సన్ నియమితులైనా రు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మన్ కావలి చంద్రయ్య ఆయనకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు,జిల్లా చైర్మన్ చెన్నయ్య చేతుల మీదుగా ఆయన నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ సెల్ సెక్రెటరీ పీ. ప్రవీణ్ జాన్సన్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు తాను చేసిన సేవలను గుర్తించి, తనకీ పదవీ బాధ్యతలు అప్పగించినందుకు జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మన్ కావలి చంద్రయ్యకు, సహకరించిన మైనంపల్లి హన్మంతరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పలువురు పాల్గొన్నారు

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**- సమాచారాన్ని బాధితులకు తెలియజేయాలి**

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 7 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించి, ఆ సమాచారాన్ని బాధితులకు తెలియజేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్. ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఒకవేళ వచ్చిన ఫిర్యాదు తమ శాఖ పరిధిలోనిది కాకపోతే, వెంటనే సంబంధిత శాఖకు లేఖ రాస్తూ ఫార్వర్డ్ చేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం పరిష్కరించలేని వినతులు ఉంటే, ఏ కారణం చేత కుదరదో దరఖాస్తుదారునికి స్పష్టంగా వివరించాలే తప్ప అర్జీలను పెండింగ్‌లో ఉంచుకోకూడదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి కార్యాలయాల నుంచి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను సైతం ప్రాధాన్య క్రమంలో వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్‌లో 34 అర్జీలు రాగా, ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 4 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, జడ్పీ సీఈఓ యాదయ్య, ఏఓ భాను ప్రకాశ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రంజిత్ రెడ్డి మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వారసత్వ ఆస్తుల వివాదాలకు చట్టమే పరిష్కారం

**- వనపర్తి ఎస్పీ సునిత రెడ్డి**

**- బెదిరింపులు, ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు**


**- 'ప్రజావాణి'లో 10 ఫిర్యాదుల స్వీకరణ**





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర) : వారసత్వ ఆస్తులు, భూముల పంపకాలకు సంబంధించి ఎలాంటి వివాదాలున్నా రెవిన్యూ యంత్రాంగం లేదా న్యాయస్థానాల ద్వారానే చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి స్పష్టం చేశారు. ఆస్తి వివాదాల పేరుతో బెదిరింపులు, దౌర్జన్యాలు, అక్రమ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... కుటుంబ సభ్యులు, అన్నదమ్ములు లేదా ఇతర వారసుల మధ్య ఉండే భూ, ఆస్తి వాటాల వివాదాలు ప్రధానంగా సివిల్ స్వభావానికి చెందినవని తెలిపారు. ఆస్తి తమదేననే భావనతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, బలవంతంగా ఆక్రమించడం లేదా భయాందోళనలకు గురిచేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు. పట్టాలు, హక్కులు, సరిహద్దుల వివాదాలపై రెవిన్యూ అధికారులను సంప్రదించాలని లేదా కోర్టును ఆశ్రయించి చట్టబద్ధమైన తీర్పు పొంది శాశ్వత పరిష్కారం చూసుకోవాలని సూచించారు. ఆస్తి తగాదాల కారణంగా వ్యక్తిగత కక్షలు, గొడవలు, దాడులకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసు శాఖ చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. సమస్యలను చర్చల ద్వారా సాధ్యమైనంతవరకు సామరస్యంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 10 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. వీటిలో 7 భూ/ఆస్తి వివాదాలకు సంబంధించినవి కాగా, ఒకటి భార్యాభర్తల మధ్య వివాదం, రెండు పరస్పర గొడవలకు సంబంధించినవి ఉన్నాయని వెల్లడించారు. అందిన ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు త్వరితగతిన చట్టపరమైన న్యాయం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

# ఉదయం ఒక రంగు.. సాయంత్రానికి మరో రంగు!

### వనపర్తి మిద్దెతోటలో అబ్బురపరుస్తున్న 'పత్తి మందారం'







వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర) : ప్రసిద్ధ ప్రజా గాయకుడు స్వర్గీయ గద్దర్ తన పాటలో 'పొద్దు తిరుగుడు పువ్వ పొద్దును ముద్దాడే' అని ప్రకృతి వింతలను వర్ణించినట్లే.. ఇక్కడ ఒక మిద్దె తోటలోని పువ్వు తన వర్ణ విన్యాసంతో అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన పోల్కంపల్లి సుజాత తన ఇంటిపై ఏర్పాటు చేసిన మిద్దె తోటలోని 'పత్తి మందారం' ప్రస్తుతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పత్తి మందారం మొక్కకు పూసే పువ్వు సమయాన్ని బట్టి రంగులు మార్చుకోవడం విశేషం. ఉదయం వేళ లేత రంగుతో వికసించి ఆహ్లాదాన్ని పంచుతుంది. మధ్యాహ్న సమయానికి వేరొక రంగులోకి మారుతుంది. సాయంత్రానికి అంతకంటే ముదురు వర్ణంలోకి మారి చూపరులను అబ్బురపరుస్తుంది. ఒకే రోజులో ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలానికి తగినట్లుగా రంగులు మారుస్తూ వికసించే ఈ పువ్వును చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమ తోటలో ఉన్న వందలాది రకాల మొక్కల్లో ఈ పత్తి మందారం అత్యంత ప్రత్యేకమైనదని, ఎంతో శ్రద్ధతో దీనిని పెంచుతున్నామని తోట నిర్వాహకురాలు సుజాత తెలిపారు.

# చరిత్ర పుటల్లో 'ప్రగతి విద్యాలయం'..

**- ఇండియా బుక్ ఆఫ్ అచీవ్‌మెంట్స్‌లో చోటు!**

**- గ్రామీణ పేద పిల్లలకు నాణ్యమైన విద్యనందిస్తూ సామాజిక పరివర్తన**

**- 950 మంది విద్యార్థులు, 52 మంది సిబ్బందితో విశేష సేవలకు గుర్తింపు**

**- పారదర్శక పరిశీలన ఆధారంగా ఐబీఏ రికార్డుల్లో నమోదు**






వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర) : పేదరికం కారణంగా ఏ ఒక్క చిన్నారి విద్యకు దూరం కాకూడదనే ఉన్నత ఆశయంతో ప్రారంభమైన ' ప్రగతి విద్యాలయం' జాతీయ స్థాయిలో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. భారతదేశంలో వ్యక్తులు, సంస్థలు సాధించే అసాధారణ విజయాలను నమోదు చేసే అధికారిక సంస్థ 'ఇండియా బుక్ ఆఫ్ అచీవ్‌మెంట్స్' రికార్డుల్లో పాఠశాల తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. అంతర్జాతీయ స్థాయిలో గిన్నీస్ రికార్డు ఎంతటి ప్రాముఖ్యత కలిగి ఉందో, భారతీయ స్థాయిలో అత్యంత పారదర్శకమైన పరిశీలనా ప్రక్రియ ద్వారా రికార్డులను నమోదు చేసే ఐబీఏలో ప్రగతి విద్యాలయంకు చోటు దక్కడం విశేషం.

*గ్రామీణ ప్రాంతంలో విద్యా విప్లవం*

ఒక చిన్న గ్రామంలో రూపుదిద్దుకున్న ఈ పాఠశాల, నేడు 950 మంది విద్యార్థులు, 52 మంది బోధనా సిబ్బంది, 6 పాఠశాల బస్సులతో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక పరివర్తన తీసుకురావడం, విద్యార్థుల జీవన ప్రమాణాలను పెంచడం, నాణ్యమైన జ్ఞానాన్ని పంచడం లాంటి లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తుండటాన్ని ఐబీఏ సంస్థ గుర్తించింది. ఒక చిన్న ఊరిలో ఈ స్థాయిలో విద్యాసేవలు అందించడాన్ని గొప్ప విషయంగా పరిగణించి, పాఠశాల పేరును తన రికార్డు పుస్తకంలో నమోదు చేసింది.

*సమిష్టి కృషికి లభించిన గౌరవం*

ఈ అరుదైన గుర్తింపుపై పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ.. ఇది ఏ ఒక్కరి వల్లనో సాధ్యమైన విజయం కాదని, అందరి సమిష్టి కృషికి దక్కిన ప్రతిఫలమని పాఠశాల కరస్పాండెంట్ భీంసాగర్ పేర్కొన్నారు. పాఠశాల ఈ స్థాయికి చేరుకోవడానికి అహర్నిశలు సహకరించిన విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, బోధన మరియు బోధనేతర సిబ్బంది ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందు కూడా అందరి సహకారం ఇలాగే కొనసాగితే మరిన్ని ఉన్నత విజయాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# వారం రోజుల నిరసనలతో కాంగ్రెస్ సర్కారులో అలజడి

**- మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.**

**- నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల.**



నిజామాబాద్ సెప్టెంబర్07:( విజన్ ఆంధ్ర ) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపుతో రాష్ట్రంలో కొనసాగుతున్న నిరసనలతో కాంగ్రెస్ ప్రభుత్వంలో అలజడి మొదలైందని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. సర్వేల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని బిగాల గణేష్ గుప్తా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు గణేష్ బిగాల విమర్శించారు. నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బడ్జెట్, ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా 6 గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. రూ.2,000 పెన్షన్‌ను రూ.4,000 చేస్తామని, ఇంట్లో ఇద్దరికి ఇస్తామని ఆశ చూపి ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. గత 10 ఏళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రంగా ఎదిగిందని కొనియాడారు. రైతు బంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలతో రైతులను, పేద ప్రజలను ఆదుకున్న ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ దేశానికే ధాన్యాగారంగా మారిందన్నారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ విఫల పాలనపై శాంతియుతంగా అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. 420 హామీల ఫ్లెక్సీల ప్రదర్శన, ధర్నాలు, బైక్ ర్యాలీలు, నిరసనలు విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు.అసెంబ్లీ సమావేశాల్లో బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే ప్రభుత్వం అడ్డుకోవడం అప్రజాస్వామికమని అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జగదీష్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు, ప్రభుత్వం ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఖండించారు.కాంగ్రెస్ వైఫల్యాలను గమనిస్తున్న ప్రజలు, ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్ వైపు వస్తున్నారని, ప్రతినిత్యం భారీగా చేరికలు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయమని సర్వేలు కూడా స్పష్టం చేస్తున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్, సిర్ప రాజు,నుడా మాజీ చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి,సుజిత్ సింగ్ నాగారం నర్సింగ్,నవీద్ ఇక్బాల్,అబ్దుల్ మతీన్ తదితరులు పాల్గొన్నారు.

## శుభాకాంక్షలు..!





కాప్రా/సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర ప్రతినిధి)ద: ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన గద్వాల్ విజయలక్ష్మి ని సోమవారం నాడు ప్రజా భవన్ లో కలిసి శుభాకాంక్షలు డాక్టర్.ఏ.ఎస్. రావు నగర్ మాజీ కార్పొరేటర్ పాజ్జురి పావని మణిపాల్ రెడ్డి.

## కుషాయిగూడ లో రాజగోపురం ప్రారంభోత్సవం..!





కాప్రా/ సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : కుషాయిగూడ శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయం లో సోమవారం రోజున దేవాలయ తూర్పు ఈశాన్య ప్రాంతములో నూతనముగా నిర్మించబడిన రాజ గోపుర ముఖద్వారము ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ రాజగోపుర నిర్మాణ దాత. ఆలయ చైర్మన్ వుప్పల యాదగిరి రెడ్డి పెద్ద కుమారుడు కీ.శే,వుప్పల శ్రీనివాస్ రెడ్డి జ్ఞాపకార్థమై నిర్మించడం జరిగినది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆలయ చైర్మన్ వుప్పల యాదగిరి రెడ్డి వీరి చిన్న కుమారుడు వుప్పల విజయ భాస్కర్ రెడ్డి దంపతులు ఆలయ సిబ్బంది పల్లె సురేందర్ రెడ్డి. పల్లె భద్రారెడ్డి. పల్లె సుధాకర్ రెడ్డి. పల్లె శ్రీకాంత్ రెడ్డి.ఆలయ ఈ.ఓ. ఎం. వీరేశం. పల్లె నరేందర్ రెడ్డి. పంజాల శ్రీనివాస్ గౌడ్.ఆలయ అర్చకులు. సిబ్బంది భక్తుల సమక్షంలో విజయవంతంగా జరిగినది.

## ఈ నెల 12న జాతీయ లోక్ అదాలత్

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర) : ఏళ్ల తరబడి కోర్టుల్లో నలుగుతున్న వివాదాలకు తక్షణ ముగింపు పలికేందుకు లోక్ అదాలత్ ఒక సువర్ణ అవకాశమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఛైర్మన్ బాకరాజు శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 12వ తేదీన నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆస్తి, భూ వివాదాలు, వివాహ సంబంధిత వివాదాలు, భరణం కేసులు. చెక్ బౌన్స్ కేసులు, మోటార్ ప్రమాద క్లెయిమ్‌లు, ఇతర రాజీపడదగిన క్రిమినల్ కేసులు.

లోక్ అదాలత్ ప్రత్యేక ప్రయోజనాలు

సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు ఎటువంటి కోర్టు ఫీజు లేకుండా తక్షణ పరిష్కారం లభిస్తుంది. ఇదివరకు దావా వేసేందుకు కోర్టులో చెల్లించిన ఫీజును తిరిగి వాపస్ చేస్తారు. లోక్ అదాలత్ ఇచ్చే తీర్పుకు సివిల్ కోర్టు డిక్రీ సమానమైన ప్రాధాన్యం ఉంటుంది. ఈ తీర్పుపై పైకోర్టుల్లో అప్పీలు చేసుకునే అవకాశం ఉండదు, దీనివల్ల వివాదం శాశ్వతంగా ముగుస్తుంది.


## ప్రజావాణికి 116 ఫిర్యాదులు



నిజామాబాద్, సెప్టెంబర్ 07 :(విజన్ ఆంధ్ర )ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 116 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గురువులు జీవితాన్నిస్తారు

- వర్ధన్నపేట ఎంపీడీవో శ్రీమతి వెంకటరమణ.
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం





వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర); తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువులు జీవితాన్నిస్తారని గురువులను గౌరవించాలని వర్ధన్నపేట ఎంపీడీవో శ్రీమతి వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశం లో సోమవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు వారు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈఓ మాము నూరి శ్రీధర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ సమాజంలో గురువులపాత్ర ఉన్నతమైనదన్నారు. గురువులపై ప్రతి విద్యార్థి అంకితభావంతో ఉండాలన్నారు. చదువు చెప్పే వారు మాత్రమే గురువులు కాదని, సన్మార్గంలో నడిపించే ప్రతిఒక్కరూ గురువులేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదన్నారు. విద్యార్థులు సమాజంలో ఉన్నతస్థాయిలో రాణించడానికి తల్లిదండ్రుల కృషి ఎంత ఉంటుందో గురువుల కృషి కూడా అంతే ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు శాలువామేమెంటో ప్రశంసా పత్రాలతో గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కాయత శ్రీనివాస్, కృష్ణ, సిహెచ్ రమేష్, సంఘాల నాయకులు మనుచేందర్ రెడ్డి, అశోక్, బండ రమేష్, కుసుమ కుమారస్వామి, సురేష్ గుడికందుల, ఉపాధ్యాయులు, సిఆర్పిలు తదితరులు, పాల్గొన్నారు.

## 38 వ డివిజన్ లో పోచమ్మ, మైసమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 38వ డివిజన్లో కొత్త చెరువు కట్ట పోచమ్మ, మైసమ్మ ఆలయ నిర్మాణానికి సోమవారం 38 డివిజన్ కార్పొరేటర్ పూదరి విజయరాణి తిరుపతి ఆధ్వర్యంలో భూమిపూజా చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ,మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్ హాజరయ్యారు. వేద పండితులు అరుణ్ శర్మ బృందం భూమి పూజ కార్యక్రమం చేపట్టారు.మాజీ డిసిసి అధ్యక్షురాలు సురేఖ ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 38 వ డివిజన్ కార్పొరేటర్ సురేఖ ను శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమం లో 39 వ డివిజన్ కార్పొరేటర్ పూదరి సునీత ప్రభాకర్,మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి భాణేష్, పార్టీ పట్టణ అధ్యక్షులు, కార్పొరేటర్ తుమ్మల నరేష్, నల్ల శంకర్, హరికృష్ణ, కర్రు శంకర్, స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 56 ఫిర్యాదులు


- ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి
- రెవెన్యూ శాఖకు 27, ఇతర శాఖలకు 29 వినతులు
- అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి
- ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7, ( విజన్ ఆంధ్ర ): సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 56 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజలకు సత్వర సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 27, ఇతర శాఖలకు సంబంధించిన 29, మొత్తం 56 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణహితంగా వేడుకలను నిర్వహించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని ఆయన కోరారు. సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహిత అలంకరణలను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు సంబంధిత శాఖలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును బాధ్యతగా పరిష్కరించాలి.

- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.



ములుగు సెప్టెంబర్ 07, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలు 9, ఇందిరమ్మ ఇండ్లు 1, పింఛన్లు 1, ఉద్యోగాలు 15, ఇతర శాఖలకు సంబంధించినవి 10 కలిపి మొత్తం 36 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలపై జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు అర్జీదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ కృష్ణవేణి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాటా మధు వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం

- ప్రజాస్వామ్య వ్యవస్థను, స్పీకర్ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు...
- యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ తీవ్ర ఆగ్రహం



వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర); తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాటా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కందికట్ల అనిల్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే శాసనసభ స్పీకర్ పదవిని కించపరిచే విధంగా మాట్లాడటం తాటా మధు రాజకీయ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని అన్నారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించడం నేర్చుకోవాలి. అధికారం కోల్పోయిన బాధలో ఇష్టానుసారంగా మాట్లాడటం బీఆర్ఎస్ నేతలకు తగదు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని కందికట్ల అనిల్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంటే, ప్రతిపక్ష నేతలు నిర్మాణాత్మక విమర్శలు చేయకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆయన విమర్శించారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపైనా ఉందని, భవిష్యత్తులో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ పార్టీ యువత తగిన రీతిలో ప్రజాస్వామ్య పద్ధతిలో సమాధానం చెబుతుందని కందికట్ల అనిల్ హెచ్చరించారు.

# మదీనాగూడలో ప్రణామ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 100 పడకల ప్రత్యేక 'మదర్ & చైల్డ్' ఆసుపత్రి ప్రారంభం...



శేరిలింగంపల్లి. సెప్టెంబర్ 7: (విజన్ ఆంధ్ర) మియాపూర్ మదీనాగూడలోని ప్రణామ్ హాస్పిటల్స్ నూతన భవనంలో మహిళలు, పిల్లల సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 100 పడకల 'మదర్ & చైల్డ్' ఆసుపత్రిని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పి ఏ సి చైర్మన్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్, బీజేపీ నాయకులు రవికుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అరెకపూడి గాంధీ మీడియాతో మాట్లాడుతూ... డాక్టర్ మనీష్ బృందం అన్ని హంగులతో, 3 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, 100 పడకల సామర్థ్యంతో ఈ హాస్పిటల్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారని అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణతో పాటు, ఆసుపత్రి ప్రాంగణాన్ని పూర్తి ఇన్ఫెక్షన్-ఫ్రీగా తీర్చిదిద్దడం ప్రశంసనీయమన్నారు.ప్రణామ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మనీష్ గౌర్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రజ్ఞా శ్రీవాస్తవ మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే తమ వద్ద 150 పడకల మల్టీ-స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉండగా, మహిళలు మరియు చిన్నారులకు మరింత ప్రత్యేకమైన, అత్యున్నత వైద్య సేవలందించేందుకే ఈ నూతన 100 పడకల భవనాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఇందులో అధునాతన ఆపరేషన్ థియేటర్లు, అత్యాధునిక ఐసీయూలు, ఎన్ఐసీయూ, పీఐసీయూ, మెటర్నల్ ఐసీయూలతో పాటు లగ్జరీ సూట్ రూమ్‌లను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దినట్లు తెలిపారు. సాధారణ ప్రజలకు అందుబాటు ధరల్లో ,సొంత కుటుంబ వైద్యుడిలా ప్రతి కుటుంబానికి ఆత్మీయ భరోసానిచ్చే వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్పొరేట్ భారం లేకుండా ఒక 'ఫ్యామిలీ హాస్పిటల్'గా రోగుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని, భవిష్యత్తులో టైర్-2, టైర్-3 నగరాలకూ తమ నెట్‌వర్క్‌ను విస్తరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ ప్రసాద్ మనోజ్ సి ఓ ఓ గీతా భవాని ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 61,116 మందికి ఓటరు నోటీసుల అందజేత

- హియరింగ్, డేటా ఎంట్రీ ప్రక్రియ వేగవంతం చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర సీఈఓ సుదర్శన్ రెడ్డి ఆదేశం




వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) 2026 ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. అనామలీస్, అన్-మ్యాపింగ్ జాబితాల్లో జనరేట్ అయిన 88,727 నోటీసులకు గాను ఇప్పటివరకు 61,116 మంది ఓటర్లకు నోటీసులు అందజేసినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వెల్లడించారు. సోమవారం నోటీసుల పంపిణీ, హియరింగ్ నిర్వహణ, ఆమోదించిన దరఖాస్తుల పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ... అనామలీస్, అన్-మ్యాపింగ్ జాబితాలోని ఓటర్లకు నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు సత్వరమే హియరింగ్ నిర్వహించి, వారు సమర్పించిన పత్రాలను బీఎల్వోల ద్వారా అప్‌లోడ్ చేయించాలని సూచించారు. అనంతరం డేటా ఎంట్రీ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొని జిల్లా వివరాలను సీఈఓకు నివేదించారు. జిల్లాలో ఇప్పటివరకు 61,116 మందికి నోటీసులు అందించడంతో పాటు, 4,757 మందికి హియరింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల అథారిటీ నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఈ ప్రక్రియ చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# నరకప్రాయంగా మంచిర్యాల మార్కెట్

- చెత్త కుప్పలతో ముక్కుపుటలదిరే కంపు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- వ్యాధుల భయంలో వ్యాపారులు, ప్రజలు





మంచిర్యాల టౌన్, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర) : మంచిర్యాల పట్టణంలోని ప్రధాన మార్కెట్ ఏరియా చెత్తాచెదారంతో నిండిపోయి, తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపల్ సిబ్బంది మార్కెట్ ప్రాంతంలో చెత్తను తొలగించకపోవడంతో కూరగాయల వ్యర్థాలు, కుళ్ళిపోయిన పదార్థాలు రోడ్డుపైనే పేరుకుపోయాయి. దీంతో మార్కెట్ ప్రాంతం నరకానికి నకలుగా మారింది. దుర్గంధంతో ఊపిరాడని పరిస్థితి మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారులు, చుట్టుపక్కల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త కుళ్ళిపోవడంతో వస్తున్న కంపు భరించలేక ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనికితోడు ఈ చెత్త కుప్పలపై ఈగలు, దోమలు ముసురు తుండటంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజూ మార్కెట్ కు వందలాది మంది ప్రజలు వస్తుంటారు. కార్పొరేషన్ అభివృద్ధిలో భాగంగా మార్కెట్ ఏరియాలో డ్రైనేజ్ నిర్మాణాలు సాగుతుండగా అందులో దుర్గంధం కారణంగా కొనుగోలుదారులు మార్కెట్‌లోకి రావడానికి వెనుకాడుతున్నారు. దీంతో మా వ్యాపారాలు దెబ్బతింటున్నాయి అని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు. చెత్త వల్ల దోమల బెడద ఎక్కువై డెంగ్యూ, మలేరియా వంటి రోగాల బారిన పడే అవకాశం ఉందని భయపడుతున్నారు. పట్టణ శుభ్రతపై అధికారులు నిర్లక్ష్యం వీడి, వెంటనే స్పందించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. రోజువారీగా మార్కెట్ ప్రాంతంలో చెత్తను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ అధికారులను, ప్రజాప్రతినిధులను డిమాండ్ చేస్తున్నారు.

## మంత్రి వర్గం నుండి కొండా సురేఖ ను బర్తరఫ్ చేయడం సిగ్గుచేటు

*తీవ్రంగా ఖండించిన జిల్లా మార్కండేయ పద్మశాలి సంఘం*




మంచిర్యాల టౌన్ సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర)కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మంత్రి వర్గం నుండి బీసీ , పద్మశాలీయుల ముద్దు బిడ్డ కొండా సురేఖ రాష్ట్ర మంత్రి వర్గం నుండి అకారణం గా బర్తరఫ్ చేయడాన్ని మంచిర్యాల జిల్లా భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ తీవ్రంగా ఖండించింది. అదే విధంగా తెలంగాణ రాష్ట్రం లోని రాష్ట్ర , జిల్లా పద్మశాలి సంఘాలు మరియు అఖిల భారత పద్మశాలి సంఘ నాయకులు కొండా సురేఖ బర్తరఫ్ కు వ్యతిరేకంగా బీసీ , ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంఘాలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని మార్కండేయ పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గజల్లి రాజలింగు హెచ్చరించారు రాష్ట్రంలో ఏ పార్టీ అధికారం లోకి వస్తే ఆ పార్టీ లోకి ఫిరాయించి తమ వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కొరకు , పదవుల కొరకు పార్టీ లు ఫిరాయించే అఖిల భారత రాష్ట్ర పద్మశాలి సంఘం నాయకులు అని చెప్పుకునే నాయకులా రా రాష్ట్రం లో ఒక పద్మశాలి బిడ్డను రాష్ట్ర మంత్రి వర్గం నుండి అకారణంగా తొలిగించిన గత వరం రోజుల నుండి తమరు స్పందించకపోవడం శోచనీయమని , నోరు మెదపకపోవడం పట్ల యావత్ తెలంగాణ రాష్ట్రంలోని పద్మశాలీయులు , బీసీ లు మీ స్వార్థ రాజకీయలను గమనిస్తున్నారని ఈ విషయం లో వెంటనే స్పందించ కుంటే రాబోయే రోజుల్లో యావత్ పద్మశాలీ సమాజం , బీసీ లు మిమ్ములను నిలదీయడానికి సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను. అదే విధంగా కొండా సురేఖ ను రాష్ట్ర మంత్రి వర్గం నుండి తొలిగించడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని మీకు చేత కాక పోతే మీ పదవులకు రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని హితవు పలికారు.

## శేరిలింగంపల్లి జోనల్ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు

- కమిషనర్ నారాయణ అమిత్ ఐఏఎస్ ఆదేశం



శేరిలింగంపల్లి .సెప్టెంబర్ 7: (విజన్ ఆంధ్ర) : శేరిలింగంపల్లి జోన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, పౌర సేవలు మరియు రాబోయే వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ (ఐఏఎస్) అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జోనల్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఇంజనీరింగ్, అర్బన్ బయోడైవర్సిటీ (ఖదీణ), శానిటేషన్ మరియు ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ మాట్లాడుతూ, జోన్ పరిధిలో కొనసాగుతున్న అన్ని రకాల ఇంజనీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నగర సుందరీకరణలో భాగంగా అర్బన్ బయోడైవర్సిటీ (ఖదీణ) విభాగానికి చెందిన ప్లాంటేషన్, పార్కుల నిర్వహణ పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా, రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జోన్ వ్యాప్తంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే చెరువుల వద్ద లైటింగ్, రోడ్ల మరమ్మతులు, పారిశుధ్యం మరియు తాగునీటి సౌకర్యాలను కల్పించాలన్నారు. పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, పౌర సేవలను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.

# కాంగ్రెస్ 420 హామీలు ఏమయ్యాయి?

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహారావు.



ములుగు సెప్టెంబర్ 06, విజన్ ఆంధ్ర ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలు ఏమయ్యాయని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు ప్రశ్నించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సోమవారం ములుగు కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టి, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై గ్రీవెన్స్ లో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్, వెయ్యి రోజులు దాటినా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని మండిపడ్డారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2500, తులం బంగారం, స్కూటీ ఇవ్వలేదని, రైతులకు రైతు భరోసా, ఎరువులు, బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంలో విఫలమైందని అన్నారు. రైతు కూలీలు, ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలు, ఇల్లు లేనివారికి ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇళ్లు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఫీజు బకాయిల చెల్లింపు, రూ.4000 పింఛన్ వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం ఒంటెద్దు పోకడ పోతోందని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో సానికొమ్ము రమేష్ రెడ్డి, గోవింద్ నాయక్, కౌన్సిలర్ సునీత ఓదెలు, కొగిల లక్ష్మి, మల్క రమేష్, ఆకుతోట చంద్రమౌళి, గొనెల భవాని, గడ్డం భాస్కర్, రఘు, శ్రీనివాస్, విజయ్, రమణారెడ్డి, భూక్యా మురళి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు జరపాలి

- శాంతిభద్రతలకు ప్రాధాన్యతనివ్వాలి
- కలెక్టర్ బోర్ఖడే హేమంత్ వాసుదేవరావు.



ములుగు సెప్టెంబర్ 07, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మండపాలకు తప్పనిసరిగా పోలీస్ అనుమతి తీసుకోవాలి. ఆన్‌లైన్‌లో లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు మండపాల వద్ద జూదాలు, వివాదాస్పద ప్రసంగాలు నిషేధం. భక్తి కార్యక్రమాలకే పరిమితం కావాలనీ, మసీదులు, ఆసుపత్రులు, పాఠశాలల వద్ద ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి. ప్రార్థన సమయాల్లో సహకరించాలన్నారు. పర్యావరణ హితం కోసం మట్టి విగ్రహాలనే వాడాలి. డీజేలకు అనుమతి లేదనీ విద్యుత్ ఏర్పాట్లలో జాగ్రత్తలు పాటించి. నాణ్యమైన పరికరాలే వాడాలన్నారు.- తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, అంబులెన్స్, ఫైర్ ఇంజన్లు అందుబాటులో ఉంచాలనీ మండల స్థాయిలో తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు ఉత్సవ కమిటీలతో సమావేశం కావాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- రెండు రోజుల్లో మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలోని వారికి నోటీసులు ఇవ్వాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల, సెప్టెంబర్ 07( విజన్ ఆంధ్ర బ్యూరో) : ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను వేగవంతం చేసి పారదర్శకమైన, సమగ్ర ఓటర్ల జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్లందరికీ రెండు రోజుల్లో నోటీసుల అందజేత ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గద్వాల ఐడీఓసీ నుంచి కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం 1,49,282 నోటీసులు సిద్ధం చేయగా, ఇప్పటివరకు దాదాపు 80 శాతం ఓటర్లకు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. వీసీ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్.. ఏఈఆర్ఓలు ప్రతిరోజూ సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏ, బీ, సీ కేటగిరీల వారీగా నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలను సమర్పించేలా బీఎల్ఏల సహకారం తీసుకోవాలని సూచించారు. ఫామ్-6, 7, 8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ నేపథ్యంలో కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నిర్దేశిత సమయంలోగా ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. రీ-సర్వే చేయాల్సిన గ్రామాలపై స్పష్టతతో ముందుకు వెళ్లాలని, ఇప్పటికే శిక్షణ పొందిన సర్వేయర్లు నిబంధనల ప్రకారం పనిచేయాలని సూచించారు. అవసరమైన చోట లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించు కోవాలని తెలిపారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. భూభారతి, సాదా బైనామా దరఖాస్తులను కూడా సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రికి రెక్కలు! ఎయిర్‌పోర్ట్‌కు ఏఏఐ టెక్నికల్ స్కాన్

**- ప్రతిపాదిత స్థలాల్లో క్షేత్రస్థాయి పరిశీలన..**

**- రన్‌వే, నైట్ ల్యాండింగ్, అప్రోచ్ ఫన్నెల్‌పై అధ్యయనం**

కొత్తగూడెం బ్యూరో సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు మరో కీలక ముందడుగు పడింది. ప్రతిపాదిత స్థలాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం సోమవారం జిల్లాకు చేరుకుని క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించింది. ఏఏఐ సభ్యులు భరత్‌రెడ్డి, ఎండీ ఏవియేషన్ నేతృత్వంలోని బృందం ప్రతిపాదిత ప్రాంతాల్లో భూమి లభ్యత, విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, రన్‌వే ఏర్పాటుకు అనుకూలత, విమానాల అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్, భద్రతా ప్రమాణాలను పరిశీలించింది. విమానాశ్రయానికి ప్రతిపాదిత ప్రాంతాలుగా సుజాతానగర్ మండలంలోని సీతంపేట, సుజాతానగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచ/దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను గుర్తించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయా ప్రాంతాల్లో సర్వే, స్థల పరిశీలన కొనసాగుతోంది.

***పెద్ద విమానాల రాకపోకలపై దృష్టి***

సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఏఏఐ బృందం సమావేశమై విమానాశ్రయ ప్రతిపాదనపై చర్చించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ATR-72తో పాటు ఎయిర్‌బస్ A320/A321 తరహా పెద్ద విమానాలు రాకపోకలు సాగించేలా



మౌలిక వసతుల కల్పనపై చర్చ జరిగింది. పెద్ద విమానాలకు అనుగుణంగా సుమారు 2,500 నుంచి 2,700 మీటర్ల రన్‌వే అవసరమయ్యే అవకాశాలను బృందం పరిశీలిస్తోంది. రన్‌వేకు అవసరమైన భూమి, భవిష్యత్ విస్తరణ, నైట్ ల్యాండింగ్ సదుపాయాలు, భద్రతా పరికరాల ఏర్పాటు వంటి అంశాలపైనా అధ్యయనం జరుగుతోంది.

***రైల్వే లైన్.. మరో సవాల్***

ప్రతిపాదిత ప్రాంతాలకు సమీపంలోని విద్యుదీకరించిన బొగ్గు రవాణా రైల్వే లైన్ కూడా ఏఏఐ పరిశీలనలో కీలక అంశంగా మారింది. రైల్వే మార్గం విమానాల అప్రోచ్ ఫన్నెల్ పరిధిలోకి వచ్చే అవకాశాలపై సాంకేతిక బృందం అధ్యయనం చేస్తోంది.అవసరమైతే 'షీల్డింగ్' వంటి సాంకేతిక పరిష్కారాల ద్వారా అవరోధాన్ని అధిగమించే అవకాశాలను పరిశీలించడంతో పాటు, రైల్వే శాఖ నుంచి అవసరమైన ఎన్‌ఓసీ పొందే అంశంపైనా చర్యలు చేపట్టనున్నారు.

***రికార్డుల పరిశీలన***

సర్వే నంబర్లు, భూమి విస్తీర్ణం, రెవెన్యూ మ్యాపులు, భౌగోళిక కోఆర్డినేట్లు, స్థల హద్దులు, అప్రోచ్ రోడ్లు, రెవెన్యూ, సాంకేతిక



రికార్డులను అధికారులు ఏఏఐ బృందానికి అందుబాటులో ఉంచారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన వివరాలను అధికారిక రికార్డులతో సరిపోల్చుతూ సాంకేతిక అధ్యయనం చేస్తున్నారు. ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ విమానాశ్రయం ఏర్పాటైతే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు గణనీయమైన ఊతం లభిస్తుందని అన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఏఏఐ బృందం నిర్వహిస్తున్న సాంకేతిక పరిశీలనకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన రెవెన్యూ, సర్వే, సాంకేతిక సమాచారాన్ని సిద్ధంగా ఉంచి, క్షేత్రస్థాయి పరిశీలన సజావుగా జరిగేలా శాఖల మధ్య సమన్వయం చేస్తున్నామని పేర్కొన్నారు. రెండు రోజుల పరిశీలన పూర్తయిన అనంతరం ఏఏఐ సాంకేతిక ఫీజిబిలిటీ స్టడీ నిర్వహించి, విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

# రైస్ మిల్లర్లపై కక్షపూరిత దాడులెందుకు..?

## - జిల్లా రైస్ మిల్ అధ్యక్షుడు పప్పుల రాజేంద్రప్రసాద్

**- గడువు అక్టోబర్ 31వరకు ఉండగానే అరెస్టులా..!**

**- విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ దాడులు.. ఆకస్మిక తనిఖీలు.. అరెస్టులతో వ్యాపారస్తుల్లో భయాందోళన**

**- రూ.118 కోట్ల బకాయిల్లో ఇప్పటికే రూ.80 కోట్లు చెల్లించాం.. మిగతాది గడువులోగా చెల్లిస్తాం**

**- 25 శాతం పెనాల్టీ.. 12 శాతం వడ్డీ మాఫీ చేయాలి...**

కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్(విజన్ ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా రైస్‌మిల్ వ్యాపారులపై ప్రభుత్వం కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తోందని కామారెడ్డి రైస్‌మిల్ యజమానుల సంఘం అధ్యక్షుడు పప్పుల రాజేందర్ ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విజిలెన్స్ దాడులు, ఆకస్మిక తనిఖీలు, అరెస్టులతో మిల్లర్లను భయాందోళనలకు గురిచేయడం సరికాదని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం విధించిన గడువు ముగిసే వరకు మిల్లర్లకు అవకాశం ఇవ్వాలని ఆయనడిమాండ్ చేశారు.కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ వరలక్ష్మి గార్డెన్ లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైస్‌మిల్ యజమానుల సంఘం నాయకులు ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.2022-23 యాసంగి టెండర్ ధాన్యానికి సంబంధించి జిల్లాలో రైస్‌మిల్ యజమానులు ప్రభుత్వానికి రూ.118 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటికే రూ.80 కోట్లు చెల్లించారని అధ్యక్షుడు పప్పుల రాజేందర్ ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం విధించిన గడువు అక్టోబర్ 31వరకు ఉందని, ఆలోగా మిగిలిన మొత్తాన్ని చెల్లించేందుకు మిల్లర్లు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. గడువు ముగిసిన తర్వాత కూడా చెల్లింపులు జరగకపోతే ప్రభుత్వం తీసుకునే చర్యలకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

***- డబ్బులు రికవరీ చేసుకోండి.. అరెస్టులు ఎందుకు?'***

ప్రభుత్వానికి రావాల్సిన డబ్బులను రికవరీ చేసుకోవాల్సిన



ప్రభుత్వం, మిల్లర్లను అరెస్టు చేసి జైలుకు పంపడం ఎంతవరకు సమంజసమని రాజేందర్ ప్రశ్నించారు. జిల్లాలో ఇప్పటికే నలుగురు వ్యాపారులను అరెస్టు చేసి జైలుకు పంపారని, ఈ విధానం సరైంది కాదన్నారు. వ్యాపారులను స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునేలా ప్రభుత్వం సహకరించాలని కోరారు. 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన సుమారు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రస్తుతం రైస్‌మిల్లుల్లో నిల్వ ఉందన్నారు. ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి 100 శాతం బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించిన తర్వాతే తదుపరి సీజన్ ధాన్యాన్ని మిల్లులకు కేటాయించాలని, అప్పటివరకు ప్రభుత్వం తన వద్దే ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలని సూచించారు.

***- పెనాల్టీ, వడ్డీ మాఫీ చేయాలి***

డిఫాల్ట్ రైస్‌మిల్లర్లపై ప్రభుత్వం విధించిన 25 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీని మినహాయించాలని పప్పుల రాజేందర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. క్వింటాల్ ధాన్యానికి 67 కిలోల రా రైస్‌ను ప్రభుత్వానికి సరఫరా చేయడం సాధ్యం కాదని, ఈ అంశంపై ప్రభుత్వం నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసి వాస్తవాలను పరిశీలించాలని కోరారు. కమిటీ నివేదిక ఆధారంగా నూతన పాలసీని తీసుకురావాలని సూచించారు. ప్రస్తుత విధానం కొనసాగితే రాష్ట్రంలోని అనేక రైస్‌మిల్లులు మూతపడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని రైస్‌మిల్ యజమానులతో సమావేశం నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.

***- 'పోలీసులను పంపకండి.. మా గౌరవాన్ని కాపాడండి'***

డివిజన్ అధ్యక్షుడు భూమేష్ గుప్తా కామారెడ్డి డివిజన్ రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు భూమేష్ గుప్తా మాట్లాడుతూ.. రైస్‌మిల్ వ్యాపారంలో ఉన్న 98 శాతం మంది ప్రభుత్వాన్ని మోసం చేయాలనే ఉద్దేశంతో లేరని స్పష్టం చేశారు. గౌరవప్రదంగా సమాజంలో తలెత్తుకొని జీవించాలనే ఉద్దేశంతో వ్యాపారం చేస్తూ రైతులకు, ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నామని అన్నారు. "పోలీసులను పంపకండి.. మా కుటుంబాలకు ఉన్న గౌరవాన్ని తీయకండి. ప్రభుత్వ అధికారులు ఎవరైనా ఫోన్ చేస్తే వారి కార్యాలయానికి వచ్చి మాట్లాడేందుకు మేమంతా సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా బకాయిలు చెల్లిస్తాం. అప్పటివరకు వేధింపులు, ఆకస్మిక తనిఖీలు, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ దాడులు నిలిపివేయాలి" అని ఆయన కోరారు.

***- మిల్లర్ల బకాయిలు వడ్డీతో సహా చెల్లించాలి***

జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గౌరీ శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మిల్లర్లకు చెల్లించాల్సిన బకాయిలను కూడా వడ్డీ, పెనాల్టీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. కరోనా వంటి క్లిష్ట సమయంలోనూ రైస్‌మిల్లులను నడిపి ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రభుత్వానికి మిల్లర్లు సహకరించారని గుర్తు చేశారు. దోమకొండ డివిజన్ రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. బియ్యం గింజపై తెల్లటి మచ్చ వచ్చిన కారణంగా ఎఫ్‌సీఐ అధికారులు బియ్యాన్ని తీసుకోవడం లేదని, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని విలేకరుల సమావేశంలో చూపించారు. మిల్లుల్లో స్థలం లేకపోయినా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులు ఆదేశించడంతో ఖాళీ ప్రదేశాల్లోనూ ధాన్యాన్ని దించుకొని ప్రభుత్వానికి సహకరించామని తెలిపారు. - ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షుడితో పాటు పలువురు రైస్‌మిల్ యజమానులు మాట్లాడారు. సమావేశానికి కామారెడ్డి జిల్లా నలుమూలల నుంచి రైస్‌మిల్ యజమానులు హాజరయ్యారు.

# పి ఏ సి ఎస్ లపై 'నామినేటెడ్' పెత్తనం వద్దు!

**- ఎన్నికలు నిర్వహించాల్సిందే.. ప్రభుత్వానికి పి ఏ సి ఎస్ చైర్మన్ల సవాల్**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కి వినతి**



గద్వాల సెప్టెంబర్ 07 ( విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాలను నామినేటెడ్ పద్ధతిలో నియమించకుండా, చట్టబద్ధంగా ఎన్నికలు నిర్వహించి రైతుల ద్వారా పాలకవర్గాలను ఎన్నుకోవాలని ఉమ్మడి పాలమూరు జిల్లా పి ఏ సి ఎస్ చైర్మన్ల ఫోరం అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని పి ఏ సి ఎస్ చైర్మన్లు, సొసైటీ సభ్యులైన రైతులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘాలపై ప్రభుత్వ జోక్యం పరిమితంగా ఉండాలనే ఉద్దేశంతో వైద్యనాథన్ కమిషన్ పలు సంస్కరణలను సూచించిందన్నారు. అయినప్పటికీ ఎన్నికలకు బదులుగా నామినేటెడ్ పాలకవర్గాలను ఏర్పాటు చేయడం సహకార స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రైతుల సొసైటీలకు ఎన్నికలు ఎందుకు నిర్వహించరు? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సొసైటీల నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలను ఆయా సంఘాలే భరిస్తున్నప్పుడు ప్రభుత్వ జోక్యంతో నామినేటెడ్ పాలకవర్గాలను నియమించడం సరికాదన్నారు. గతంలో రాష్ట్రంలోని 908 సహకార సంఘాల పాలకవర్గాలను తొలగించి పర్సన్ ఇన్‌చార్జిలను నియమించగా, దీనిపై సొసైటీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయని తెలిపారు. కోర్టు తీర్పు అనంతరం పాలకవర్గాలను తిరిగి నియమించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం మళ్లీ నామినేటెడ్ విధానంలో పాలకవర్గాల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెనక్కి తగ్గి పి ఏ సి ఎస్ లకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉన్నతాధికారులను జిల్లా కలెక్టర్ ద్వారా కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి వడ్డేపల్లి, పి ఏ సి ఎస్ చైర్మన్లు, సొసైటీ సభ్యులైన రైతులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిల కోసం బీజేపీ లడాయి

**- అసెంబ్లీ ముట్టడికై విశ్వ ప్రయత్నం**

**మహబూబాబాద్ మండల అధ్యక్షులు జహీందర్ నాయక్**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): మహబూబాబాద్ మండల పరిధిలోని బిజెపి నాయకులు విద్యార్థుల ఫీజు బకాయి విషయంలో అసెంబ్లీ ముట్టడానికి వెళుతున్న తరుణంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు జయేందర్ మిగిలిన నాయకులను అరెస్టు చేశారు . విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా, పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ తలపెట్టిన "ఫీజు బకాయిల బీజేపీ లడాయి" కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల పిలుపు మేరకు బయలుదేరుతున్న క్రమంలోనే పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం జరిగింది. జహీందర్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం, వారి భవిష్యత్తు కోసం బీజేపీ చేస్తున్న పోరాటాన్ని అరెస్టులతో అడ్డుకోలేరు. అరెస్టులు మమ్ముల ఆపలేవని అన్నారు విద్యార్థుల హక్కుల కోసం మా పోరాటం ఆగదు అని అన్నారు ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు మైదం విజయ్ కుమార్ కిషోర్ నాయక్ హుస్సేన్ నాయక్ గోవర్ధన్ నవీన్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు

# సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**- ప్రజల్లో పోషకాహారంపై విస్తృత అవగాహన కల్పించాలి**

**- నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపొచ్చు**

**- డీఎంహెచ్ఓ డా. తుకారామ్ రాథోడ్**

కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర) : పోషకాహార వారోత్సవం సందర్భంగా ప్రజలకు సమతుల, పోషకాహారం ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. తుకారామ్ రాథోడ్ వైద్య సిబ్బందికి సూచించారు. ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం రామవరం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడి సేవల వివరాలను తెలుసుకున్నారు. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పాలు తదితర పోషక పదార్థాలను తగిన మోతాదులో తీసుకోవాలని ప్రజలకు వివరించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు, వృద్ధుల పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.

***నేత్రదానంతో ఇద్దరికి చూపు***

నేత్రదాన అవగాహన పక్షోత్సవం సందర్భంగా నిర్వహించిన రేడియో



టాక్‌లో డీఎంహెచ్ఓ పాల్గొని ప్రజలకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా కార్నియా సమస్యలతో చూపును కోల్పోయిన ఇద్దరు వ్యక్తులకు చూపు ప్రసాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. నేత్రదానం గొప్ప సామాజిక సేవగా పేర్కొన్న ఆయన.. మరణించిన తర్వాత కూడా తమ కళ్ల ద్వారా మరొకరి జీవితంలో వెలుగు నింపవచ్చన్నారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి వాస్తవాలను వివరించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కుటుంబ సభ్యులు ముందుగానే నేత్రదానంపై అవగాహన, సమ్మతి కలిగి ఉండటం ముఖ్యమన్నారు. "మరణానంతరం మన కళ్లను దానం చేయడం ద్వారా మరొకరి జీవితంలో వెలుగును నింపవచ్చు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలి" అని డీఎంహెచ్ఓ పిలుపునిచ్చారు.కార్యక్రమాల్లో వైద్య అధికారులు, వైద్య సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాత మధును వెంటనే సస్పెండ్ చేయాలి

**- కాంగ్రెస్ పార్టీ నాయకులు చిగుర్లపల్లి బందయ్య**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7 ( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు దళిత ముద్దుబిడ్డ గడ్డం ప్రసాద్ కుమార్ పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన అత్యంత హేయమైన, నీచమైన, కించపరిచే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ నాయకులు చిగుర్లపల్లి బందయ్య తీవ్రంగా ఖండించారు. ఇది ఒక వ్యక్తిపై చేసిన దాడి కాదు రాజ్యాంగంపై దాడి, ఇది 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంపై దాడి అని ఆయన మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన, అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్ పై కించపరిచేలా మాట్లాడటం,సభా ప్రాంగణంలోనే ఇంత నీచానికి దిగజారడం చరిత్రలో చీకటి రోజు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశ చరిత్రలో ఏ చట్టసభలోనూ ఇలాంటి దుర్మార్గం జరగలేదని గుర్తు చేశారు. అధికారం పోయిందనే అక్కసుతో, ఓర్వలేక ఇలాంటి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది వారి సంస్కారానికి నిదర్శనం అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ తాత మధు వెంటనే బేషరతుగా ప్రజలకు, స్పీకర్ కు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అతన్ని తక్షణమే శాసనమండలి నుండి బర్తరఫ్ చేసి అనర్హుడిగా ప్రకటించాలి అని ఆయన కోరారు. ఈ ఘటనపై తాత మధు సభకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే ఎమ్మెల్సీ తాత మధును తెలంగాణలో తిరగబోనియమని హెచ్చరించారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**- పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు చేపట్టాలి**

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

**- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామపంచాయితీఅంగన్వాడీ కేంద్రాలు,మహిళా సంఘాల భవనాల నిర్మాణ పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7 ( విజన్ ఆంధ్ర ) : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామపంచాయతీ, అంగన్వాడీ కేంద్రాలు , మహిళా సంఘాల భవనాల నిర్మాణ పనుల పురోగతిపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, డీఆర్డీఏ, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలాల వారీగా అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ, అంగన్వాడీ కేంద్రాలు మహిళా సంఘాల భవనాల నిర్మాణ, తదితర అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. పూర్తయిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల రికార్డు ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేసి, సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఇంకా అభివృద్ధి పనులు అవసరమైన గ్రామాలను గుర్తించి, ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల ను ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ డీఈలు రాజగోపాల్ రావు, శ్రీనివాస్ రావు, శిరీష, యుగంధర్, రామ్ దేవ్ అగర్వాల్, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


## ఆదివాసీ సాహిత్యవేత్త డాక్టర్ మనోహర్‌కు ఘన సన్మానం...



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7: (విజన్ ఆంధ్ర) ఆదివాసీ సాహిత్యవేత్త, రచయిత, రిటైర్డ్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్, ఆదివాసీ పర్ధాన్ సేవా సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మనోహర్ ఆదివాసీ పర్ధాన్ సేవా సమాజం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివాసీ పర్ధాన్‌ల జీవన విధానం, సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడంలో డాక్టర్ మనోహర్ చేసిన కృషి అభినందనీయమని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ముఖ్యంగా తెలుగు అకాడమీ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం తెలుగు పాఠ్యపుస్తకంలో "ఆదివాసీ పర్ధాన్‌ల జీవిత విశేషాలు" అనే పాఠ్యాంశాన్ని డాక్టర్ మనోహర్ రచించడం, అది పాఠ్యపుస్తకంలో చోటు చేసుకోవడం ఆదివాసీ పర్ధాన్ సమాజానికి గర్వకారణమని తెలిపారు. ఈ పాఠ్యాంశం ద్వారా ఆదివాసీ పర్ధాన్‌ల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు మరియు సామాజిక నేపథ్యం రాష్ట్రంలోని విద్యార్థులకు, ముఖ్యంగా 33 జిల్లాల ప్రజలకు పరిచయం కావడానికి అవకాశం కలిగిందని వక్తలు పేర్కొన్నారు. ఆదివాసీ పర్ధాన్‌ల సంక్షేమం, అభివృద్ధి కోసం డాక్టర్ మనోహర్ చేస్తున్న సేవలను వారు కొనియాడారు. ఈ సందర్భంగా ఆదివాసీ పర్ధాన్ సేవా సమాజం నాయకులు, సంఘ ప్రతినిధులు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మనోహర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ పర్ధాన్ సేవా సమాజ్ జిల్లా అధ్యక్షులు కుర్సెంగా ప్రేమాకుమార్, ప్రధాన కార్యదర్శి పెంటయ్య పుర్కా ఉద్ధవ్, మాడవి దౌలత్, గేడం జనార్ధన్, సుధాకర్ ఏఎంసీ డైరెక్టర్ రాంచందర్, తిరుపతి, కుర్సేగా శంకర్, కౌన్సిలర్ బాలకృష్ణ కొర్వేత మనోహర్, ఐవీసూ డాక్టర్ నాగేంద్ర , కృష్ణ మూర్తి , వీ . గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు పారదర్శక, వేగవంతమైన సేవలు

**- 17 ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి తక్షణ చర్యలు ఎస్పీ టి. శ్రీనివాస రావు**



గద్వాల సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి మరొక సమర్థ వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన మొత్తం 17 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు (ఐపీఎస్) స్వయంగా స్వీకరించి బాధితులతో నేరుగా మాట్లాడారు. ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో తక్షణం సంప్రదించి చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధితులకు ఆలస్యం లేకుండా న్యాయం జరిగేలా పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ప్రజల నమ్మకం పోలీస్ శాఖకు అత్యంత ముఖ్యమైనద అన్నారు.ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 02 గంటల వరకు, మంగళవారం నుంచి శనివారం వరకు అన్ని పని దినాలలో మధ్యాహ్నం 03 గంటల నుండి సాయంత్రం 05 గంటల వరకు నిర్వహించే ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేయవచ్చు. ఎక్కడైనా న్యాయం జరగలేదని భావిస్తే జిల్లా స్థాయిలో మమ్మల్ని సంప్రదించాలి అని పేర్కొన్నారు. భూ వివాదాలు, ఆస్తి సమస్యలు, కుటుంబ కలహాలు వంటి అంశాల్లో చట్టపరమైన పరిష్కారమే తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారమయ్యాయో నిరంతరం సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. సోమవారం అందిన ఫిర్యాదుల వివరాలు: భర్తల హరాస్మెంట్ కు సంబంధించి 01, గొడవలకు సంబంధించి 02, భూ వివాదాలు సంబంధించి 02, కుటుంబ వివాదాలు సంబంధించి 02, స్థలం ఆక్రమణకు సంబంధించి -01, ఇంటి నిర్మాణం చేయకుండా అడ్డుపడుతున్నారని -01, సీడు పత్తి విత్తనాల డబ్బులు ఇవ్వడంలేదని -03, ఇతర సమస్యలు 05, మొత్తం: 17 ఫిర్యాదులు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలిపారు.

## బస్సుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు.

**- సమయానికి బస్సులు రాక తీవ్ర ఇబ్బందులు**




ఊట్కూర్, సెప్టెంబర్ 7 ( విజన్ ఆంధ్ర) : సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే బస్సు సౌకర్యాన్ని మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ సోమవారం నారాయణపేట జిల్లాఊట్కూర్ మండల పరిధిలోని చిన్నపోర్ల స్టేజ్ వద్ద విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు. విద్యార్థులు రోడ్డుపై బైఠాయించడంతో గంట పటు వాహనాల రాకపోకలు స్తంభించాయి.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో బస్సులు సక్రమంగా నడవకపోవడంతో ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని, సమయానికి విద్యాసంస్థలకు చేరుకోలేకపోతున్నామని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు బస్సులు నడపాలని కోరారు. విషయం తెలుసుకున్న ఎస్సై రమేష్ అక్కడికి చేరుకొని ఆర్టీసీ అధికారులు విద్యార్థులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు రాస్తారోకో విరమించారు. అనంతరం రాకపోకలు పునరుద్ధరించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

# నాడు ఫ్రెండ్లీ పోలీసు... నేడు రేవంత్ పోలీసు

**- హామీల అమలు కోరితే కేసులు పెడతారా?**

**- మండిపడిన మాజీ ఎమ్మెల్యే శ్రీ ఎస్. రాజేందర్‌రెడ్డి**



నారాయణపేట, సెప్టెంబర్ 7 ( విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్రంలో 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత కాంగ్రె స్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేసే విధంగా ప్రభు త్వం చర్యలు తీసుకోవా లని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్. రాజేందర్‌రెడ్డి డిమాం డ్ చేశారు. ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మరో మారు గుర్తు చేస్తూ సోమ వారం గౌరవ జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రియాంక కు విన తిపత్రం సమర్పించారు. అంతకు ముందు యాద్గీర్ రోడ్డులోని మాజీ ఎమ్మెల్యే నివాసం నుంచి కలెక్టరేట్ వరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి భారీ ఎత్తు న ర్యాలీ నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో ఉత్సాహంగా సాగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్. రాజేంద ర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ని కల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారం టీలు, 420 హామీలను నమ్మి ప్రజలు అధికారాన్ని అప్పగించారని అన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాల యాపన చేస్తున్నారని విమ ర్శించారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభు త్వంపై ఉందని ఆయన అన్నారు. రైతులు, మహిళ లు, యువత, నిరుద్యోగు లు, ఉద్యోగులు, పేదలు, వృద్ధులు, వికలాంగులు, రైతు కూలీలు వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాల ని డిమాండ్ చేశారు. ఎన్నిక ల హామీలను అమలు చేయాలని ప్రజల తరఫున ప్రభుత్వాన్ని మరోమారు ప్రశ్నిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్‌కు హటావో తెలంగా ణకు బచావో అని యావ త్తు తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగు ణంగా ప్రభుత్వం పనిచే యాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరిం చారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలుపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లో సమాచార బోర్డు పై అధికా ర్ల పేర్లు కాగితాలపై రాసి ఉండడం, కలెక్టర్ పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు మొలసి ఉండడం, మంచి నీటి సదుపాయం లేని విష యాలపై అసహనం వ్యక్తం చేస్తూ జిల్లా కార్యాలయా లు అంటే ఇలాగానే ఉండేది అని విస్మయం వ్యక్తం చేశారు. ర్యాలీ మద్యలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బిఆర్ ఎస్ శ్రేణులు ప్రయత్నించ గా పోలీసులు అడ్డుకున్నా రు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతిని ధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

*నాడు ఫ్రెండ్లీ పోలీసు... నేడు రేవంత్ పోలీసు...*

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసు వ్యవస్థను " ఫ్రెండ్లీ పోలీసు" గా ప్రజలకు చేరు వ చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అది "రేవంత్ పోలీసు"గామారిపోయిందని బీఆర్ఎస్ జిల్లా అధ్య క్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి విమ ర్శించారు. ప్రభుత్వం ప్రజల కు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరడం కూడా రేవంత్ రెడ్డి ప్రభు త్వంలో తప్పుగా మారిపో యిందని ఆయన అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే, హామీల అమలు కోసం డిమాండ్ చేస్తే వెంటనే పోలీసులు జోక్యం చేసుకు ని కేసులు నమోదు చేయ డం ఏమిటని ప్రశ్నించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలనే గుర్తు చేస్తూ తమ పార్టీ ఎమ్మెల్యేలు టీషర్టులపై రాసుకుని అసెంబ్లీకి రావ డంలో తప్పేముందని ఎస్.రాజేందర్‌రెడ్డి ప్రశ్నిం చారు. ఎన్నికల సమయం లో ప్రజలకు ఇచ్చిన హామీ లను గుర్తు చేయడాన్ని కూడా ప్రభుత్వం అడ్డుకోవ డం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. టీషర్టులపై హామీలను రాసుకుని అసెంబ్లీకి వచ్చిన తమ పార్టీ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారని, అయితే అదే హామీలు తెలంగాణ ప్రజల గుండెల్లో, వారి మనసుల్లో ఉన్నాయ ని పేర్కొన్నారు. పోలీసుల ను ఉపయోగించి టీషర్టుల తో వచ్చిన తమ పార్టీ ఎమ్మెల్యేలను అడ్డుకోవ చ్చు కానీ ప్రజల మనసుల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ అమల కు నోచుకొని హామీలను ఎలాఅడ్డుకుంటారు...వాటిని ఎలా చెడగొడతారు అని ఎస్.రాజేందర్‌రెడ్డి ప్రశ్నిం చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తున్న ప్రతిపక్షాలపై కేసులు పెట్ట డం, పోలీసులతో అడ్డుకో వడం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వా న్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల హక్కు అని, ప్రజలకు ఇచ్చి న హామీల అమలుపై ప్రశ్నిం చే గొంతులను అణచివే యడం ద్వారా ప్రజా సమ స్యలు పరిష్కారం కావని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేయడం మా బాధ్యత అని హామీలు అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని పోలీసు కేసులతో ప్రజల ప్రశ్నించే గొంతును అణచివేయలేరు అని ఆయన స్పష్టం చేశారు.

# రైతు కుటుంబానికి స్థిరమై న ఆదాయం కల్పించేలా ప్రణాళికలురూపొందించాలి

**- నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక.**



నారాయణపేట, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతు కుటుంబానికి ప్రత్య క్షంగా ప్రయోజనం చేకూరే లా, స్థిరమైన ఆదాయ వన రులను కల్పించే విధంగా సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారు లను ఆదేశించారు. సోమ వారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో కరువు నివా రణ పై జిల్లా కలెక్టర్ ప్రియాంక అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో డ్రాట్ మిటిగేషన్ కార్యక్ర మంలో భాగంగా నారాయ ణపేట జిల్లా లోని ఉట్కూర్ మండలాన్ని ఎంపిక చేయ గా దానిని అమలు చేసే బాధ్యతను వాసన్ సంస్థ చేపట్టగా సోమవారం కలె క్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వాసన్ సంస్థ ప్రతినిధులు డీ పీ ఆర్ ను పవర్ పాయింట్ ప్రజంటే షన్ ద్వారా జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ గ్రామీణ కుటుంబాల అవసరాలు, స్థానిక వనరులు, రైతుల సామర్థ్యాలను పరిగణన లోకి తీసుకుని ఒకే సమగ్ర ప్రణాళిక కింద వివిధ కార్య క్రమాలను అనుసంధానం చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధు లను చిన్నచిన్న కార్యక్రమా లుగా విభజించడం కంటే, ఎక్కువ మంది రైతు కుటుంబాలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే ఒక ప్రధాన ప్రణాళికను రూపొం దించి అమలు చేయాలని తెలిపారు.వ్యవసాయంతో పాటు పశుసంవర్ధక, పౌల్ట్రీ, డెయిరీ, గొర్రెలు, మేకల పెంపకం తదితర లైవ్‌స్టాక్ రంగాలను ప్రణాళికలో భాగం చేయాలని సూచిం చారు. ముఖ్యంగా పౌల్ట్రీ, లైవ్‌స్టాక్ రంగాల్లో ఉన్న అవకాశాలను గుర్తించి, రైతులకు అవసరమైన ఇన్‌పుట్స్, సాంకేతిక సహా యం, శిక్షణ, వెటర్నరీ సేవలు, మార్కెట్ లింకేజీ అందేలా సమగ్ర వ్యవస్థను రూపొందించాలని ఆదేశిం చారు.ఒక్కో చోట ఒక యూనిట్ ఏర్పాటు చేసి వదిలేయకుండా, ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు పూర్తి విలువ గొలుసు అభి వృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. ఉత్పత్తికి అవసరమైన ముడి సరు కులు, ఇన్‌పుట్స్, ఉత్పత్తి, సేకరణ, ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్ వంటి అన్ని అంశాలను సమన్వయం చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీని కేవలం సహ జ వనరుల నిర్వహణ కార్యక్రమాలకు మాత్రమే పరిమితం చేయకుండా, ప్రతి కుటుంబం యొక్క ఆదాయం, ఆహార భద్రత, వ్యవసాయం, పశుసంపద, ఎంటర్‌ప్రైజెస్, ఉపాధి అవ కాశాలను అనుసంధానం చేసే వేదికగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచిం చారు.ప్రతి కుటుంబానికి వారి అవసరాలు, సామ ర్థ్యాలకు అనుగుణంగా తగిన ఎంటర్‌ప్రైజ్‌ను గుర్తించి, ఆర్థిక సంస్థలు, సంబంధిత శాఖలు, మార్కె ట్ సంస్థల సహకారంతో అమలు చేసే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశిం చారు.ఇప్పటికే ఉన్న ఎఫ్ పీ వో లను బలోపేతం చేయాలని, ప్రతి ప్రాంతంలో కొత్త రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయడం కంటే, ఇప్పటికే సమర్థవంతంగా పనిచే స్తున్న ఎఫ్ పీ వో లను గుర్తించి వాటిని మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు. అవసరం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే కొత్త ఎఫ్ పీ వో లను ఏర్పాటు చేసి, వాటికి ప్రాసెసింగ్, నిల్వ, మార్కె టింగ్, వర్కింగ్ క్యాపిటల్, సాంకేతిక సహాయం వంటి అంశాల్లో అవసరమైన సహకారం అందించాలని తెలిపారు.ప్రతి ప్రణాళిక ఆర్థికంగా సాధ్యమైనది, దీర్ఘకాలికంగా నిలకడైనది, కుటుంబానికి ఆదాయం సమకూర్చే విధంగా ఉండా లని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రణాళిక రూపొందించే సమయంలో పెట్టుబడి, ఆదాయ అవకాశాలు, మార్కెట్, నిర్వహణ వ్యయం, కుటుంబానికి కలిగే ప్రయోజనం వంటి అంశాలను సమగ్రంగా అంచనా వేయాలని అధికా రులను ఆదేశించారు. "ఒక గ్రామంఒక సమగ్ర ప్రణాళికప్రతి కుటుంబా నికి ప్రయోజనంస్థిరమైన ఆదాయం" అనే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి, వాటిని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. ప్రతి ప్రణాళిక ఆర్థికంగా సాధ్యమైనది,దీర్ఘకాలికంగా నిలకడైనది, కుటుంబాలకు స్థిరమైన ఆదాయం అందిం చే విధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి/ కార్యక్రమ నోడల్ అధికారి సక్రియా నాయక్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, జిల్లా మత్స్య శాఖ అధికారి రెహమాన్, వాసన్ సంస్థ ప్రతినిధులు అనిల్ ఉప్పల పాటి, బక్కా రెడ్డి, లక్ష్మణ్, మండల వ్యవ సాయ శాఖ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07,(విజన్ ఆంధ్ర ) : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి .చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి మండలం యాపల్ ప్రాంతానికి చెందిన గాజుల ఈశ్వరి తన భర్త చనిపోయారని, దినసరి కూలీగా పనిచేస్తూ తన పిల్లలను పోషించుకుంటున్నానని నిరుపేద అయిన తనకు రెండు పడక గదుల ఇల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణం తెలంగాణ నగర్ కు చెందిన బి.కస్తూరి తన ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభానికి ఏర్పాటుచేసిన సపోర్టు వైరు ప్రమాదకరంగా ఉందని, తొలగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన గడ్డం ముకుందర్ రెడ్డి తనకు గల వ్యవసాయ భూమిని ఎల్లంపల్లి ప్రాజెక్టులో రికార్డు నుండి తొలగించారని, రైతుబంధు, రుణమాఫీ రాకపోవడంతో నష్టపోతున్నానని, రికార్డులు సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కల్లు సునీత తాను నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన బిల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం తలమల గ్రామానికి చెందిన పూసం రత్తుబాయి తాను జి.ఎన్.ఎం. పూర్తి చేశానని, చందారం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. తల సేమియా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ తమ దరఖాస్తులో ప్రతినెల 1 వేయి యూనిట్ల రక్తం సేకరించే విధంగా జిల్లా స్థాయి సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి వార్షిక రక్తదాన క్యాలెండర్ రూపొందించడంతో పాటు ఆరోగ్యశ్రీ పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. మందమర్రి మండలం విద్యానగర్ కు చెందిన మాచర్ల చైతన్య తాను విద్యానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆయాగా విధులు నిర్వహిస్తున్నానని, ఆర్డర్ కాపీ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- అధికారులకు అదనపు కలెక్టర్ విక్టర్ ఆదేశం**



కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 7విజన్ఆంధ్ర) : కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్ ప్రజల నుంచి 58 ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరిష్కరించగల సమస్యలను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. ఇతర శాఖల సమన్వయం అవసరమైన అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని నిర్ణీత సమయంలో చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజావాణిని ఆశ్రయిస్తున్నందున, వారి దరఖాస్తులపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ విక్టర్ స్పష్టం చేశారు.ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, సీఈఓ చందర్, ట్రైనింగ్ కలెక్టర్ రవితేజ, డీఆర్వో పాండు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజులు దాటినా హామీలు ఎక్కడ?

**- ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు,**

**420 హామీలను వెంటనే అమలు చేయాలి: బీఆర్ఎస్**

కాటారం డివిజన్ ప్రతినిధి, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల బి ఆర్ ఎస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జోడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు



అభయహస్తం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, వెయ్యి రోజులు పూర్తవుతున్నా అనేక హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, కౌలు రైతులురైతు కూలీలకు ఆర్థిక సాయం, కళ్యాణలక్ష్మిలో తులం బంగారం, విద్యాభరోసా, పెన్షన్ల పెంపు, నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాల వంటి కీలక హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, రైతులు, మైనార్టీలు, యువత తదితర వర్గాలకు ఇచ్చిన డిక్లరేషన్ల అమలులోనూ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూర వెంకటేశ్వరరావు, కొండగొర్ల వెంకటస్వామి, గాలి సదువలి, నరివేద్ది శ్రీనివాస్, లక్ష్మీ చౌదరి, రమణ, జక్కు శ్రావణ్, బొడ్డు రాజబాబు, కొండపర్తి రవి, మంతెన చిరంజీవి, గాజుల విక్రమ్ కుమార్, తైనేని సతీష్, మున్వర్, బోడ తిరుపతి, చకినాల ప్రశాంత్, జమీర్, కొండగొర్ల రవీందర్, అంతర్గాం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించాలి

**- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**




హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7 ( విజన్ ఆంధ్ర ) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి, సహజ రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్టించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కోరారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ), హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని కోరుతూ గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), రసాయన రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను చెరువులు,కుంటల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. నీటి కాలుష్యం ద్వారా పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. ప్రజలు పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా నీటి వనరులను, ప్రకృతిని కాపాడేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా భక్తి భావంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సహజంగా కలిసిపోయే మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పండుగను పర్యావరణహితంగా నిర్వహించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ టీజీపీసీబీ నోడల్ అధికారి బి. జీమూత వాహన, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్థానిక ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**- పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి**

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7 ( విజన్ ఆంధ్ర ) : హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై ఫిర్యాదులను కలెక్టర్, అదనపు కలెక్టర్ ఎన్. రవి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజావాణి దరఖాస్తులపై తీసుకున్న చర్యలపై దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాస్థాయిలో 123, డివిజన్ 23, మండల ఆఫీసర్స్ స్థాయిలో 123 (మొత్తం 269)దరఖాస్తులను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ శేషాద్రి, డిఆర్‌ఓ శ్రీనివాస్, డి ఆర్ డి ఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భూమి కోసం వేధింపులు.. ఒంటరి మహిళకు ప్రాణహాని!

**- తప్పుడు కేసులతో మానసికంగా వేధిస్తున్నారంటున్న బానోత్ మంగమ్మ**



కొత్తగూడెం బ్యూరో సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర ) : ఒంటరి మహిళనైన తనకు ప్రాణహాని ఉందని చుంచుపల్లి మండలానికి చెందిన బానోత్ మంగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బృందావనం ప్రాంతంలోని తనకు సంబంధించిన విలువైన 1 ఎకరం 10 గుంటల భూమి విషయంలో కొంతకాలంగా తనను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. తన భూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు కొందరు తప్పుడు పత్రాలను సృష్టించి వాటిని అడ్డుపెట్టుకుని ప్రయత్నిస్తున్నారని మంగమ్మ పేర్కొన్నారు. భూమిపై తన హక్కులను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్న తనపై పదేపదే తప్పుడు కేసులు పెట్టి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని, ఒంటరి మహిళ అయిన తనను లక్ష్యంగా చేసుకుని ఒత్తిళ్లు, బెదిరింపులకు పాల్పడుతున్నారని, తనకు మద్దత్తుగా న్యాయం చేయాలని ఎవరైనా ముందుకు వచ్చి ఇదేంటని ప్రశ్నించే వారినీ వివిధ రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు.తన భూమికి సంబంధించిన పత్రాలను సమగ్రంగా పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించాలని, తప్పుడు పత్రాలతో భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తనకు రక్షణ కల్పించాలని బానోత్ మంగమ్మ విజ్ఞప్తి చేశారు. తనకు ప్రాణహాని ఉందన్న విషయాన్ని అధికారులు సీరియస్‌గా పరిగణించి తనకు తగిన భద్రత కల్పించాలని కోరారు.

## కేఎల్‌హెచ్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హైదరాబాద్, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): బాచుపల్లిలోని కేఎల్‌హెచ్ ప్రాంగణంలో కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించిన 'హైదరాబాద్ విభాగం, సంస్థల రంగ పూర్వ విద్యార్థుల సమ్మేళనం–2026'లో సుమారు 300 మంది పూర్వ విద్యార్థులు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలు, ఆవిష్కరణలకు పూర్వ విద్యార్థులు సహకరించాలని నిఖిల కోనేరు పిలుపునిచ్చారు. వీసీ డా.జి.పార్థసారథి వర్మ, సహ వీసీ డా.ఎన్.వెంకటరామ్, అదనపు విద్యా విభాగ అధిపతి ఆచార్య హరి కిరణ్ వేగే, పూర్వ విద్యార్థుల సంబంధాల సంచాలకురాలు డా.కావ్య, కేఎల్‌హెచ్ బాచుపల్లి ప్రధానాచార్యులు డా.ఎల్.కోటేశ్వరరావు పరిశ్రమ–విద్యా అనుసంధానం, మార్గదర్శకత్వం, పరిశోధనలు, నియామకాలు, నైపుణ్యాభివృద్ధిపై వివరించారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్ ప్రధానాచార్యులు డా.ఎ.రామకృష్ణ, ప్రపంచ వ్యాపార విద్యాలయ విభాగాధిపతి ఆచార్య ఆనంద్ బెతపూడి, పూర్వ విద్యార్థుల సంబంధాల సహాయ సంచాలకురాలు డా.కె.సోనీ, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7,(విజన్ ఆంధ్ర) : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల ఎన్ఐసి సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైనూర్ మండలం ఊషేగం గ్రామానికి చెందిన జయ కళాబాయి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ మండలం కోయవాగు గ్రామానికి చెందిన కాంపెల్లి అరుణ తనకు ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం వంకులం గ్రామానికి చెందిన జూపాక పోచం తన పేరిట గల పట్టా భూమిని ఆన్ లైన్ లో నమోదు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతలమానేపల్లి మండలం బూరేపల్లి గ్రామానికి చెందిన జాడి భగవాన్ తనకు చెందిన పట్టా భూమిని వేరొకరి పేరిట నమోదైనందున అట్టి పేరును సవరించి తన పేరిట నమోదు చేసి పట్టా పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన నగోషా యమునబాయి తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. రెబ్బెన మండలం గోలేటి టౌన్షిప్ కు చెందిన గుండేటి స్వరూప తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైనూర్ మండలం ఊషేగాం గ్రామానికి చెందిన కోవ కమలాబాయి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి

**- కలెక్టరేట్ ఎదుట ఆశాల ధర్నా**

**- టార్గెట్లు ఎత్తివేయాలని డిమాండ్**

**- ధర్నాకు దాసరి మనోహర్‌రెడ్డి, మమతారెడ్డి సంఘీభావం**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్–07(విజన్ ఆంధ్ర) : ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు నిర్వహించిన ధర్నా, రాస్తారోకోకు ఆయనతో పాటు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. తక్కువ పారితోషికంతో అనేక రకాల బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారిపై అదనపు పనిభారం, టార్గెట్లు విధించడం తగదన్నారు. వెంటనే టార్గెట్లను ఎత్తివేయాలని, ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఆశా వర్కర్లను బీఎల్‌ఓ విధుల నుంచి తప్పించాలని, నెలకు రూ.18 వేల స్థిర వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు జారీ చేసి సామాజిక భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆశా వర్కర్ల సేవలు కీలకమని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి గౌరవప్రదమైన వేతనం, మెరుగైన పని పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దాసరి మమతారెడ్డి మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల డిమాండ్లు న్యాయమైనవేనని, ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని కోరారు. మహిళా కార్మికులపై అదనపు పనిభారం మోపకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఆశా వర్కర్ల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, ప్రభుత్వం స్పందించే వరకు వారి తరపున ప్రజా ఉద్యమానికి అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా కొనసాగుతోంది,

**- 1.15 లక్షల మందికి నోటీసుల జనరేషన్, 1.13 లక్షల మందికి నోటీసుల జారీ,**

**- 32,553 మంది ఓటర్లకు హియరింగ్ పూర్తి,**

**- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్,**




నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి, (విజన్ ఆంధ్ర) సెప్టెంబర్ 07 ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగానిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డికి వివరించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుంచి అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, ఆర్‌డీఓలతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వెల్లడిస్తూ.. నాగర్ కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,15,824 మంది ఓటర్లకు నోటీసుల జనరేషన్ చేసినట్లు, వీరిలో ఇప్పటివరకు 1,13,996 మంది ఓటర్లకు నోటీసులు జారీచేసినట్లువివరించారు.నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను స్వీకరించి పరిశీలించి వెబ్ సైట్లు అప్లోడ్ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 32,553 మంది ఓటర్లకు హియరింగ్ నిర్వహించి, వారు సమర్పించినధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌ఓలు) పూర్తిస్థాయి శిక్షణ అందించినట్లు తెలిపారు. ఓటర్లకు నోటీసుల జారీ నుంచి హియరింగ్, ధ్రువపత్రాల పరిశీలన, వివరాల అప్‌లోడ్ వరకు ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహించేలా బీఎల్‌ఓలకు అవగాహన కల్పించినట్లు వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రక్రియకు సంబంధించిన అంశాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరిస్తూ, వారి సూచనలు, అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు.జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిబంధనలకు అనుగుణంగా కొనసాగేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ప్రతి దరఖాస్తు, ధ్రువపత్రాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డిమాట్లాడుతూ. ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసుల జారీ, ఓటర్ల నుంచి ధ్రువపత్రాల స్వీకరణ, పరిశీలన, అప్‌లోడ్ ప్రక్రియను అధికారులు అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షించాలని ఆదేశించారు. నోటీసుదారులు సమర్పించే 11 రకాల సరైన ధ్రువపత్రాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కంప్యూటర్ ఆపరేటర్లు నిర్వహించే ప్రక్రియను ఏఆర్‌ఓలు, ఆర్‌ఓలు క్షుణ్ణంగా పరిశీలించాలని, డేటా నమోదు లేదా ధ్రువపత్రాల అప్‌లోడ్‌లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సీఈఓ సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ ఆర్ డి ఓ అర్చన, కొల్లాపూర్ ఆర్డీవో బన్‌ఆర్డీవో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, ఎన్నికల డిటీ కల్పన తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులే భావితరాలకు దిశానిర్దేశకులు

**- విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే మహత్తర బాధ్యత ఉపాధ్యాయులదే,**

**- ఉపాధ్యాయులంటే నాకు ఎంతో గౌరవం..**

**- మా తండ్రి కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడే,**

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,**




నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర). సెప్టెంబర్ 07 : సమాజానికి మంచి పౌరులను అందించడంలో, భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతో ఉపాధ్యాయుల బాధ్యత ముగియదని, వారి వ్యక్తిత్వ వికాసానికి మార్గనిర్దేశం చేసి, జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత కూడా ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. సోమవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 70 మంది జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ...., ఉపాధ్యాయులు అంటే నాకు అత్యంత గౌరవం. మా తండ్రి కూడా ఉపాధ్యాయుడే. అందువల్ల ఉపాధ్యాయ వృత్తి విలువ, సమాజంపై ఉపాధ్యాయుల ప్రభావం నాకు వ్యక్తిగతంగా తెలుసు అని కలెక్టర్ అన్నారు.విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల ప్రభావం ఎంతో గొప్పదని కలెక్టర్ అన్నారు. తరగతి గదిలో చెప్పే ప్రతి మాట, ఇచ్చే ప్రతి సూచన విద్యార్థుల ఆలోచనా విధానాన్ని, వారి భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని తెలిపారు. అందువల్ల ప్రతి విద్యార్థిని ప్రత్యేకంగా గుర్తించి, వారి సామర్థ్యాలను వెలికితీసేలా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానం అందించడం మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, సమయపాలన, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, మానవతా దృక్పథం వంటి మంచి లక్షణాలను పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. సమాజంలో బాధ్యతాయుతంగా వ్యవహరించే పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల ప్రధాన కర్తవ్యమని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ యుగంలో ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు కూడా తమ బోధనా పద్ధతులను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, సమస్య పరిష్కార సామర్థ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అభినందనలు తెలిపారు. ఈ సన్మానం ఉపాధ్యాయులు విద్యారంగానికి అందిస్తున్న సేవలకు లభించిన గౌరవానికి ప్రతీక అని అన్నారు. అవార్డుతో బాధ్యత మరింత పెరుగుతుందని, ఇతర ఉపాధ్యాయులకు కూడా ఆదర్శంగా నిలిచి విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి జీవితాన్నే కాదు.. ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని, ఒక తరాన్ని ప్రభావితం చేయగలడు అనే భావనతో ప్రతి ఉపాధ్యాయుడు తన బాధ్యతను నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల విజయమే ఉపాధ్యాయుల సేవలకు నిజమైన గుర్తింపు అని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఏ రమేష్ కుమార్, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, నూరుద్దీన్, కురుమయ్య, రాజశేఖర్ రావు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఆర్జీలను సకాలంలో పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల సెప్టెంబర్ 07 ( విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రజావాణికి వచ్చే ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ వారం మొత్తం 34 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. జిల్లా స్థాయి ప్రజావాణిలో 98, మండల స్థాయి ప్రజావాణికి వచ్చిన 247 ఆర్జీలు పెండింగ్ లో ఉన్నాయని వీటన్నింటిని ఆయా శాఖల అధికారులు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రజావాణికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, చీఫ్ సెక్రటరీ స్థాయిలో కూడా రివ్యూ చేస్తుండడంతో అలసత్వం వహించడం సరికాదన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, ఎస్ఈ, డిఈ, ఏడిఈ, ఏఈ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలన్నారు. పలు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయంతో రైతులు ఇబ్బందులు పడుతున్న ఘటనలు ఇటీవల ఎక్కువగా చోటు చేసుకోవడంతో సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మంజుల, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి గోపాల్పూర్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ గా కోటగిరి నరేందర్



హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7 ( విజన్ ఆంధ్ర ):భారతీయ జనతా పార్టీ గోపాల్పూర్ జోనల్ ప్రెసిడెంట్ బండి హరీష్ ముదిరాజ్ మరియు ప్రధాన కార్యదర్శి పప్పుల రమేష్ ఆధ్వర్యంలో గోపాల్పూర్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ గా కోటగిరి నరేందర్ ను నియమిస్తూ నియామక ఉత్తర్వు లను వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్ జారీ చేశారు . కార్యక్రమంలో కిసాన్ మోర్చాజిల్లా జనరల్ సెక్రటరీ తక్కలపల్లి అమృత రావు, సీనియర్ నాయకులు అలుగునూరి కృష్ణంరాజు, ఎక్స్ డివిజన్ ప్రెసిడెంట్ నాతి రమేష్,జోనల్ ఉపాధ్యక్షుడు వల్లాల శ్రీధర్, చింత ప్రకాష్, ఆరే రోహిత్ రెడ్డి,బూర శ్రీనివాస్ పాల్గొన్నారు. కోటగిరి నరేందర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బిజెపి గోపాలపురం మండల అధ్యక్షులు బండి హరీష్ కు, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన యువ క్రీడాకారుడు

**- క్రీడాకారున్ని అభినందించిన జిల్లా కలెక్టర్**



నారాయణపేట, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం మందిపల్లి గ్రామానికి చెందిన యువ క్రీడాకారుడు బడుగు గౌరీశంకర్ నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన సౌత్ ఏషియన్ డ్రిఫ్ట్‌బాల్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించడం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటుతూ స్వర్ణ పతకం సాధించిన గౌరీశంకర్‌ను కలెక్టర్ అభినందించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువ క్రీడాకారుడు అంతర్జాతీయ వేదికపై ప్రతిభ కనబరచడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. గౌరీశంకర్ భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని, తద్వారా దేశానికి, రాష్ట్రానికి, నారాయణపేట జిల్లాకు మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. యువత చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకుని తమ ప్రతిభను వెలికితీసుకోవాలని ఆమె సూచించారు. క్రీడల్లో రాణించే యువతకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి వెంకటేష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## రామునిగుండ్ల గ్రామపంచాయతీ గోపగాని తండలో ఇంకుడు గుంతలకు భూమిపూజ చేసిన సర్పంచ్ గోపీ నాయక్

బీబీనగర్ :07/సెప్టెంబర్(విజన్ ఆంధ్ర) : రామునిగుండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని గోపగాని తండలో ఇంటింటికీ ఇంకుడు గుంతల నిర్మాణానికి సర్పంచ్ బానోతు గోపీ నాయక్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలతో బోర్లు, బావుల్లో నీటి మట్టాలు పెరగడంతో పాటు భవిష్యత్తులో నీటి కొరతను తగ్గించవచ్చన్నారు. "నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టుకుందాంభూగర్భ జలాలను కాపాడుకుందాం"అని సర్పంచ్ గోపీ నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రవికుమార్,ఫీల్డ్ అసిస్టెంట్ జె.రవి,పంచాయతీ సెక్రటరీ విద్య, ఉపసర్పంచ్ శ్రావణిశ్రీనివాస్, వార్డు మెంబర్లు పచ్య నాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలోకి అనుమతించకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అక్రమ అరెస్ట్ ను కండిస్తూ ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట బీఆర్ ఎస్ పార్టీ నిరసన.



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్7;(విజన్ ఆంధ్ర) : ప్రజాస్వామ్యబద్ధంగా అసెంబ్లీ లోపలికి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేను అక్రమంగా అరెస్ట్ చేసిన పోలీసుల తీరును, కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండను నిరసిస్తూ నేడు ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట బీఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఎమ్మెల్యేను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రజాస్వామ్య గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందుకే బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు, అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ సింగిల్ విండో చైర్మన్ అలీ భాయ్ , మున్సిపల్ చైర్మన్ మొగ్గే ఆకాష్ , వైస్ చైర్మన్ అహ్మద్ , దీశా నాయకులు మరసుకోల సరస్వతి కౌన్సిలర్లు సలాం , బాలకృష్ణ , రాజంపేట సర్పంచ్ పోషన్న దీశా పార్టీ అధ్యక్షుడు జబోరే రవీందర్ , అహ్మద్ బిన్ అబ్దుల్లా తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతలకు మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు



బోడుప్పల్,సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : బోడుప్పల్ వాసవి వైశ్య సంఘం అధ్యక్షుడు గండే విశ్వం గుప్తా ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,బోడుప్పల్ మాజీ నగర అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి,11వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొముక్క కళ్యాణ్ కుమార్,12వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దీపిల్ రెడ్డి లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ మేరకు వారు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం చేస్తున్న సామాజిక, సేవా కార్యక్రమాలను అభినందించారు. సమాజ అభివృద్ధికి పాటు బోడుప్పల్ ప్రాంత ప్రజల సంక్షేమానికి చేపట్టే కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. వాసవి వైశ్య సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు పొద్దుటూరి నర్సింగ్ రావు గుప్తా,సంఘం ప్రధాన కార్యదర్శి పాలాది ప్రవీణ్ కుమార్ గుప్తా,కోశాధికారి కొప్పునూరి వెంకట శ్రీనివాస్ గుప్తా,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ ఆశ్రమ పాఠశాల బాలురకు ఏకరూప దుస్తుల పంపిణీ.

**- గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ..**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7: (విజన్ ఆంధ్ర) : గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ అన్నారు. కాగజ్‌నగర్ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలురకు సందర్శించిన సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ, డీఆర్డీవో ఏపీఓ బానోత్ దత్తారాంతో కలిసి పాఠశాలలో చదువుతున్న 220 మంది గిరిజన విద్యార్థులకు ఏకరూప దుస్తుల (యూనిఫాంలు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ, కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని 46 గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి ఒక జత ఏకరూప దుస్తులను అందజేస్తున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సుమారు 9,200 మంది గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వారి విద్యాభివృద్ధి, ఆరోగ్యం, వసతి, భోజనం, దుస్తులు తదితర అన్ని అవసరాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జాదవ్ అంబాజీ విద్యార్థులకు సూచించారు. ఏకరూప దుస్తులు అందుకోవడంతో విద్యార్థుల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉప సర్పంచ్ల సంఘం ఉపాధ్యక్షురాలుగా పి వరలక్ష్మి



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7:(విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ఉప సర్పంచుల సంఘం ఉపాధ్యక్షురాలుగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలానికి చెందిన పి వరలక్ష్మిని ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉప సర్పంచ్ సంఘం జిల్లా అధ్యక్షులు బొట్ల కార్తీక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం రోజున జరిగిన సభలో నియామక పత్రాన్ని వరలక్ష్మికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపసర్పంచ్ ల ఫోరం రాష్ట్ర కమిటీ అభివృద్ధికి పాటుపడాలని సమస్యలపై ఎల్లప్పుడూ నిరంతర పోరాటం చేయాలని, ఆ నమ్మకంతో పదవిని అప్పజెప్పినట్లు ఆయన అన్నారు . అనంతరం రాష్ట్ర ఉప సర్పంచ్ సంగం ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర సంఘానికి ఉపాధ్యక్షులుగా ఎన్నిక చేసినందుకు రాష్ట్ర ఫోరమ్ కమిటీకి ధన్యవాదాలు తెలుపుకున్నారని అదేవిధంగా జిల్లాలోని, రాష్ట్రంలోని ఉప సర్పంచ్ సంఘానికి ఎల్లవేళలా తోడుంటూ, సమస్యలపై నిరంతర పోరాటం చేస్తానని ఆమె అన్నారు. ప్రస్తుతం నేను రెబ్బెన గ్రామ ఉపసర్పంచ్ గా కొనసాగుతున్నానని ఏ సమస్యనైనా సామరస్యంగా పరిష్కరించి అందరికీ తోడ్పాటుగా ఉండి , రాష్ట్ర కమిటీ అభివృద్ధికి తోడ్పడతానని ఆమె అన్నారు.

# ప్రశ్నిస్తే అరెస్టులా?.. ఇదేనా కాంగ్రెస్ ప్రజాపాలన!

**- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిర్బంధాలపై బోడుప్పల్లో భగ్గుమన్న నిరసన**
**- హామీలపై నిలదీస్తే అరెస్టులు.. ఇదేనా కాంగ్రెస్ ప్రజాపాలన?**
**- అసెంబ్లీలో సమాధానం చెప్పలేకే ప్రతిపక్ష గొంతు నొక్కుతున్నారా?**
**- ప్రజావాణిలోనూ అధికారుల తీరుపై నిరసన**
**- డిప్యూటీ కమిషనర్ చాంబర్ ముందు నిరసన....క్షమాపణలు చెప్పిన అధికారి**



బోడుప్పల్,సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అరెస్టులు, నిర్బంధాలతో అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఏం సాధించాలనుకుంటోందని బీఆర్ఎస్ బోడుప్పల్ అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ మంద సంజీవరెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులు, నిర్బంధాలకు నిరసనగా ఆయన ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. అదే ప్రజల సమస్యలను అసెంబ్లీలో వినిపించే ఎమ్మెల్యేలను ఎందుకు అడ్డుకుంటోంది? ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేదా? ప్రజలకు ఇచ్చిన హామీలను నిలదీస్తే అరెస్టు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమా? అని ప్రశ్నించారు.ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అరెస్టు చేయాల్సిన అవసరం ఎందుకొచ్చింది?అసెంబ్లీకి వెళ్లి ప్రజల గొంతు వినిపించడమే నేరమా?ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడితే కేసులు, నిర్బంధాలే సమాధానమా?ప్రజలకు ఇచ్చిన హామీలపై లెక్కలు అడిగితే ప్రభుత్వం ఎందుకు ఉలిక్కిపడుతోంది?ప్రశ్నించే గొంతును అణచివేస్తే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయా?ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే రాజకీయ ధైర్యం లేకే పోలీసు బలాన్ని ప్రయోగిస్తున్నారా?అసెంబ్లీలో చర్చకు భయపడే ప్రభుత్వం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరం కాదా? అంటూ సంజీవరెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఆరు గ్యారంటీలు,420 హామీలతో ప్రజలను ఆకట్టుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు హామీల అమలుపై ప్రశ్నలు ఎదురైతే తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. 1,000 రోజుల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పకుండా.. ప్రశ్నించే వారిని నిర్బంధించడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చాలని చూస్తున్నారా? అని నిలదీశారు.ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలను కనీసం 30 రోజులపాటు నిర్వహించాలని సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ అనేది అధికార పార్టీ ప్రచార వేదిక కాదని, ప్రజల సమస్యలపై ప్రభుత్వం జవాబుదారీగా ఉండాల్సిన వేదిక అని అన్నారు. ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా, ఎమ్మెల్యేలను బయటే నిర్బంధిస్తే ప్రజాస్వామ్యానికి అర్థమేంటని ప్రశ్నించారు.



*ప్రజావాణిలోనూ అధికారుల తీరుపై నిరసన*

కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలుపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులతో అధికారులు నిర్లక్ష్యంగా మాట్లాడటంపై నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. డిప్యూటీ కమిషనర్ చాంబర్ ముందు నిరసన చేపట్టారు. ప్రజల తరఫున ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారితో అవమానకరంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా మాట్లాడితే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలని నిలదీశారు. అనంతరం ప్రజావాణి మేనేజర్ క్షమాపణ చెప్పడంతో నిరసన విరమించారు.

***అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు***

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులపై ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రజా సమస్యలపై తమ పోరాటం ఆగదని సంజీవరెడ్డి స్పష్టం చేశారు. "ప్రశ్నించే గొంతును నొక్కొచ్చు.. కానీ ప్రజల ప్రశ్నలను నొక్కలేరు. అరెస్టులతో రాజకీయ ఉద్యమాలను ఆపలేరు. హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల తరఫున నిలదీస్తూనే ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, సీనియర్ నాయకులు కొత్త రవిగౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి, బందారపు శ్రీధర్‌గౌడ్, తాల్క శత్రజ్ఞ, బొడగల్ల సదానంద్, కృష్ణగౌడ్, యువజన నాయకులు ఉప్పరి విజయ్, మైసగల్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

**- బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**



బోడుప్పల్,సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ, ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శైలజకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిందన్నారు. కేవలం 100 రోజుల్లోనే హామీలన్నీ నెరవేరుస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు, వెయ్యి రోజులు పూర్తయినా ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేకపోయారని ధ్వజమెత్తారు. మహాలక్ష్మి పథకం: మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, స్కూటీలను తక్షణమే పంపిణీ చేయాలి. ఆడబిడ్డలకు పూర్తి రక్షణ కల్పించాలి. రైతాంగానికి భరోసా: ప్రతి పంటకు రైతు భరోసా, బోనస్ అందించాలి. కొరత లేకుండా ఎరువులు పంపిణీ చేయడంతో పాటు 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి. రైతు కూలీలకు ఏడాదికి రూ. 12,000 సాయం అందించాలి. నిరుద్యోగులు, విద్యార్థులు: అర్హులైన యువతకు జాబ్ క్యాలెండర్, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి చెల్లించాలి. విద్యార్థులకు విద్యా భరోసా పథకాన్ని వర్తింపజేసి, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. సంక్షేమ పథకాలు: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు పెంచిన పింఛన్ రూ. 4,000 తక్షణమే అమలు చేయాలి. ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12,000 అందించాలి. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు స్థలాలు ఇవ్వాలి. పారిశుద్ధ్యం, పాలన: పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా పడకేసిందని, వెంటనే చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. హామీలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలని హెచ్చరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన 420 హామీలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించేవరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్, కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, కొడే పోచయ్య, మధుసూదన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభు, శ్యామల శ్రీనివాస్, ఉప్పల్ బిల్డర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ, బుల్లెట్ శంకర్, జిలాని పాషా, కిరణ్ నాయక్, అమర్ పటేల్, చిరంజీవి, ప్రవీణ్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యాశాఖ కార్యదర్శిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసిన కలెక్టర్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07,(విజన్ ఆంధ్ర ) : జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల సింగరేణి అతిథి గృహానికి చేరుకున్న రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా ను మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), చంద్రయ్య,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం నస్పూర్ లో గల 250, 251, 252, 253 పోలింగ్ కేంద్రాలను సందర్శించి సంబంధిత బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో విజయ డైరీ పార్లర్‌ను ప్రారంభించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ జిల్లా సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర)జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విజయ డైరీ పార్లర్‌ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి మహబూబ్ నగర్ మండల సమాఖ్య ద్వారా ఈ విజయ డైరీ పార్లర్‌ను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విజయ డైరీకి సంబంధించిన వివిధ పాల ఉత్పత్తులను ఈ పార్లర్‌లో అందుబాటులో ఉంచి విక్రయించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌కు వచ్చే అధికారులు, సిబ్బంది, ప్రజలకు విజయ డైరీ ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా పార్లర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డీఆర్డీఓ నరసింహులు, జిల్లా డైరీ శాఖ డి.డి శ్రీనివాస్, మహిళా సమాఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

**- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం**



కేయూ క్యాంపస్ ( విజన్ ఆంధ్ర ) : విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేయూ జంక్షన్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే కీలక నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మంత్రివర్గ విస్తరణలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించి, విద్యారంగ సమస్యలపై సమగ్రంగా దృష్టి సారించాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు తీవ్ర నష్టం కలిగించేలా ఉన్న జీవో నెం.97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఇంటర్మీడియట్ విద్యను రద్దు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, దానిని రద్దు చేసే ఆలోచనలు చేయడం విద్యార్థుల భవిష్యత్తుకు ప్రతికూలంగా మారుతుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు సంబంధించిన ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు, సంక్షేమ హాస్టళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లకు అడ్డుకట్ట వేసేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన విద్యార్థి ఉద్యమాలను చేపడతామని భాషబోయిన సంతోష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అజయ్, శ్రీజ, సురేష్ ,రాహుల్, వినయ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# యు.జి.సి నెట్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**- : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**



మహబూబ్ నగర్ జిల్లా సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర)విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జీ-ఫీ) అర్హతల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (చీూ) సెప్టెంబర్ 9, 10 తేదీల్లో నిర్వహించే యు.జి.సి నెట్ (ఖ+జ-చీజు) పరీక్షలను మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో విద్యా, పోలీస్, విద్యుత్, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య తదితర సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో యు జి.సి నెట్ పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 9,10 తేదీలలో జిల్లా కేంద్రంలో ఎం.ఎస్. ఏస్ ఇన్ఫోటెక్ సర్వీసెస్, పాతిమా విద్యాలయ, క్రిస్టియన్‌పల్లి పరీక్షా కేంద్రంలో యు.జి.సి నెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 9, ఉదయం, సాయంత్రం రెండు షిఫ్టుల్లో సెప్టెంబర్ 10న మొదటి షిఫ్ట్‌లో ఇంగ్లీష్,కామర్స్ సోషియాలజీ సబ్జెక్ట్ లలో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని 200 నుంచి 300 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను తాత్కాలికంగా మూసివేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద బయోమెట్రిక్ వెరిఫికేషన్, సి.సి టీవీ కెమెరాల నిఘా, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యాలను సమర్థవంతంగా కల్పించాలని సూచించారు. అభ్యర్థుల రవాణా సౌకర్యార్థం పరీక్షా కేంద్రాలకు వెళ్లే మార్గాల్లో ప్రత్యేక బస్సు సర్వీసులను నడపాలని ఆర్.టి. సి అధికారులను సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స సేవలు, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారినిఆదేశించారు.దివ్యాంగ అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేకంగా గ్రౌండ్ ఫ్లోర్‌లోనే సీటింగ్ ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తూ పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎన్‌టీఏ జారీ చేసిన అడ్మిట్ కార్డుతో పాటు తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ లేదా పాస్‌పోర్ట్ వంటి ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డును తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు బయోమెట్రిక్ వెరిఫికేషన్ ప్రక్రియ కోసం నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, నిర్ణీత సమయం దాటిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరినీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. అలాగే ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు లేదా ఇతర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రంలోకి తీసుకురావద్దని సూచించారు. అభ్యర్థులు నిబంధనలను కచ్చితంగా పాటించి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్ పి. ఎన్. బి రత్నం, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ వై. సురేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, ఎన్ఐసీ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో మిషెలిన్‌కు నాలుగు కొత్త స్టోర్లు



హైదరాబాద్, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర): మిషెలిన్ ఇండియా హైదరాబాద్‌లో జూబ్లీ హిల్స్, సరూర్‌నగర్, గండిమైసమ్మ, కొంపల్లిలో నాలుగు కొత్త 'మిషెలిన్ టైర్స్, సర్వీసెస్' స్టోర్లను ప్రారంభించినట్లు మిషెలిన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శాంతనుదేశ్‌పాండే సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూబ్లీ హిల్స్, గండిమైసమ్మ స్టోర్లను మిషెలిన్ ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ బి టూ సి బెంజమిన్ కోస్నాన్, సరూర్‌నగర్, కొంపల్లి స్టోర్లను ఎస్.పి డైరెక్టర్ కునాల్ దోషి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. వీల్ ఓ సిటీ, విఘ్నేశ్వర వీల్స్, సచిన్ టైర్స్, లంబోదర టైర్స్ భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ స్టోర్లలో ప్రీమియం టైర్లు, అధునాతన ఆటోమోటివ్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 'మేడ్-ఇన్-ఇండియా ప్రైమసీ 5' టైర్ల లభ్యత కూడా పెరగనుందని చెప్పారు. హైదరాబాద్ కీలక మొబిలిటీ మార్కెట్‌గా ఎదుగుతున్న నేపథ్యంలో నాలుగు స్టోర్ల ఏర్పాటుతో ప్రీమియం ఉత్పత్తులు, ప్రపంచ స్థాయి సేవలను మరింత చేరువ చేస్తున్నామని తెలిపారు.

# ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విషాదం..

**- ఎస్సీ స్టడీ సర్కిల్ భవనంపై నుంచి దూకి మంచిర్యాల విద్యార్థి ఆత్మహత్య.**



ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్సి స్టడీ సర్కిల్లో ఆదివారం తీవ్ర విషాదం చోటు చేసుకుంది.ఎస్సీ స్టడీ సర్కిల్ లో ఫౌండేషన్ కోర్సు శిక్షణ తీసుకుంటున్న మంచిర్యాల జిల్లా కు చెందిన విద్యార్థి భవనం మూడో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు స్నేహితులతో టిఫిన్ కి వెళ్తానని చెప్పిన కాసేపటికి ఈ అఘాయిత్యానికి పాల్పడడంతో అక్కడి విద్యార్థులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థి మంచిర్యాల జిల్లాకు చెందిన స్వామిరామం గా పోలీస్ లు, స్టడీ సర్కిల్ సిబ్బంది గుర్తించారు.గత నాలుగు నెలలుగా ఆదిలాబాద్ లోనే ఉంటూ శిక్షణ తీసుకుంటున్న స్వామిరామం ఉదయం స్నేహితులతో టిఫిన్ చేద్దామని పిలవగా.. వస్తానని చెప్పి భవనం మూడో అంతస్తు నుంచి కిందకు దూకేశాడు. తీవ్ర గాయాల పాలైన అతడు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు వ్యక్తిగత కుటుంబ సమస్యల కారణంగానే ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని, ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించి, పూర్తి వివరాల కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇంకా మృతికి గల కారణాలు పూర్తిగా తెలియాల్సి ఉంది.

# అసెంబ్లీ మెయిన్ గేట్ వద్ద ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అరెస్ట్

**- నల్ల షర్ట్ ధరించి అసెంబ్లీలోకి రావడంపై పోలీసుల అభ్యంతరం**



పటాన్చెరు, సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) 07 అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ను అసెంబ్లీ మెయిన్ గేట్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. నల్ల షర్ట్ ధరించి అసెంబ్లీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్య పద్ధతిలో నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి వెళ్తున్న తనను అడ్డుకోవడంపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల పాశవికంగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు.నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి వెళ్తే తప్పేంటి? ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు కూడా లేదా? అంటూ ఎమ్మెల్యే జిఎంఆర్ పోలీసులను ప్రశ్నించారు.అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యేను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

# బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల అమానుష వైఖరి

**- నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి వెళ్లడం నేరమా? బీఆర్ఎస్ నేతల ప్రశ్న**

**- పటాన్‌చెరులో జాతీయ రహదారిపై నిరసన ధర్నా**



పటాన్‌చెరు, సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర )07 అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ పటాన్‌చెరులో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పిలుపుమేరకు నియోజకవర్గ కేంద్రంలోని జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలకు నల్ల దుస్తులు ధరించి హాజరవుతున్న తమ పార్టీ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం, పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం నేరమా? అని వారు ప్రశ్నించారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తే ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. ప్రజలు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలన్నింటినీ గమనిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గట్టి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 420 హామీలు.. 13 డిక్లరేషన్లు.. 6 గ్యారెంటీలు ఏమయ్యాయి?

**- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్.. తహసీల్దార్‌కు వినతిపత్రం**

**- ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్**



పటాన్‌చెరు, సెప్టెంబర్ (విజన్ ఆంధ్రా) 07: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన పోరుబాట కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పటాన్‌చెరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పటాన్‌చెరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీలు ఇచ్చారని విమర్శించారు. అయితే అధికారంలోకి వచ్చి దాదాపు 1000 రోజులు గడుస్తున్నా హామీల అమలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. మరోవైపు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతర పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# చిలుకూరు లక్ష్మీ నగర్ లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

**- తనిఖీలలో 163 ద్విచక్ర వాహనాలు, 31 ఆటోలు, 9 ట్రాలీ లు, 6 కార్లు,1 ట్రాకర్ స్వాధీనంలి**

**- 7 గురు సస్పెక్ట్ షీటర్ల తనిఖీ.**

**- 150 మంది పోలీసు సిబ్బందితో తెల్లవారు జామున విస్తృత తనిఖీలు చేసినలి**

**- ఆదిలాబాద్ డీఎస్పి ఎల్ జీవన్ రెడ్డి**





ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం, నేరాల నియంత్రణ, ప్రజలతో పోలీసుల అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా సోమవారం జిల్లా కేంద్రంలోని చిలుకూరి లక్ష్మీ నగర్ లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని తెల్లవారుజామున నుండి నిర్వహించినట్లు ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 5 గంటల నుంచే సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 163 ద్విచక్ర వాహనాలు, 31 ఆటోలు,9 ట్రాలీ ఆటోలు, 6 కార్లు, ఒక ట్రాక్టర్ తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్నారు. ఫేక్ నెంబర్ ప్లేట్ అమర్చిన ఒక ద్విచక్ర వాహనాన్నీ స్వాధీనం చేసుకొని, (బి ఎన్ ఎస్) సెక్షన్ 318(4) ప్రకారం చీటింగ్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, విక్రయించడం లేదా అక్రమంగా తరలించడం నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, గంజాయి సేవించడం, నిల్వ ఉంచడం, రవాణా చేయడం, సరఫరా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యత తెలియజేస్తూ కాలనీ మొత్తం కలిసికట్టుగా సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని తెలిపారు, నిబంధనలు ఉల్లంఘించిన కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐలు కె నాగరాజు,రహీం పాషా, బి ప్రణయ్ కుమార్, పద్మ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు టి. మురళి, ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు, రిజర్వ్ సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

**-పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలి**

**-కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్-07(విజన్ ఆంధ్ర) : ప్రజావాణిలో వచ్చే అర్జీలను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీరాములుతో కలిసి ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలను అప్పగించారు. కమాన్‌పూర్ మండలం నాగారం గ్రామానికి చెందిన జి.స్వప్న.. గ్రామ శివారులోని తన ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటూ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న జి.రమేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కమాన్‌పూర్ తహసీల్దార్‌కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పెద్దపల్లికి చెందిన వడ్డేపల్లి చైతన్య.. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీకాం పూర్తి చేశానని, ఉపాధి కల్పించాలని కోరారు. జిల్లా ఉపాధి అధికారికి దరఖాస్తును పంపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని పెద్దపల్లికి చెందిన షాహిదా కోరగా.. పీడీ హౌసింగ్‌కు దరఖాస్తును పంపి పరిశీలించాలని సూచించారు. సర్వే నంబరు 58లోని భూమిపై హైకోర్టులో కేసు కొనసాగుతున్నందున అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పెద్దపల్లికి చెందిన దుగ్గంపూడి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి కోరారు. దీనిపై పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్‌కు దరఖాస్తును పంపి విచారణ అనంతరం అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలి

**- రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07,(విజన్ ఆంధ్ర ) : జిల్లాలో చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి ఎ.ఈ.ఆర్.ఓ.లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్-2026 లో భాగంగా జిల్లాలో 1 లక్షా 70 వేల మ్యాపింగ్ కాని, అనమోలీస్ ఓటర్ల సంబంధిత నోటీసులు జనరేట్ చేయడం జరిగిందని, జనరేట్ చేసిన 1 లక్షా 10 వేల నోటీసులు పంపిణీ చేసి, మిగిలిన 60 వేల నోటీసులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 3 ఈ.ఆర్.ఓ. లు, 18 ఎ.ఈ.ఆర్.ఓ.లు, అదనంగా కేటాయించబడిన 18 ఎ.ఈ.ఆర్.ఓ.లు ఎస్ ఐ ఆర్ సంబంధిత క్లెయిమ్స్ & అబ్జెక్షన్ ప్రక్రియపై పని చేస్తున్నారని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని, నోటీసులు జారీ అయిన ప్రతి ఒక్కరు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించేలా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘంచే జారీ చేయబడిన 11 డాక్యుమెంట్లలో నుంచి మాత్రమే సంబంధిత ఓటర్లు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లకు నోటీసుల జారీ, సంబంధిత డాక్యుమెంట్ల సమర్పణ తదితర అంశాలపై మరొకసారి శిక్షణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నో మ్యాపింగ్, అనమోలీస్, ఎ.ఎస్.డి. జాబితాను సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్లకు అందించాలని, బూత్ స్థాయి అధికారులు నోటీసులు జారీ అయిన ఓటర్లు సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ కూడా ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లతో కలిసి ఎ ఈ ఆర్ ఓ లు, అదనపు ఎ ఈ ఆర్ ఓ లతో ఎస్ ఐ ఆర్- 2026 ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. బూత్ స్థాయి అధికారులకు, సూపర్వైజర్ లకు నియమ నిబంధనలపై శిక్షణ నిర్వహించాలని తెలిపారు. నో మ్యాపింగ్, అనమోలీస్, ఎ ఎస్ డి జాబితాను సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయాలని తెలిపారు. ఎస్ ఐ ఆర్ కు ప్రతిరోజు కొంత సమయం ప్రత్యేకంగా కేటాయించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కమ్యూనిటీ సర్టిఫికెట్ నిబంధనలను అనుసరించి త్వరితగతిన జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండప నిర్వాహకులతో సమగ్ర సమన్వయ సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ నితికా పంత్

***గణపతి నవరాత్రి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి - జిల్లా ఎస్పీ...***




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్7:(విజన్ ఆంధ్ర) : గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలు, సంప్రదాయాలు, సమైక్యతతో ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు గణేష్ మండప నిర్వాహకులతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్, గణేష్ మండప నిర్వాహకులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు,నిబంధనలకు అనుగుణంగా డీజే & సౌండ్ సిస్టమ్ వినియోగించాలి.ప్రతి గణేష్ మండపం వద్ద 24 గంటలు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.గణపతి నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో “గణపతి దీక్ష” తీసుకోవాలని సూచించారు.ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.విద్యుత్ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించి నాణ్యమైన వైర్లు,విద్యుత్ పరికరాలను మాత్రమే ఉపయోగించాలి. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలి. 10 గంటల తర్వాత మైక్, సౌండ్ సిస్టమ్,డీజెలకు వినియోగించరాదు.మండపాల వద్ద టపాసులు, జూదం, లక్కీ డ్రాలు, బలవంతపు చందాలు లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావివ్వరాదు.ఎవరూ మద్యం సేవించి మండపాల వద్దకు రాకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అగ్ని ప్రమాదాల నివారణకు నీరు, ఇసుక తదితర భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారం కనిపించినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112కు సమాచారం అందించాలి. గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు మండప నిర్వాహకులు,భక్తులు మరియు ప్రజలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు ఆసిఫాబాద్ డిఎస్పి అశోక్, కాగజ్ నగర్ డిఎస్పి వాహిదుద్దిన్,సర్కిల్ ఇన్స్పెక్టర్లు,గణేష్ మండప నిర్వాహకులు పాల్గొన్నారు.


# 9 సంవత్సరాల బాలుని శిశు సంక్షేమ ఆధ్వర్యంలో దత్తత తీసుకున్న కరీంనగర్ వాసి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) సెప్టెంబర్ 6 : సిద్దిపేటజిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో సిద్దిపేట జిల్లాలో సోమవారం రోజున 9 సంవత్సరాల బాబును తెలంగాణ రాష్టం కరీంనగర్ జిల్లాకు చెందిన సింగిల్ పేరెంట్( మహిళా ) కి సిద్దిపేట జిల్లా కలెక్టర్ శ్రీమతి హైమావతి చేతుల మీదుగా అధికారికంగా దత్తతను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈకార్య క్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్తల్లితో మాట్లాడుతూ అబ్బాయిని బాగా చదివించాలి తనకు ఇష్టమైన రంగంలో ప్రోత్సహం ఇవ్వాలి అబ్బాయి బంగారు భవిషత్ కు బాట వేసే పూర్తి బాధ్యత మీదే అని చెప్పడం జరిగింది మరియు జిల్లాలోని పిల్లలు లేని దంపతులు దత్తతతీసుకోవాలనుకుంటే సిద్దిపేటలో గల శిశు గృహ/ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని తద్వారా ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి.శారద , జిల్లా బాలల పరిరక్షణ అధికారి .రాము మరియు శిశు గృహ సామాజిక కార్యకర్త రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

## కొండపాకలో బీఆర్ఎస్ “ప్రజావాణి” పిలుపు.. భారీ స్పందన!

**- బి ఆర్ ఎస్ నిరసనలో భాగంగాలి**




సిద్దిపేటజిల్లా ప్రతినిధి సెప్టెంబరు 6 (విజన్ ఆంధ్ర) : ఒక్కో గ్రామం నుంచి సమస్యల పత్రం.. అధికారులకు వినతుల వెల్లువ!ప్రజా సమస్యలపై గళమెత్తిన బీఆర్ఎస్ శ్రేణులుకొండపాక మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రజావాణి పిలుపులో భాగంగా ప్రజాప్రతినిధులు, గ్రామ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులనులెటర్‌ప్యాడ్‌లపై పొందుపరిచి మండల ఎంపీడీవో, ఎమ్మార్వో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. గ్రామాల సమస్యలు పరిష్కరించే వరకు ప్రజల తరఫున పోరాటం”ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని, గ్రామాల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బీఆర్ఎస్ శ్రేణులు కోరారు. గ్రామంగళం.. బీఆర్ఎస్బలంప్రజా సమస్యలపై వినతుల వెల్లువ

## మట్టితో చేసిన విగ్రహాలను పూజించండి నీటిని కలుషితం చేయకండి జిల్లా కలెక్టర్ సూచన




సిద్దిపేట జిల్లా ప్రతినిధి07 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని దానికై తీసుకోవాల్సిన చర్యల గూర్చి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి జిల్లా ప్రజలకు తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పర్యావరణాన్ని పరిరక్షణ సంబంధించి పోస్టర్ ను జిల్లాకలెక్టర్ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాలుష్య నియంత్రణ మండలి వారు వినాయకులను ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసినవి పూజించడం వలన చెరువులు, కాలువలు కలుషితం అవుతున్నాయని మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని తెలిపారు. అలాగే ప్లాస్టిక్ కాలుష్యాన్నితగ్గించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. ఇలా అయితేనే మనం అందరం భావితరాలకు మంచి గాలి, నీరు, నేల అందించే వారమవుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ఎస్డీసీ సుదర్శన్ రెడ్డి, అర్ సి పురం పిసిబి టి. రవీందర్, ఏ ఓ రాజ్ కుమార్, సహాయ పర్యావరణ శాస్త్రవేత్త, కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, ఆర్ సి పురం తదితరులు పాల్గొన్నారు.




# ప్రశ్నించడమే పంతం..
# పోరాడటమే బొల్లం నైజం..

**అన్యాయం కనిపిస్తే ప్రశ్న. అక్రమం బయటపడితే నిలదీత. ప్రజలకు ఆపద వస్తే పోరాటం.**

**కోదాడలో విరామమెరగని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రజా ప్రస్థానం.**

**అధికారం ఉంటేనే అధికారులను ప్రశ్నించగలమా? పదవి ఉంటేనే ప్రజల కోసం పోరాడగలమా ఎన్నికల్లో గెలిస్తేనే ప్రజా నాయకుడిగా నిలవగలమా? కోదాడ రాజకీయాల్లో బొల్లం మల్లయ్య యాదవ్ ప్రయాణం ఈ ప్రశ్నలకు తనదైన సమాధానం చెబుతోంది. పదవి చేతిలో లేకపోయినా.. ప్రజల చెయ్యి విడవలేదు. అధికారం దూరమైనా.. ప్రజల సమస్యలకు దూరం కాలేదు. ఎన్నికలు ముగిసినా.. ఆయన ప్రజా ప్రయాణం ఆగలేదు. అన్యాయం జరిగిన చోట అడుగు.. అక్రమం జరిగిన చోట ప్రశ్న.. ప్రజలకు ఆపద వచ్చిన చోట అండ.. ఇదే బొల్లం మల్లయ్య యాదవ్ రాజకీయ పంథా. నియోజకవర్గంలో ఏ మూల సమస్య వినిపించినా అక్కడికి వెళ్లడం.. బాధితుల మాట వినడం.. అధికారులను ప్రశ్నించడం.. అవసరమైతే ప్రజలను కూడగట్టి ఉద్యమించడం.. ఇదే ఆయనకు నిత్యకృత్యంగా మారింది.**

కోదాడ, సెప్టెంబర్ 07 (విజన్ ఆంధ్ర):

**జనంలోనే జవాబు వెతుకుతూ..**

రాజకీయ నాయకుడు ప్రజల దగ్గరకు ఎన్నికల సమయంలో మాత్రమే వెళ్లాల్సిన అవసరం లేదని తన ఆచరణ ద్వారా చూపించే ప్రయత్నం చేస్తున్నారు బొల్లం. రైతు పొలంలోకి వెళ్తున్నారు. పేదవాడి ఇంటి వద్ద నిలుస్తున్నారు. విద్యార్థుల సమస్యలు వింటున్నారు. యువతతో మాట్లాడుతున్నారు. గ్రామాల్లో తిరుగుతున్నారు. ప్రజలే తన బలం.. ప్రజల సమస్యలే తన రాజకీయ ఎజెండా అన్నట్టుగా ముందుకు సాగుతున్నారు.పదవి లేకున్నా ప్రజల మధ్య ఉండొచ్చని.. అధికారం లేకున్నా ప్రజల కోసం పోరాడొచ్చని ఆయన మరోసారి నిరూపించే ప్రయత్నం చేస్తున్నారు.

**నీరు కోసం నినాదం.. రైతు కోసం పోరాటం.**

పొలంలో పంట ఎండిపోతున్నప్పుడు రైతుకు రాజకీయ ప్రసంగాలు అవసరం లేదు. నీరు కావాలి. ఈ విషయాన్ని ప్రధానంగా ముందుకు తీసుకొచ్చిన బొల్లం మల్లయ్య యాదవ్ నాగార్జునసాగర్ నుంచి కోదాడ రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించారు. ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి రైతుల ఆవేదనను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. పొలానికి నీరు రాకపోతే రైతు భవిష్యత్ ఎక్కడ? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతు సమస్యను రాజకీయ విమర్శకు పరిమితం చేయకుండా.. ఉద్యమ రూపంలో ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లడం ఈ పోరాటం ప్రత్యేకతగా నిలిచింది.

**కరెంటు కోసం కదిలిన పోరాటం.**

నీరు ఉన్నా కరెంటు లేకపోతే పంటకు నీరు అందదు. రైతుకు సాగునీరు అందాలంటే నిరంతర విద్యుత్ అవసరమనే అంశాన్ని ముందుకు తెస్తూ 24 గంటల నాణ్యమైన కరెంటు కోసం బొల్లం ఉద్యమించారు. కరెంటు సరఫరా మెరుగుపడకపోతే రైతులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తర్వాత కరెంటు కోతలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి సమస్యపై ప్రజలను, రైతులను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ప్రయత్నించారు. రైతు సమస్యపై మాట్లాడటం ఒకటి.. రైతులతో కలిసి నిలబడటం మరోటి. బొల్లం రెండో మార్గాన్ని ఎంచుకున్నారనే అభిప్రాయం ఈ కార్యక్రమాల ద్వారా కనిపించింది.

**పేద మహిళ కోసం బంద్.**

ఒక నిరుపేద మహిళ జీవనాధారానికి సంబంధించిన సమస్య కోదాడలో ఉద్యమంగా మారింది. గంధం కనకమ్మ ఘటనలో ఆమె కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులకు బొల్లం మల్లయ్య యాదవ్ అండగా నిలిచారు. ఇది ఒక్క కుటుంబానికి సంబంధించిన విషయం కాదని.. పేదల జీవన హక్కుకు సంబంధించిన ప్రశ్న అని చెబుతూ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. సాధారణంగా అధికార వ్యవస్థల ముందు పేదలు ప్రశ్నించడానికి వెనుకడుగు వేస్తారు. అలాంటి వారి పక్షాన ఎవరో ఒకరు నిలబడాలి.. ఆ గొంతు బలంగా వినిపించాలి అనే భావనతో ఆయన ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లారు.

**పోలీసులపై ప్రశ్న.. ప్రజల పక్షాన పోరాటం.**

పోలీసు వ్యవస్థపై ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని ప్రశ్నించడంలో కూడా బొల్లం వెనుకడుగు వేయలేదు. కనకమ్మ ఘటనలో పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. నిజానిజాలపై విచారణ జరగాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించడం తప్పు కాదు.. ప్రజలకు జవాబుదారీతనం ఉండాలని కోరడమే ప్రజాస్వామ్యమనే సందేశాన్ని ఈ ఉద్యమం ఇచ్చింది.

**మత్తు ముప్పుపై మోగుతున్న హెచ్చరిక.**

గంజాయి.. డ్రగ్స్.. పేకాట.. ఈ పేర్లు వినగానే ఆందోళన చెందేది ప్రతి తల్లిదండ్రి. యువతను మత్తు వైపు నెట్టే పరిస్థితులపై బొల్లం మల్లయ్య యాదవ్ పదేపదే ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజల్లో వినిపిస్తున్న ఆందోళనలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. యువత చేతిలో పుస్తకం ఉండాల్సిన సమయంలో మత్తు చేరకూడదనే ఆవేదనతో ఈ సమస్యలను నిరంతరం ప్రస్తావిస్తున్నారు. సమాజాన్ని లోపల నుంచి దెబ్బతీసే సమస్యలను రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నారు.

**ప్రజల సొమ్ముకు కాపలా.**

అభివృద్ధి పనుల పేరుతో ప్రజాధనం ఖర్చవుతున్నప్పుడు ఆ పనుల నాణ్యతపై ప్రశ్నించడం కూడా ప్రజా బాధ్యతే అని బొల్లం చెబుతున్నారు. కోదాడలో జరుగుతున్న యూజీడీ పనులపై నాణ్యతకు సంబంధించిన సందేహాలు తలెత్తినప్పుడు వాటిపై ప్రశ్నించారు. పనులు పూర్తయిన తర్వాత తప్పులు కనిపెట్టడం కంటే.. జరుగుతున్నప్పుడే నిలదీయాలని డిమాండ్ చేశారు. ప్రజల డబ్బుతో జరిగే పనుల్లో ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందే అనే సందేశాన్ని ముందుకు తీసుకువచ్చారు.

**రేపటి కోదాడ కోసం కూడా..**




ఈరోజు రైతు సమస్య మాత్రమే కాదు.. రేపటి కోదాడ అభివృద్ధి కూడా ముఖ్యమే. హైదరాబాద్,అమరావతి చెన్నై హైస్పీడ్ రైలు మార్గం కోదాడ మీదుగా వెళ్లాలని డిమాండ్ చేస్తూ బొల్లం మల్లయ్య యాదవ్ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతానికి రవాణా, అభివృద్ధి అవకాశాలు రావాలని డిమాండ్ చేశారు. నేటి సమస్యలకు పరిష్కారం కోరడమే కాదు.. రేపటి తరానికి అవకాశాలు సాధించడమూ రాజకీయ నాయకుడి బాధ్యతే అనే ఆలోచనను ఈ పోరాటం ప్రతిబింబించింది.

**హామీలు గుర్తు చేస్తున్న పోరాటం.**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోవద్దని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. గ్యారంటీలు.. రైతు సమస్యలు.. సాగునీరు.. విద్యుత్.. యువతకు ఇచ్చిన హామీలు.. అమలు ఎక్కడ? అంటూ ప్రశ్నిస్తున్నారు. పాలకులను ప్రశ్నించడం ప్రతిపక్షం చేసే రాజకీయమే కాదు.. ప్రజలకు ఇచ్చిన మాటను గుర్తుచేయడం ప్రజా బాధ్యత కూడా అనే వాదనను ఆయన ముందుకు తీసుకెళ్తున్నారు.

**వంటావార్పు నుంచి విద్యార్థుల ధర్నా వరకు.**

సమస్యకు తగ్గట్టు పోరాటం కూడా మారుతోంది. గ్రామాల్లో వంటావార్పు.. పట్టణాల్లో ధర్నా.. విద్యార్థులతో నిరసన.. రైతులతో ఉద్యమం.. ప్రతి సమస్యను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విభిన్న రూపాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు ఇచ్చిన హామీలు, యువత ఉపాధి వంటి అంశాలపై విద్యార్థుల పక్షాన నిలుస్తున్నారు. రైతు నుంచి విద్యార్థి వరకు.. పేద నుంచి మధ్య తరగతి వరకు.. గ్రామం నుంచి పట్టణం వరకు.. సమస్య ఎవరిదైనా తనదేనన్నట్టుగా పోరాటం చేస్తున్నారు.

**విద్యార్థి ఉద్యమ పంతం ఇంకా అలాగే..**

కాలం మారింది. రాజకీయ పరిస్థితులు మారాయి. పదవులు మారాయి. కానీ ప్రశ్నించే స్వభావం మాత్రం మారలేదనే అభిప్రాయం ఆయన పోరాటాలను చూస్తే కలుగుతుంది. విద్యార్థి ఉద్యమ నాయకుడిగా తనలో ఏర్పడిన పోరాట స్ఫూర్తిని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. అన్యాయం కనిపిస్తే మౌనం కాదు. అక్రమం కనిపిస్తే రాజీ కాదు. ప్రజలకు సమస్య వస్తే వెనుకడుగు కాదు. ప్రశ్నించడమే తన రాజకీయ ఆయుధంగా మార్చుకున్న నాయకుడిగా బొల్లం మల్లయ్య యాదవ్ ముందుకు సాగుతున్నారు.

**పదవి లేదు.. ప్రజల బలం ఉంది!**

రాజకీయాల్లో అసలైన శక్తి పదవిలో కాదు.. ప్రజల విశ్వాసంలో ఉంటుందని బొల్లం మల్లయ్య యాదవ్ తన రాజకీయ ప్రయాణంతో చూపించే ప్రయత్నం

## పదవి లేకున్నా ప్రజల పక్షాన విరామమెరగని పోరాటం.

## రైతు నుంచి పేద వరకు అక్రమాల నుంచి పాలకుల వైఫల్యాల వరకు నిలదీస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్.



చేస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజల మధ్య కనిపించే రాజకీయాలకు భిన్నంగా.. నిత్యం ప్రజల మధ్య తిరుగుతూ సమస్యలను తెలుసుకుంటున్నారు. ప్రజల బాధను వింటున్నారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నారు. అవసరమైతే ఉద్యమిస్తున్నారు.

**పదవి లేదు.. కానీ పంతం ఉంది. అధికారం లేదు.. కానీ ప్రశ్నించే ధైర్యం ఉంది. అధికారిక హోదా లేదు.. కానీ ప్రజల కోసం పోరాడే సంకల్పం ఉంది.**

పోరాటమే ఆయన గుర్తింపు.
రైతు పొలంలో నీరు లేకపోతే ఆయన ప్రశ్న.. కరెంటు అందకపోతే ఆయన పోరాటం.. పేదవాడికి అన్యాయం జరిగితే ఆయన అండ.. పోలీసు వ్యవస్థపై ఆరోపణలు వస్తే ఆయన నిలదీత.. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు ముప్పుపై ఆయన హెచ్చరిక.. ప్రజాధనం వృథా అవుతుందన్న సందేహం వస్తే ఆయన ప్రశ్న.. అభివృద్ధి అవకాశాన్ని కోదాడ కోల్పోతే ఆయన ఉద్యమం.. సమస్యలు మారుతున్నాయి.. పోరాటాల రూపాలు మారుతున్నాయి.. కానీ ప్రజల పక్షాన నిలబడాలనే బొల్లం మల్లయ్య యాదవ్ పంతం మాత్రం మారడం లేదు.

**అధికారం దూరమైనా.. ప్రజలకు దూరం కాలేదు ఎన్నికలు ముగిసినా.. ప్రజా పోరాటం ఆగలేదు!**

కోదాడలో అన్యాయం కనిపిస్తే ప్రశ్నించే గొంతుగా.. అక్రమాలపై నిలదీసే స్వరంగా.. పేదలకు ఆపద వస్తే అండగా.. రైతు సమస్యలకు పోరాట యోధుడిగా.. నిత్యం ప్రజల మధ్యే తిరుగుతూ బొల్లం మల్లయ్య యాదవ్ తన ప్రజా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. పదవి కోసం కాదు.. ప్రజల కోసం. అధికారం కోసం కాదు.. న్యాయం కోసం. రాజకీయ లాభం కోసం కాదు.. ప్రజల గొంతుకగా నిలవడం కోసం.అదే బొల్లం.. అదే పంతం.. అదే పోరాటం.

# ఉప్పల్‌లో 5 నూతన మీ-సేవ కేంద్రాలు

**- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం.. ఈ నెల 17 వరకు అవకాశం**

**- రాత, మౌఖిక పరీక్షల ద్వారా అభ్యర్థుల ఎంపిక**

**- రూ.500 డీడీతో దరఖాస్తు.. తహసీల్దార్ కార్యాలయంలో సమర్పణ**

బాచుపల్లి, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): ఉప్పల్ మండల పరిధిలో నూతనంగా ఐదు మీ-సేవ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఇ-గవర్నెన్స్ సొసైటీ చైర్మన్ తెలిపారు. ఇందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. సెప్టెంబరు 8 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై.. సెప్టెంబరు 17న సాయంత్రం 5 గంటలకు ముగియనుంది.

***ఈ ప్రాంతాల్లో కేంద్రాలు***

నాచారం సర్కిల్ పరిధిలోని నెహ్రూనగర్, మల్లాపూర్ సర్కిల్ పరిధిలోని భవానీనగర్, చిలకానగర్, కొత్తపేటలోని మోహన్‌నగర్, నాగోల్ ప్రాంతాల్లో నూతన మీ-సేవ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

***అర్హతలు ఇవే..***

అభ్యర్థి ఉప్పల్ మండలానికి చెందిన స్థానికుడై ఉండాలి. కనీసం డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగి ఉండటంతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఉండాలి. వయస్సు 21 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. రాత పరీక్ష, మౌఖిక పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. నిరుపేదలు, దివ్యాంగులు, ఇతర వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు నిబంధనల మేరకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

***పత్రాలు తప్పనిసరి***

కేంద్ర నిర్వహణకు అవసరమైన పెట్టుబడి సమకూర్చుకునే సామర్థ్యం అభ్యర్థికి ఉండాలి. ఎంపికైన అభ్యర్థులు పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుతో పాటు విద్యార్హతలు, కుల, నివాస, ఆధార్, ఎస్ఎస్‌సీ ధ్రువపత్రాల గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన ప్రతులను జత చేయాలి.

***రూ.500 డీడీతో దరఖాస్తు***

'డిస్ట్రిక్ట్ ఇ-గవర్నెన్స్ సొసైటీ, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా' పేరిట రూ.500 డిమాండ్ డ్రాఫ్ట్ తీసి దరఖాస్తుకు జత చేయాలి. అధికారిక జిల్లా వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు నమూనాను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను పనివేళల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలి.

దరఖాస్తుల ప్రారంభ తేదీ: సెప్టెంబరు 8, 2026

దరఖాస్తుల చివరి తేదీ: సెప్టెంబరు 17, 2026 సాయంత్రం 5 గంటల వరకు

# ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు.. ప్రజావాణి ఎక్కడ?

**- కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించకపోవడంపై సీపీఐ ఆగ్రహం**

**- వచ్చే సోమవారం ప్రజావాణి నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించాలి: ఉమా మహేష్**

**- ప్రభుత్వ నిర్ణయాలు అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**



గాజులరామారం, సెప్టెంబర్ 7 (విజన్ ఆంధ్ర): మండల రెవెన్యూ కార్యాలయాల్లో ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించినప్పటికీ.. కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం ప్రజావాణి నిర్వహించడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆరోపించారు. ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులను గతంలో మాదిరిగానే ఇన్‌వార్డు విభాగంలో అందజేసి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఉమా మహేష్ పేర్కొన్నారు. అన్ని సమస్యలు వెంటనే పరిష్కారం కాకపోయినా ప్రజలకు ప్రజావాణిపై ఇప్పటికీ విశ్వాసం ఉందన్నారు. అయితే అధికారులు సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించడం, ప్రజావాణి కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించకపోవడం వల్లే గతంలో ఉన్నంత స్పందన ప్రస్తుతం కనిపించడం లేదని విమర్శించారు.

**వచ్చే సోమవారం ప్రజావాణి నిర్వహించాలి**

కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో వచ్చే సోమవారం తప్పనిసరిగా ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించాలని ఉమా మహేష్ డిమాండ్ చేశారు. అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపడంతో సరిపెట్టకుండా, వాటి పరిష్కారానికి కాలపరిమితితో కూడిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను అధికారులే అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజావాణి వంటి కార్యక్రమాల అమలుపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని, ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉమా మహేష్ డిమాండ్ చేశారు.

# !! విజన్ ఆంధ్ర ఎఫెక్ట్...!!


# మహిళ వార్డు సభ్యులకు నోటీసులు జారీ

**- మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని నోటీసు.**

**- "మహిళ వార్డు సభ్యుల జాడెక్కడ" కథనానికి స్పందన.**

**- ఎట్టకేలకు స్పందించిన పంచాయతీ శాఖ అధికారులు**

**- హర్షం వ్యక్తం చేసిన ప్రజలు.**




నందిగామ, సెప్టెంబర్ 07(విజన్ ఆంధ్ర న్యూస్): దవురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని భారత రాజ్యాంగం మహిళలకు కూడా సమానంగా రిజర్వేషన్ కల్పించినప్పటికి పంచాయతీ ఎన్నికల్లో గెలుపొంది పంచాయతీలోని తమ తమ వార్డులోని సమస్యలను తెలుసుకోవడంలో, వాటిని పరిష్కారం చేయడంలో ఎక్కడ కనిపించక పలు విమర్శలు వెలువేత్తాయి. సుమారుగా పంచాయతీ పాలకవర్గం గెలుపొంది గత తొమ్మిది నెలలు గడుస్తున్నా అధికారిక కార్యక్రమాలకు,గ్రామ సభలకు,పాలకవర్గ సమావేశాలు గైహాజరువుతూనే ఉన్నాయి. పలుమార్లు వార్త కథనాలు ప్రచురితమైన అధికారుల్లో ఎలాంటి చలనం కనిపించలేదు. అదే విధంగా గత వారంలో 3వ తేదీన మండల కేంద్రమైన నందిగామ గ్రామపంచాయతిలో గురువారం జరిగిన గ్రామ సభలకు రంగారెడ్డి పంచాయతీ శాఖ అధికారి సురేష్ మోహన్ హాజరైన సమావేశానికి సైతం పంచాయతీ మహిళ వార్డుసభ్యులు గైహాజరయ్యారు. ఈ విషయంపై "విజన్ ఆంధ్ర" దినపత్రికలో "మహిళ వార్డుసభ్యుల జాడెక్కడ" అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు మండల ఎంపీఓ చక్రధర్,స్థానిక కార్యదర్శి వై.వి. రాజు లు స్పందించి ఐదు మంది మహిళ వార్డుసభ్యులకు నోటీసులు జారీ చేశారు. ఈ విషయంపై



విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
04 Sep 2026 - Page 2
epaper.visionandhra.in

విజన్ ఆంధ్ర | శుక్రవారం 4-09-2026

**మహిళ వార్డుసభ్యుల జాడెక్కడ.....?**

- డిపిఓ సాక్షిగా గ్రామసభకు హాజరుకానీ మహిళ వార్డుసభ్యులు
- డిపిఓ హాజరైన గ్రామసభకు సైతం మహిళ వార్డుసభ్యులు గైహాజరు
- మహిళ వార్డుసభ్యులు ఇళ్లకే పరిమితమా...?
- 9 నెలలు గడుస్తున్నా అధికారిక సమావేశాలకు హాజరు కానీ మహిళ వార్డుసభ్యులు
- వార్త పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ అధికారుల చర్యలు శూన్యం..
- చోద్యం చూస్తున్న అధికారులు,సర్పంచ్.

నందిగామ:సెప్టెంబర్ 03(విజన్ ఆంధ్ర న్యూస్); పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని భారత రాజ్యాంగం మహిళలకు కూడా సమానంగా రిజర్వేషన్ కల్పించిన విషయం అందరికి తెలిసిందే.ఇక్కడ మాత్రం ఆ నిబంధనలు పని చేయవు.ఎలాంటి అధికారిక సమావేశానికైన,గ్రామసభలకైన, పాలకవర్గ సమావేశాలకు సైతం మహిళ వార్డుసభ్యులు గైహాజరవడం ఆనవాయితీగా వస్తుంది.ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం తమకేని తెలియదన్నట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది.మరోపక్క ప్రభుత్వం మహిళలు మహారాణులు అవ్వలని అన్ని రంగాల్లో దూసుకుపోవాలని ఆకాంక్షిస్తుంటే,వీళ్ళేమో మేము ఇళ్లకే పరిమితం అనే చందంగా వ్యవహరిస్తున్నారు.వివరాల్లోకి వెళితే నందిగామ గ్రామ పంచాయతీలోని మహిళా వార్డు సభ్యులు వార్డులోని సమస్యలను తెలుసుకోవడంలో, వాటిని పరిష్కారం చేయడంలో ఎక్కడ కనిపించడం లేదని,కనీసం అధికారిక సమావేశాలకు కూడ మహిళ వార్డుసభ్యులు హాజరు కాకపోవడం ఆశ్చర్యానికి తావిస్తోంది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం మండల కేంద్రమైన నందిగామ గ్రామ గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం నిర్వహించిన గ్రామ సభకు ముఖ్యఅతిథులుగా డిపిఓ(జిల్లా పంచాయతీ అధికారి) సురేష్ మోహన్ హాజరయ్యారు.ఎవరైతే మాకేంటి అనుకున్నారో,వీళ్ళేం చేస్తారులే అనుకున్నారో ఏమో కానీ డిపిఓ(జిల్లా పంచాయతీ అధికారి) సురేష్ మోహన్ సాక్షిగా మహిళ వార్డుసభ్యులు మూకుమ్మడిగా గైహాజరు అవ్వడం తీవ్ర చర్చానియంశ నీయంగా మారింది.ఒక జిల్లా అధికారి వచ్చినప్పటికీ గ్రామసభకు మహిళ వార్డుసభ్యులు రాకపోవడం ఏంటని,ఇలాంటి వాళ్ళు వార్డు సభ్యులుగా ఎందుకు నిలుచుంటారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

**చోద్యం చూస్తున్న...అధికారులు,సర్పంచ్....**

పంచాయతీ ఎన్నికై తొమ్మిది నెలలు గడుస్తున్నప్పటి నుంచి అధికారిక సమావేశాలకు,గ్రామసభలకు,పాలకవర్గ సమావేశాలకు సైతం మహిళ వార్డుసభ్యులు గైహాజరు కావడంపై స్థానిక అధికారులు,సర్పంచ్ చూసిచూడన్నట్లుగా వ్యవహరించడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**వార్త పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ అధికారుల చర్యలు శూన్యం.....**

పలుమార్లు వార్త పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ అధికారుల చర్యలు శూన్యమని, అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదో పెరుమళ్లకేరుక...?? ఒక జిల్లా అధికారి హాజరైన సమావేశానికి సైతం హాజరుకాని వార్డుసభ్యులపై ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాల్సిందే....

జిల్లా అధికారి సురేష్ మోహన్ ని వివరణ కోరగా తప్పకుండా మహిళ వార్డు సభ్యులు సమావేశాల్లో పాల్గొనాల్సిన అవసరం ఉంటుందన్నారు. గైహాజరైన మహిళ వార్డు సభ్యులు భాగంగానే నోటీసులు అందజేశామని, మహిళ వార్డు సభ్యుల వివరణను బట్టి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండే విధంగా పలు వార్త కథనాలు ప్రచురించిన విజన్ ఆంధ్ర పత్రికపై హర్షం వ్యక్తం చేశారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.

# బాధితులకు న్యాయం చేయండి

**- అధికారులకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశం**



నల్గొండ జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 07: నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ బాధితుల ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధి నుంచి వచ్చిన దాదాపు 38 మంది బాధితుల సమస్యలను, ఫిర్యాదులను ఎస్పీ సవివరంగా విని సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి సంబంధిత వివాదాలపై తమ ఫిర్యాదులను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి బాధితుల ఫిర్యాదుల విషయంలో ఎలాంటి జాప్యం చేయకుండా వాస్తవాలను పూర్తి స్థాయిలో విచారించాలని ఆదేశించారు. అవసరమైన చోట కేసులు నమోదు చేయడం, దర్యాప్తు చేపట్టడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారంపై స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ శాఖ దృష్టికి తీసుకువచ్చినప్పుడు వాటిని బాధ్యతాయుతంగా స్వీకరించి బాధితులకు అండగా నిలవాలని ఎస్పీ అధికారులకు సూచించారు.

# గణేష్ మండప నిర్వాహకులకు అధికారుల దిశానిర్దేశం

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 07: రాబోయే వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, సామరస్యంగా నిర్వహించేందుకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, మండప నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్సై కురుమూర్తి మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని స్పష్టం చేశారు. రోడ్లకు అడ్డంగా గణపతి మండపాలు పెట్టరాదని, శాశ్వత షెడ్లు వేయకూడదని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పండుగ జరుపుకోవాలని అన్నారు. మండపంలో దీపాన్ని జాగ్రత్తగా ఉంచాలని, మండపంలో నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలని, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే పూర్తి బాధ్యత మండప నిర్వాహకులదేనని హెచ్చరించారు. నిమజ్జనం గొడవలు లేకుండా చేసుకోవాలని, గొడవలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక చేశారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ మాట్లాడుతూ పండుగను సామరస్యంగా జరుపుకోవాలని కోరారు. గత రెండు సంవత్సరాలుగా అందరి సహకారంతో గణేష్ ఉత్సవాలు మంచిగా నిర్వహించామని, ఈ సంవత్సరం కూడా అందరి సహకారం ఉండాలని మండప నిర్వాహకులను కోరారు. మున్సిపల్ నుంచి అన్ని ఏర్పాట్లు చేస్తామని, నిమజ్జనం ఎక్కడ నిర్వహించాలనేది అధికారులు, మున్సిపల్ చైర్మన్, సభ్యులతో మాట్లాడి త్వరలో ఖరారు చేస్తామని, వర్షాకాలం అంతగా లేకపోవడంతో ఏర్పాట్లపై త్వరలో స్పష్టత ఇస్తామని తెలిపారు. అగ్నిమాపక సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి మండపం వద్ద బకెట్లు, డ్రమ్ములలో మట్టి, నీళ్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి పండుగ చేస్తున్నప్పుడు ఫైర్ కిట్లను కూడా తెచ్చుకుంటే నిర్వాహకులకే ఉపయోగపడుతుందని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ స్తంభాల నుంచి విద్యుత్ కనెక్షన్ తీసుకునేటప్పుడు నాణ్యమైన, ఐఎస్ఐ మార్క్ ఉన్న వైర్లను మాత్రమే వాడాలని, మండపాల వద్ద వైర్లు వేలాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఎస్ఐ రాజశేఖర్, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు..



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్..



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై....



సమావేశంలో మాట్లాడుతున్న అగ్నిమాపక సీఐ...

# బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ లక్ష్మీ సుదర్శన మహా యజ్ఞం ప్రారంభం



అల్వాల్, సెప్టెంబర్ 7, విజన్ ఆంధ్ర:అల్వాల్ సర్కిల్ పరిధిలోని బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీ లక్ష్మీ సుదర్శన మహా యజ్ఞం ప్రారంభమైంది. ఈ యాగం ప్రారంభించిన నూతన ఈవో సతీష్ కుమార్ మాట్లాడుతూ... నేటి నుండి మూడు రోజుల పాటు ఈ యాగం కొనసా గుతుందన్నారు. లోక కల్యాణార్థం భక్తుల అభీష్టం మేరకు యాగం నిర్వ హించినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన క్రతువు నిర్వహణ ఆచార్యులు విజయ సారథి, ప్రధాన అర్చకులు రఘు పంతులు, వంశీ పంతులు, శ్రీనివాస్ పంతులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వెంకటరామిరెడ్డి, నిమ్మ సుమతి, రామచంద్రరావు, శ్రీనివాస్ గౌడ్, శారద, విజయ, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ కార్పొరేషన్‌కు జాతీయ స్థాయిలో ఘన గుర్తింపు

**- స్వచ్ఛ వాయు సర్వేక్షణలో దేశంలో 2వ ర్యాంక్**




నల్గొండ జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 07: స్వచ్ఛ వాయు సర్వేక్షణ – 2026లో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ సత్తా చాటింది. ఎన్ సీఏపీ వార్డు స్థాయి స్వచ్ఛ వాయు సర్వేక్షణలో కేటగిరీ–3లో జాతీయ స్థాయిలో 2వ ర్యాంక్ సాధించి అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. దేశవ్యాప్తంగా 130 పట్టణ స్థానిక సంస్థలు పాల్గొన్న ఈ సర్వేక్షణలో నల్గొండ డివిజన్ కు ఈ గుర్తింపు లభించింది. అవార్డుతో పాటు రూ.20 లక్షల నగదు బహుమతిని ప్రకటించారు. న్యూఢిల్లీలోని ఇందిరా పర్యావరణ భవన్ లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ బి. వంశీకృష్ణ, కార్పొరేటర్ పెరిక స్వాతి అవార్డును స్వీకరించారు. గాలి నాణ్యత మెరుగుదల, రహదారి దుమ్ము నియంత్రణ, పచ్చదనం పెంపు, ఘన వ్యర్థాల నిర్వహణలో నల్గొండ చూపిన ప్రతిభకు ఈ ప్రత్యేక గుర్తింపు లభించింది. అలాగే జంక్షన్ల అభివృద్ధి, ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, ట్రాఫిక్ కారిడార్లలో పచ్చదనం, జీవీపీల రూపాంతరం, ఎంఆర్ఎఫ్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రశంసలు లభించాయి. ఈ సందర్భంగా మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో నల్గొండను తెలంగాణలోనే నంబర్–1 కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతామని అన్నారు. కమిషనర్ బి. వంశీకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన నల్గొండ నిర్మాణమే తమ లక్ష్యమని తెలిపారు.

# అమ్రాబాద్ లో దారుణం - ఇంట్లో కుళ్లిన మృతదేహం - భార్య, కుమారులే హత్య చేశారా?

***గోనె సంచిలో మూటకట్టి పెట్టెలో కుక్కి తరలించే యత్నం? - రంగంలోకి క్లూస్ టీమ్...***



మృతుని ఫోటో.....

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 07: నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తను భార్య, కుమారులే హత్య చేశారన్న అనుమానాలు కలకలం రేపుతున్నాయి. మండల కేంద్రానికి చెందిన జాంగిర్ అనే వ్యక్తి మూడు రోజుల క్రితం హత్యకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. హత్య అనంతరం మృతదేహాన్ని గోనె సంచిలో మూటకట్టి పెట్టెలో కుక్కి గుట్టుచప్పుడు కాకుండా తరలించేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఆ ప్రయత్నం విఫలం కావడంతో మృతదేహాన్ని ఇంట్లోనే వదిలేసి ఇంటికి తాళం వేసి భార్య, కుమారులు పరారైనట్లు సమాచారం. ఇంటి నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అమ్రాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తాళాలు తెరిచి పరిశీలించగా కుళ్లిన స్థితిలో మృతదేహం బయటపడింది. వెంటనే క్లూస్ టీమ్ ను రప్పించి ఆధారాలు సేకరించారు. కుటుంబ కలహాలే హత్యకు కారణమా, మృతదేహాన్ని తరలించేందుకు ఎందుకు ప్రయత్నించారు, ఈ ఘటనలో మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఇద్దరు కుమారులు మత్తు పదార్థాలకు బానిసలనే చర్చ స్థానికంగా జరుగుతున్నప్పటికీ పోలీసుల నుంచి ఎలాంటి అధికారిక నిర్ధారణ రాలేదు. ఈ ఘటనపై అమ్రాబాద్ ఎస్సై హనుమంత్ రెడ్డిని వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిస్తోందని, విచారణ పూర్తయ్యాక పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.





# ఓ వ్యక్తి అదృశ్యం



మల్కాజిగిరి, సెప్టెంబర్ 7, విజన్ ఆంధ్ర: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మల్కాజిగిరి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచే సుకుంది. మెదక్ జిల్లా మాసాయిపేట్ మండలం బొమ్మరం గ్రామానికి చెందిన రైతు కుమ్మరి నాగభూషణం (50),శ్యామల భార్య భర్తలు. నాగభూషణంకు ఆరోగ్యం బాగా లేకపోవడం తో ఆగస్ట్ 31 వ తేది వైద్య చికిత్స నిమిత్తం మల్కాజ్గిరి కి వచ్చి ఇక్కడ ఓ ఆసుపత్రి లో చికిత్స చేయించుకు న్నాడు. ఆ తరువాత ఈ నెల 6వ తేది ఇంట్లో ఎవరికి చెప్పకుండా నాగభూషణం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుండి ఆయన ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేదు. దీంతో బాధితురాలు శ్యామల తన భర్త కనిపించడం లేదంటూ మల్కాజ్గిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదృశ్యమైన వ్యక్తి యొక్క ఎత్తు:5'.2", కోల ముఖం, చామనచాయ రంగు. ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఫోన్ నెంబర్ 7893299671 కు గాని లేదా తమకు గాని సమాచా రం అందించాలని మల్కాజ్గిరి పోలీసులు కోరారు.

# అభివృద్ధి పనులపై వారానికోసారి సమీక్ష

**- ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్**




నల్గొండ జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 07: మండల ప్రత్యేక అధికారులు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతి వారం మండలంలో సమీక్షించి నివేదిక సమర్పించాలని, ఆ నివేదిక ఆధారంగా ప్రతి శుక్రవారం తాను సమీక్షిస్తానని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ 88 మంది దరఖాస్తుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహించారు. నోటీసులు జారీ చేసిన ఓటర్ల విచారణ పురోగతిని పెంచాలని, నీటి నిలువ కట్టడాలు, సోక్ పిట్లు, పర్కులేషన్ ట్యాంకుల మంజూరుపై సమీక్షించాలని, ఈ నెలాఖరు నాటికి గుడిసెల్లో నివసించే లబ్ధిదారుల గుర్తింపు పూర్తి చేయాలని, సీఎం కార్యాలయం నుంచి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, చేయూత పెన్షన్ల పరిశీలన వివరాలు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకు 1368 మంది టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించామని, టీబీ నిర్మూలనకు ప్రతి మండలంలో 4–5 మందితో కమిటీ వేసి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పౌష్టికాహార కిట్లు పంపిణీ చేయాలని డీఎం & హెచ్ఓను ఆదేశించారు. అదే రోజు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్, ఎస్ఐఆర్–2026 ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. నోటీసులు జారీ చేసిన కేసుల విచారణ, డాక్యుమెంటేషన్ పరిశీలన కొనసాగుతోందని, డాక్యుమెంట్లు లేని కేసులకు పత్రాలు సేకరించి నిర్దేశిత సమయంలోగా ప్రక్రియ పూర్తి చేస్తామని, ఫామ్–7, ఫామ్–8ల కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, డీఆర్ఓ దశరథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఉప్పల్ బగాయతులో ఈనెల 13న భూమి పూజ

**- భూమి పూజకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
**- వేల సంఖ్యలో ఆర్యవైశ్య ప్రతినిధులు తరలి రావాలి**
**- రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పిలుపు**





కాప్రా/సెప్టెంబర్ 7(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని ఉప్పల్ బగాయత్లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల కోసం కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో నిర్మించే ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఆర్య వైశ్యులు వేలాదిగా తరలి రావాలని తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం నాడు ఉప్పల్ బగాయతులో జరిగిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరవాది మాట్లాడుతూ ఈనెల 13వ. తేదీన నిర్వహించే భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్రంలోని ఆర్యవైశ్య సోదరీ సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలోని ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు బాధ్యత వహించి అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని వైశ్యుల సత్తా ను చాటాలని, రాబోయే ఎన్నికల్లో మన ఐక్యత ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సుమారు 30 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో అంగరంగ వైభవంగా నిర్మాణం జరగనుందని ఆయన వివరించారు. భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ కీలక భూమిక పోషించాలని అధ్యక్ష కార్యదర్శులు బెలిదే రమేష్ గుప్తా, బచ్చు నగేష్ గుప్తా లకు సూచించారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉప్పల్ బగాయతులో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ భవన సముదాయం ఏర్పాటు కావడం జిల్లాకే గర్వకారణమని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి బెలిదే రమేష్ గుప్తా , బచ్చు నగేష్ గుప్త లు అన్నారు. భవన సముదాయ నిర్మాణంలో తమ వంతు బాధ్యతగా కీలకపాత్రను పోషిస్తామని తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని ఆర్యవైశ్య లందరూ ఈనెల 13న జరిగే భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి విచ్చేస్తున్నందున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వం కేటాయించిన ఉప్పల్ భగత్ స్థలంలో ఉదయం 8 గంటలకు శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్నామని దంపతులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొనవచ్చు అని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ కమిటీ చైర్మన్ అగ్గి వెంకటేష్, మాజీ కోశాధికారి నేతి రాములు,ఉపాధ్యక్షుడు ఊరే లక్ష్మణ్ ,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు భేలిదే రమేష్,ప్రధాన కార్యదర్శి బచ్చు నగేష్ కుమార్,మెంబర్ షిప్ కమిటీ చైర్మన్ పెరుమాళ్ అనిల్ బాబు, కాసం వెంకట హరి, పెద్ది శ్రీనివాస్, తారకేష్, రమేష్, బిక్కుమల్ల రమేష్, పొద్దుటూరు నర్సింగరావు, సత్యనారాయణ, పవన్,సుధాకర్,శ్రీను,సంతోష్ రాష్ట్ర మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి సామ్రాజ్య లక్ష్మి,ఉపాధ్యక్షురాలు బచ్చు సుదీప,భేలిదే వసంత,బచ్చు సరిత,పోలా చందన,శిరీష, వివిధ మండలాల, పట్టణ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, సభ్యులు, ఆర్యవైశ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా బి ఆర్ ఎస్ ఆందోళన

మిర్యాలగూడ, సెప్టెంబర్ 7,(విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపిస్తూ సోమవారం మిర్యాలగూడ లో బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలోసోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు,కార్యకర్తలు సమావేశమై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి గాంధీ బొమ్మ, బస్టాండ్ మీదుగా రౌండ్ దాకా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ లతో ఆర్డీవో,ఎంపిడిఓ కార్యాలయాలలో వినతిపత్రాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ తిప్పన విజయసింహ రెడ్డి,చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి,అన్నబీమోజు నాగార్జున చారి,ఎండి.ఇలియాస్ ఖాన్,ధనావత్ చిట్టిబాబు నాయక్,ఎండి.మగ్దుం పాషా, ఎండి.మాజీద్, పద్మశెట్టి కోటేశ్వర రావు,గంగుల బిక్షం,చంద్రశేఖర రావు,రవి,దుర్గాప్రసాద్, మట్టపల్లి సైదులుయాదవ్,,ఎండి.షోయబ్,యర్రమల్ల దినేష్, చౌగాని బిక్షం గౌడ్, వింజం శ్రీధర్,పెండ్యాల పద్మ,కోదాటి రమా,షహనాజ్ బేగం,పెరుమాళ్ళ ధనమ్మ, లలిత,పార్టీనాయకులు, ప్రజాప్రతినిధులు, వార్డు ఇన్‌చార్జిలు,పార్టీ కార్యకర్తలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలం : బిఆర్ఎస్



మల్కాజిగిరి, సెప్టెంబర్ 7,(విజన్ ఆంధ్ర): ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మల్కాజిగిరి బిఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శించారు. బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామా రావు, మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం బిఆర్ఎస్ నాయకులు మల్కాజిగిరి సర్కిల్ కార్యాల యం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా మల్కాజిగిరి "ప్రజావాణి" కార్యక్రమం లో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంత రం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఇచ్చిన 420 హామీలు అమలులో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలు ఎదుర్కొంటున్న తాగు నీరు, వీధిదీపాలు, బస్తీ దవాఖాన ఏర్పాటు, వృద్ధులకు పింఛన్లు, తదితర సమ స్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, మేకల సునీత రాముయాదవ్, బిఆర్ఎస్ నాయకులు జేఏ సీ వెంకన్న, రాము యాదవ్, చిన్నయాదవ్, టిఆర్ఎస్వి నర్సింగ్, ప్రభాకర్ గౌడ్, కేబుల్ రమేష్, సతీష్, సుధాకర్,కోటేష్, శ్రీకాంత్, నవీన్, ఇబ్రహీం,కిట్టు, ఉపేందర్, అనిత, లక్ష్మి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా.. భక్తిశ్రద్ధలతో గణేశ్ ఉత్సవాలు

**- పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి - డీజీపీ సీవీ ఆనంద్**
**- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్త సమీక్ష**
**- జిల్లా ఏర్పాట్లను వివరించిన ఎస్పీ సునీతా రెడ్డి**






వనపర్తి జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర) : రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రజలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా ముందస్తు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం నుంచి రాష్ట్రంలోని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సున్నిత ప్రాంతాలు, ర్యాలీలు, నిమజ్జన కార్యక్రమాలు, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.డీజీపీ మాట్లాడుతూ గణేష్ మండపాలు, ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రాంతాలు మరియు ప్రధాన కూడళ్ల వద్ద తగిన స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేయాలి. చిన్నపాటి సంఘటనలు సైతం పెద్ద సమస్యలకు దారితీయకుండా స్థానిక పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలి.

***సోషల్ మీడియాపై కఠిన నిఘా***

వదంతులు, తప్పుడు ప్రచారం, రెచ్చగొట్టే పోస్టులు వ్యాప్తి చెందకుండా సోషల్ మీడియాను నిరంతరం పర్యవేక్షించాలి. ప్రజల్లో అపోహలు సృష్టించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.

***నిమజ్జనం, ట్రాఫిక్ నియంత్రణ***

చెరువులు, జలాశయాల వద్ద భద్రతా ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ సజావుగా సాగేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలి.

***నిర్వాహకులతో సమన్వయం***

ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు మరియు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలి.

***జిల్లా భద్రతా ఏర్పాట్లను వివరించిన ఎస్పీ***

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి.. జిల్లాలో చేపడుతున్న ముందస్తు భద్రతా చర్యలు, బందోబస్తు ఏర్పాట్లు, సున్నిత ప్రాంతాల గుర్తింపు మరియు నిమజ్జన ప్రణాళికలను డీజీపీకి వివరించారు. ఈ సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్, సీఐలు సుగంధ రత్నం, శివకుమార్, రమేష్, నరేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జిల్లాలోని ఎస్సైలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.